
ఒంగోలులో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల



వారు స్మగ్లర్లు.. మా వాళ్లు సౌమ్యులు


చిన్నారిని అప్యాయంగా ఎత్తుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు

రూ.40కోట్ల ఎర్రమట్టిని కొల్లగొట్టిన బాలినేని

ఎర్రచందనం దొంగ చెవిరెడ్డి

మంచితనానికి మారుపేరు మాగుంట
అభివృద్ధికాముకుడు, నమ్మిన వారికి ప్రాణమిచ్చే నేత దామచర్ల
ఒంగోలు ప్రజాగళం సభలో చంద్రబాబు



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ఒకరు ఎర్రమట్టిని కొల్లగొడితే.. మరొకరు ఎర్ర చందనం స్మగ్లర్. జగ్గూభాయ్ జగన్‌కు కావాల్సింది వీళ్లే' అంటూ ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి వైసీపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డిలపై టీడీపీ అధినేత చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఒంగోలులో రాజకీయ రౌడీలను మట్టి కరిపిస్తానంటూ శపథం చేశారు. అదేసమయంలో మంచితనానికి మాగుంట కుటుంబం ఒక బ్రాండ్ అయితే.. దామచర్ల జనార్దన్ అభివృద్ధికాముకుడు, నమ్మిన వారికి ప్రాణమిచ్చే సుగుణశాలి అని కొనియాడారు. ఒంగోలులో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన మిరియాలపాలెం సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. స్థానిక సమస్యలు, రాజకీయ పరిస్థితుల గురించి ప్రస్తావిస్తూ.. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయనకు అభివృద్ధి, ప్రజాసమస్యలు పట్టవని.. నిత్యం జూదాలు, జల్సాలతో గడుపుతారని వ్యాఖ్యానించారు. ఎర్రజర్ల వద్ద ఎర్రమట్టిని కొల్లగొట్టిన స్మగ్లర్ అని ఆరోపించారు. పేదలకు ఇళ్లస్థలాల పేరుతో అభివృద్ధి పనుల మాటున డబ్బు దిగమింగారని, ఆపై నలభై కోట్ల రూపాయల విలువైన ఎర్రమట్టిని అమ్ముకొని సొమ్ముచేసుకున్నారని ధ్వజమెత్తారు. ఇక భూకబ్జాలు, నకిలీ స్టాంపులు, ఫోర్జరీ సంతకాల భాగోతాలతో ఈయనగారి పాలన సాగిందన్నారు. 'నాకు బాగా గుర్తుంది.. సుబ్బారావు అనే వ్యాపారిపై దాడిచేసి హతమార్చే ప్రయత్నం చేశారు. వ్యాపారులను బెదిరించి లొంగదీసుకునేందుకు ప్రయత్నించారు. మామూళ్ల రాజ్యం ఈ ఐదేళ్లు బాహాటంగా కొనసాగింది. అల్లరిమూకలు, రాజకీయ రౌడీలు పెట్రేగిపోయారు. అందుకు నాయకత్వం వహించిన బాలినేని లాంటి వాళ్లు మీకు కావాలా' అని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు.

ఎర్రచందనం స్మగ్లర్ అవసరమా?

లోక్‌సభ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురించి చంద్రబాబు ప్రస్తావిస్తూ.. ఎర్రచందనం స్మగ్లర్ పుష్ప మీకు అవసరమా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉంటేనే ఆయన శేషాచలం మొత్తాన్ని కొల్లగొట్టారు, అలాంటి వ్యక్తులకు ఎంపీగా అవకాశం ఇస్తే సమస్తం దోచేసుకుంటారు జాగ్రత్త అని హెచ్చరించారు. 'లారీల్లో బియ్యం వస్తున్నాయి, దుస్తులూ వస్తున్నాయి, చివరికి డబ్బులూ వస్తున్నాయి. ఈ తరహా ప్రలోభాలపర్వంను నేనింతవరకూ చూడలేదు, నాకు తెలియదు కూడా. దీనికి ఆద్యులైన చెవిరెడ్డి లాంటివారికి అవకాశం ఇస్తే మీ ఆస్తులను కొల్లగొడతారు జాగ్రత్త' అంటూ ప్రజలను హెచ్చరించారు. ధనదాహం, సైకో మనస్తత్వం కలిగిన జగన్ ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్నాడని విమర్శించారు.

ప్రజల నుంచి విశేష స్పందన

ప్రజాగళం కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎన్నికల సమయం కావడంతో కేవలం నగరంలోని పార్టీ శ్రేణులే రావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. అయినా ప్రజలు పెద్దసంఖ్యలో ప్రజాగళం సభకు హాజరయ్యారు. చంద్రబాబు వేదిక వద్దకు చేరుకున్న కొద్దినిమిషాల్లోనే నగర ప్రజలు ఉరుకులు పరుగులతో తరలివచ్చారు. దీంతో సభాప్రాంగణం కిటకిటలాడింది. మిర్యాలపాలెం సెంటర్‌లోని మూడు రహదారుల కూడలిలో ఆయన ప్రసంగించగా ఇటు కలెక్టరేట్ వైపు, మరోవైపు ట్రంక్‌రోడ్డు, ఎదురుగా పాత విజయదుర్గ సినిమాహాల్ వైపు నిలబడి ప్రసంగం విన్నారు. వాతావరణ సమస్యతో మాచర్ల వెళ్లకుండా ముందుగానే ఒంగోలు చేరిన చంద్రబాబు పోలీసుగ్రౌండ్‌లో హెలిప్యాడ్ వద్ద నుంచి నేరుగా తనకు బస ఏర్పాటుచేసిన బృందావనం కల్యాణ మండపానికి చేరారు. అక్కడి నుంచి వీడియోలో మాచర్ల సభకు వచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత 8 గంటల సమయానికి నగరంలోని రాజధాని హోటల్ సెంటర్‌కు చేరిన ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న మిరియాలపాలెం సెంటర్‌కు 8.45కు చేరారు. బాబు రోడ్‌షో ప్రారంభమైందన్న సమాచారం తెలియగానే నగరంలోని వివిధప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలకు అక్కడికి చేరారు. సభాప్రాంగణంలోని మూడు రహదారులు కిటకిటలాడాయి. ముఖ్యంగా నగర నడిబొడ్డు ప్రాంతాల్లో నివసించే అన్నివర్గాల ప్రజలు, విద్యాధికులు, ఉద్యోగులు సభకు తరలిరావడం కనిపించింది. మహిళలు, గృహిణులు కూడా పెద్దసంఖ్యలో వచ్చారు. యువత కేరింతలు కొడుతూ కనిపించింది. బాబు కూడా అన్నివర్గాల వారి సమస్యలను ప్రస్తావిస్తూ భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం ఏర్పడితే చేయబోయే కార్యక్రమాలను విశదీకరిస్తూ మాట్లాడారు. సభలో యువకులు, మహిళలు తమ సమస్యలను ప్రస్తావించాలంటూ కేకలు వేయడంతో చంద్రబాబు తదనుగుణంగా మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. వ్యాపార, ఉద్యోగవర్గాల సమస్యలపైనా చంద్రబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏవిధంగా చేదోడుగా ఉండబోతుందో వివరించారు. యువత, గృహిణులు, ఉద్యోగ వర్గాలకు ఎలా అండగా ఉంటామన్నది వివరిస్తూ బాబు ప్రసంగం సాగింది.

సౌమ్యుడు దామచర్ల

ఒంగోలు అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గురించి ప్రస్తావిస్తూ.. 'సౌమ్యుడు, అజాతశత్రువు, నమ్మిన వారికి ప్రాణమిచ్చే వ్యక్తి అని చంద్రబాబు కొనియాడారు. ఆయన ఎమ్మెల్యేగా ఉండగా రూ.2,600 కోట్లకుపైగా అభివృద్ధి పనులకు నిధులు సాధించారు. నేనూ ప్రోత్సహించాను. తద్వారా అందరి దృష్టిలో అభివృద్ధి కాముకుడిగా పేరొందారు. నమ్మిన వారికి ప్రాణమిచ్చేతత్వంతో అందరి హృదయాలను చూరగొన్నారు' అని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే ఈ జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే బాలినేని సారథ్యంలో ఒక్క డ్రైన్‌లో పూడికతీశారా, రోడ్డుపై ఒక్కతట్ట మట్టివేసి బాగుచేశారా.. అంటూ ఎద్దేవా చేశారు. అందుకే అభివృద్ధి కాముకుడైన జనార్దన్‌ను గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు.

మంచితనానికి మాగుంట బ్రాండ్

మరోవైపు 'ఒక్కసారి మా వైపు చూడండి. మా ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబం మంచితనానికి ఒక బ్రాండ్. ఎంత ఉన్నా ఒదిగి ఉండటం, వినయంగా మెలగటం ఆ కుటుంబానికే చెల్లింది. ఎప్పుడైనా ఒక్కపైసా అవినీతి సొమ్మును ఆశించారా.. అలాంటి మాట మీరెప్పుడైనా విన్నారా' అంటూ చంద్రబాబు ప్రశ్నించారు. అందుకే ఎర్రచందనం స్మగ్లర్‌ను తరిమికొట్టి మీలో ఒకడిగా మీతో ఉన్న మంచివారు మాగుంటను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పట్టుకున్నారు... వదిలేశారు!



- ప్రలోభాలను ముమ్మరం చేసిన వైసీపీ నేతలు
- ఒంగోలులో ఇప్పటికే ఓటుకు రూ.3000 పంపిణీ
- అదనంగా బియ్యం బస్తాలతో ఎర
- హవాలా తరహాలో రూ.50నోటు ఇచ్చి తీసుకెళ్లేలా ఏర్పాట్లు
- ఒకే సీరియల్ నంబర్‌తో ఉన్న 278 నోట్లు స్వాధీనం
- ఒక షాపును సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్
- ఆందోళనకు దిగిన వైసీపీ నేతలు
- సీల్‌ను తొలగించి విచారించి వెళ్లిపోయిన ట్రైనీ ఐఏఎస్

ఒంగోలు (క్రైం), మే 10 : వైసీపీ నేతలు ప్రలోభాల పర్వాన్ని ముమ్మరం చేశారు. ఓటమి భయంతో ఉన్న వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ రకాల తాయిలాలను ఎరవేస్తున్నారు. పోలింగ్‌కు రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో బరితెగించి మరీ పంపకాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఒంగోలులో ఈ వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఓటుకు రూ.3వేలు పంపిణీ చేశారు. దీనికితోడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. అయినప్పటికీ గెలుపుపై నమ్మకం సన్నగిల్లడంతో ఇప్పుడు ఇంటింటికీ బియ్యం బస్తాల పంపిణీకి తెరతీశారు. దీనిపై సీవిజిల్‌కు సమాచారం అందడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ నగరంలోని బండ్లమిట్ట సెంటర్‌లో ఉన్న ఒక దుకాణంలో తనిఖీలు నిర్వహించి సీజ్ చేసింది. అనంతరం వైసీపీ నేతలు అక్కడ ఆందోళనకు దిగడంతో దుకాణాన్ని తెరిచిన అధికారులు అలాగే వదిలేసి వెళ్లిపోవడం విమర్శలకు తావిస్తోంది.

రూ.50నోటు ఇస్తే బియ్యం బస్తా

ఓటర్లకు నేరుగా బియ్యం బస్తాలను పంపిణీ చేస్తే పట్టుబడే అవకాశం ఉండటంతో వైసీపీ నేతలు సరికొత్త విధానాన్ని ఎంచుకున్నారు. ఒక్కో ఇంటికి రూ.50 నోటు ఇచ్చారు. ముందుగానే ఒంగోలులోని కొందరు బియ్యం హోల్‌సేల్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఓటర్లు ఆ వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి ఆ నోటును అందజేస్తే బియ్యం బస్తా ఇచ్చేవిధంగా హవాలా తరహాలో ఏర్పాట్లు చేశారు. రెండు ఓట్లు ఉంటే ఒక బియ్యం బస్తా పంపిణీ చేయడం ప్రారంభించారు.

ముగ్గురు హోల్‌సేల్ వ్యాపారులతో ఒప్పందం

నగరంలోని బండ్లమిట్ట సెంటర్‌లో ఉన్న తాతా కోటేశ్వర్లు దుకాణం, బాపూజీ మార్కెట్ వెనుక వైపు ఉన్న రామచంద్ర ట్రేడింగ్ కంపెనీ, కొత్తకూరగాయల మార్కెట్ ఎదురు ఉన్న లక్ష్మీనారాయణ రైస్ మర్చంట్స్ దుకాణంలో రూ.50 నోటు ఇస్తే బియ్యం బస్తా ఇవ్వడం గురువారం నుంచి ప్రారంభించారు. వైసీపీ నాయకులు ఇచ్చిన రూ.50 నోటును తీసుకొని శుక్రవారం ఉదయం ఓటర్లు నగరంలోని బియ్యం హోల్‌సేల్ వ్యాపారుల దుకాణాల వద్ద బారులు తీరారు. దీనిపై సీ విజిల్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ రంగంలోకి దిగింది. తాతా కోటేశ్వర్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించింది. అక్కడ రూ.50 నోట్లు తీసుకొని బియ్యం బస్తాల కోసం వచ్చిన ఇద్దరిని విచారించింది. అదేసమయంలో దుకాణంలో ఒకే సీరియల్ నంబర్‌తో ఉన్న రూ.50నోట్లు దొరికాయి. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆ దుకాణాన్ని సీజ్ చేశారు.



వైసీపీ నేతల ఆందోళనతో హైడ్రామా

నగరంలోని తాతా కోటేశ్వర్లు దుకాణం సీజ్ చేసిని విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులైన ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర పాలక సంస్థ వైస్‌చైర్మన్ వేమూరి బుజ్జి తదితరులు అక్కడకు చేరుకున్నారు. దుకాణం ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. వ్యాపారులపై అక్రమదాడులంటూ నినాదాలు చేశారు. అక్కడ అసలే ఇరుకు రోడ్డు కావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ నేతలు ఆందోళన చేస్తున్నా పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషించారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అనంతరం కొద్దిసేపటికి ట్రైనీ ఐఏఎస్ శౌర్యమన్ పటేల్ అక్కడికి చేరుకున్నారు. దుకాణానికి ఉన్న సీల్‌ను తొలగించి వైసీపీ నేతల సమక్షంలోనే విచారణ చేపట్టారు. అక్కడ ఒకే సీరియల్ నంబర్‌తో ఉన్న రూ.50 నోట్లు 278 ఉండటంతో వాటిని సీజ్ చేశారు. అయితే దుకాణానికి మళ్లీ సీల్ వేయకుండా ఆయన వెళ్లిపోవడం విమర్శలకు తావిస్తోంది. అదేసమయంలో బాపూజీ మార్కెట్ వెనుక ఉన్న రామచంద్ర ట్రేడర్స్, కొత్తకూరగాయల మార్కెట్ ఎదురు ఉన్న లక్ష్మీనారాయణ రైస్ మర్చంట్స్‌లో బియ్యం పంపిణీ చేస్తున్నా వారి గురించి అధికారులు పట్టించుకోలేదు. సాయంత్రానికి కేశరాజుకుంటలోని విఘ్నేశ్వర ట్రేడర్స్‌లో 1,400 బస్తాలు, రామచంద్ర ట్రేడర్స్‌లో 832 బస్తాల బియ్యాన్ని ఎఫ్ఎస్‌టీ బృందం సీజ్ చేసింది. సమతానగర్ వద్ద ఉన్న చెక్‌పోస్టులో ఒక వాహనంలో రూ.2లక్షలు, మరో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.50వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




బియ్యం దుకాణం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న వైసీపీ నేత కుప్పం తదితరులు

పులివెంకటరెడ్డి కాలనీలో 554 బస్తాల బియ్యం పట్టివేత


లారీలో పట్టుబడిన బియ్యం

నగరంలోని పులివెంకటరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో ఓటర్లకు బియ్యం పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు మూడు లారీల్లో 554 బస్తాల బియ్యాన్ని ఆ ప్రాంతానికి చేర్చారు. వాటిని ఓటర్లకు పంపిణీ చేస్తుండగా సమాచారం తెలుసుకున్న అధికారులు వెళ్లి పట్టుకున్నారు. ఒక లారీ డ్రైవర్ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ తెలిపారు.

299మంది టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ

- పెండింగ్‌లో 87 మంది ప్రతిపాదనలు



ఒంగోలు (విద్య), మే 10 : జిల్లాలో డీఎస్సీ ద్వారా టీచర్లుగా నియమితులైన 299 మంది సర్వీసును క్రమబద్ధీకరించారు. ఈనెల 7నుంచి శుక్రవారం వరకు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఈప్రక్రియను కొనసాగించారు. సర్వీసు రెగ్యులరైజేషన్‌కు మొత్తం 386 మంది నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. అందులో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సంబంధించి 316 ఉండగా.. 237 మంది సర్వీసును క్రమబద్ధీకరించారు. 79 పెండింగ్‌లో ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి 49 ప్రతిపాదనలు రాగా 41 పూర్తి చేశారు. ఎనిమిది పెండింగ్‌లో ఉంచారు. పీఈటీల నుంచి 21 ప్రతిపాదనలురాగా అన్నీ పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న 87 మంది టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ ఎన్నికల అనంతరం చేస్తామని డీఈవో సుభద్ర తెలిపారు.

వైసీపీ పాలనలో భూ కబ్జాలు..!

క్యాసినో ఆడే బాలినేని ప్రజాప్రతినిధిగా ఉండే అర్హత లేదు..

జైల్లో ఉండాల్సిన వైసీపీ అభ్యర్థులు జనంలోకి వస్తున్నారు..

జగ్గూభాయ్ జగన్‌కి ఇలాంటి మాఫియా గ్యాంగ్ కావాలి ● ఒంగోలు రోడ్ షోలో చంద్రబాబు ధ్వజం

జనం కోసం పనిచేసే జనార్దన్, మాగుంటలను గెలిపించాలని పిలుపు



ప్రసంగిస్తున్న దామచర్ల, అభివాదం చేస్తున్న చంద్రబాబు, పక్కన మాగుంట, బాలాజీ

ఒంగోలు(కార్పొరేషన్), మే 10: వైసీపీ పాలనలో నకిలీస్టాంప్‌లు, భూకబ్జాలు, ఫోర్జరీ సంతకాలు వంటి అక్రమాలు పెరిగిపోయాయని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. ఇక్కడ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తానే స్వయంగా మంత్రిగా ఉన్నపుడు డబ్బులు తీసుకున్నానని చెప్పడం సిగ్గు చేటన్నారు. శుక్రవారం ఒంగోలు విచ్చేసిన చంద్రబాబు స్థానిక మిరియాలపాలెంలో జరిగిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బాలినేనిపై విమర్శనాస్త్రాలు సంధించారు. పట్టాల పేరుతో యరజర్ల కొండను తవ్వి రూ.40 కోట్ల మట్టిని తన వియ్యకుండు విల్లా కోసం తరలించారని ఆరోపించారు. క్యాసినోకి వెళ్లి పేకాడ ఆడే బాలినేనికి ప్రజాప్రతినిధిగా ఉండే అర్హత లేదన్నారు. బాలినేని కనుసన్నల్లో ఆయన అనుచరులు నకిలీ స్టాంపులు, భూకబ్జాలకు పాల్పడ్డారని, అతని అవినీతిని ప్రశ్నించే వారిపై దాడులు చేసి బెదిరించడం ఆయనకు అలవాటని, సోమిశెట్టి సుబ్బారావు గుప్తాపై దాడి అందుకు నిదర్శనమని చంద్రబాబు ధ్వజమెత్తారు. అదే సమయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సేవలను ప్రశంసించిన చంద్రబాబు, జగ్గుభాయ్ జగన్‌కు మంచి వ్యక్తులు పనికి రారని ఘాటుగా విమర్శించారు. దుర్మార్గపు ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డిని ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. చంద్రగిరి నుంచి ఎంపీ అభ్యర్థిని ఇక్కడకు దిగుమతి చేశారని, జైల్లో ఉండాల్సిన వ్యక్తి జనంలోకి వస్తున్నారని ఆరోపించారు. ఎర్రచందనం స్మగ్లర్ పుష్ప చెవిరెడ్డి భాస్కర్ కావాలా లేదా నిరంతరం ప్రజలతో ఉండే మాగుంట కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.2500 కోట్లు ఖర్చు చేసిన సౌమ్యుడైన దామచర్ల జనార్దన్‌ను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి చేయని బాలినేని ఓడించాలని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంటను ప్రజలు గెలిపించాలని కోరారు.

తెలుగు తమ్ముళ్ల ఘన స్వాగతం

టీడీపీ అధినేత చంద్రబాబు ఒంగోలు పర్యటనలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక నెల్లూరు బస్టాండ్ రాజధాని సెంటర్ నుంచి మిరియాలపాలెం వరకు నిర్వహించిన రోడ్‌షోకు ఇక్కడి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ నేతృత్వంలో గజమాలతో సత్కరించారు. వేలాదిగా విచ్చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరగనుండటంతో చంద్రబాబు రాకతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ కనిపించింది.

బియ్యం పేరుతో జనం రాకుండా చేసేందుకు విఫలయత్నం

చంద్రబాబు ఒంగోలు పర్యటన సందర్భంగా ప్రజలు రాకుండా ఉండేందుకు వైసీపీ నేతలు వేసిన ఎత్తుగడలు విఫలమయ్యాయి. ఈనెల 13న జరిగే ఎన్నికలలో ఓట్లు రాబట్టుకునేందుకు. ప్రజల్లో ఉన్న టీడీపీ అభిమానాన్ని తొలగించేందుకు వైసీపీ అభ్యర్థులు కుటిల ప్రయత్నాలు చేశారు. చంద్రబాబు సభ జరిగే సమయంలో ఉచితంగా బియ్యం బస్తాలు పంపిణీ చేస్తామని ఆయా డివిజన్లలో ప్రకటించడంతో కొందరు చంద్రబాబు సభకు రాకుండా ఆగిపోయారు. అయితే ఎంతకీ బియ్యం బస్తాలు ఇవ్వకపోవడంతో వైసీపీ నేతలపై తిట్లపురాణం అందుకున్న కొందరు మహిళలు చంద్రబాబు సభకు విచ్చేశారు. గతంలో ఇదివరకు ఎన్నడూ మిరియాలపాలెంలో ఏ రాజకీయ పార్టీ ఇలాంటి సభ నిర్వహించకపోగా, తొలిసారిగా చంద్రబాబు బహిరంగ సభ, రోడ్‌షో నిర్వహించడంపై ట్రంక్‌రోడ్ వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రసంగం సమయంలో ఉత్సాహంగా ఈలలు వేశారు. ఇదిలా ఉండగా చంద్రబాబు పర్యటన కోసం దామచర్ల జనార్దన్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబు రాకతో టీడీపీ శ్రేణుల్లో మరింత జోష్ పెరిగింది.



రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన శ్రేణులు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

ఒంగోలు ప్రజలను ఘోరంగా మోసం చేసి బాలినేని : దామచర్ల

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తూ అధికారం చేజిక్కించుకున్న ఎమ్మెల్యే బాలినేని ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. నగర ప్రజలకు ప్రతిరోజు తాగునీరు ఇవ్వడానికి గత టీడీపీ హయాంలో రూ.163 కోట్లు తెప్పించి గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు పైపులైన్ పనులు చేపట్టగా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 80 శాతం పనులు పూర్తి చేస్తే, గడిచిన ఐదేళ్లలో 20 శాతం కూడా పనులు పూర్తి చేయలేని బాలినేనికి ప్రజల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. అలాగే పోతురాజు కాలువ ఆధునికీకరణకు రూ.80 కోట్లు తెప్పించి 80 శాతం పనులు పూర్తి చేస్తే, మిగత 20శాతం పనులు పూర్తి చేయకలేక ముగ్గురు కాంట్రాక్టర్లను మార్చి కమీషన్లు తీసుకున్నారే తప్ప పనులు చేయలేకపోయారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి గృహ ప్రవేశాలు కల్పిస్తామని, అదనంగా మరో 6వేల ఇళ్లు ఇస్తామని దామచర్ల స్పష్టం చేశారు. నిరుపేదలకు 2 సెంట్లు భూమి ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసమర్థ, అవినీతి పాలకుడు బాలినేనికి ప్రజలు తగిన గుణపాఠం కోరారు. ఒంగోలు అభివృద్ధికి ఎవరు ఏమి చేశారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని దామచర్ల పేర్కొన్నారు.

చంద్రబాబుకు అండగా నిలవాలి: మాగుంట

గడిచిన ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని, అవినీతి పెరిగిపోయిందని ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ప్రజా సేవకే అంకితమైన మాగుంట కుటుంబాన్ని ప్రజలు ఆశ్వీరంది గెలిపించాలని, కాబోయే సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎమ్మెల్యేగా దామచర్లను, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

మాగుంట సమక్షంలో చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : ఒంగోలు ఎంపీ టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ముండ్లమూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన పది కుటుంబాల వారు శుక్రవారం కొర్రపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి వారందరికీ పార్టీకండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో తోణతం అక్కిరెడ్డి, కొర్రపాటి వెంకటేశ్వర్లు, రావెళ్ల సాత్విక్, పరగాని లాజర్, నంబూరి జ్యోతికుమార్, కొర్రపాటి సతీష్, మార్పు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో అవినీతి వైసీపీకి చెక్ పెట్టాలి

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ పిలుపు ● విస్తృతంగా ఎన్నికల ప్రచారం ● చీమకుర్తి మండలంలో చేరికలు



సంతనూతలపాడులో బీఎన్‌పై పూలు చల్లుతున్న మహిళ



కనపర్తిలో ఓటర్లతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మే 10: ఓటు అనే ఆయుధంతో అవినీతి వైసీపీకి ప్రజలు చెక్ పెట్టాలని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సంతనూతలపాడులోని అంబేడ్కర్‌కాలనీలో శుక్రవారం బీఎన్.విజయ్‌కుమార్ బాబూషూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ మరికొద్ది గంటల్లో ఓటు అనే ఆయుధంతో సంక్షేమపాలన అందించే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణలేకుండా చేసేందుకు వైసీపీ కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. చంద్రబాబు ఉన్నంత వరకు వైసీపీ కుయుక్తులు పనిచేయవని చెప్పారు. ప్రజా సంక్షేమం కోరుకునే చంద్రబాబును సీఎంను చేసుకుందామన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత నిరంకుశ పాలనతో పేద, మధ్యతరగతి ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేకతతో ఆ పార్టీ పతనం ప్రారంభమైందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి ఆర్.అంకారావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్‌ను, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దుంపా కోటిరెడ్డి, అంజయ్య, జనసేన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థికభరోసా

నాగులుప్పలపాడు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనపర్తి, వినోదరాయునిపాలెం, చవటపాలెం, అమ్మనబ్రోలు ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్‌కు పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని విమర్శించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, చాట్ల నారాయణ, దొడ్డా సీతారామయ్య, డాల్ శ్రీను, రాజా, జాగర్లమూడి వెంకటేశ్వర్లు, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్, గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, దివి పున్నారావు, ఈదర సుబ్బారావు, ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, ఈదర బాలాదిత్య పాల్గొన్నారు.

ఆర్ఎల్‌పురంలో 50కుటుంబాల చేరిక

చీమకుర్తి: మండలపరిధిలోని ఆర్ఎల్‌పురం, పులికొండ గ్రామాల్లో వైసీపీని వీడిన పలువురు శుక్రవారం తెలుగుదేశంపార్టీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో పులికొండ మాజీ సర్పంచ్ బెల్లం లక్ష్మీనారాయణ, బెల్లం వెంకటేశ్వర్లు మరో పది కుటుంబాలతో కలిసి చేరారు. అదేవిధంగా ఆర్ఎల్‌పురంలో దాదాపు 50కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి పమిడి సురేష్ ఆధ్వర్యంలో చేరారు. వీరందరికి బీఎన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, పమిడి రంగయ్య, హరి, జెమిని, మలినేని శ్రీను, యర్రగుంట్ల శేఖర్, సుబ్బారావు, విజయ్ పాల్గొన్నారు.





ఆర్ఎల్‌పురంలో పార్టీలో చేరిన వారితో బీఎన్, పులికొండ మాజీ సర్పంచ్‌ని ఆహ్వానిస్తున్న విజయ్‌కుమార్

కూటమి అభ్యర్థుల కోసం కదిలిన శ్రేణులు



ఉప్పుగుండూరు అయ్యప్పస్వామి ఆలయంలో నాయకుల పూజలు



అంబేడ్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న శిద్దా సుధాకర్, రమణయ్య

ఎన్నికల్లో గెలిపించాలంటూ ముమ్మర ప్రచారం

నాగులుప్పలపాడు, మే 10 : టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామగ్రామానా ప్రచారర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఉప్పుగుండూరులో టీడీపీ గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దిన్నెమీద నున్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కరెంటు ఆఫీసు మీదుగా బస్టాండు సెంటర్, గంగమ్మహోటల్ కూడలి, ఏకలవ్యకాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, అంబేడ్కర్‌కాలనీ, దక్షిణం బజారు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. సైకిల్ గుర్తుపై ఓటు వేసి బీఎన్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు కోరారు. కాగా అంబేడ్కర్‌కాలనీలో వైసీపీకి చెందిన తెలగతోటి పృథ్వి టీడీపీలో చేరారు.

ఈదుమూడిలో...



ఈదుమూడిలో టీపీడబ్ల్యూ సభ్యుల ప్రచారం

ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలని కోరుతూ ఈదుమూడిలో గురువారం రాత్రి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ టీం ఆధ్వర్యంలో మేము సైతం రాష్ట్రం కోసంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీం అధ్యక్షులు ఆర్కే మన్నం, హరీష్ రాయపాటి, గొగినేని సుబ్బయ్య, పాతూరి సందీప్, శ్రీరాముల రమేష్ తదితరులు ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలను పంచారు. ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. చంద్రబాబు హయాంలోనే ఎస్సీలు, ఉపకులాల అభివృద్ధి జరిగిందని వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి సూపర్‌సిక్స్ పథకాల లబ్ధి పొందాలని కోరారు.

అంబేడ్కర్‌నగర్‌లో..

చీమకుర్తి : చీమకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శిద్దా సుధాకర్, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కూటమి అభ్యర్థులు బీఎస్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గంగుల శివపార్వతి, నూకల సుబ్రహ్మణ్యం, యడ్లపల్లి రమణయ్య, కొండలు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలి

● కాపు సంఘం నాయకుల పిలుపు

ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : జిల్లాలో ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాపు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం రామనగర్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాపు సంఘం నాయకులు కె.సంజీవకుమార్, సుంకర సాయిబాబా, చెరుకూరి ఫణికుమార్, తోటకూర వెంకట్రావు, కోలా హనుమంతరావు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి మాట్లాడారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థులైన ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్థన్‌తో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కూటమి అభ్యర్థులను కాపు సామాజికవర్గం గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాపుల ఓట్లు ఒక్కటి కూడా పక్కకుపోకుండా కూటమి అభ్యర్థులు గెలిపించేలా పని చేయాలన్నారు. కాపులకు ఉన్న బీసీ రిజర్వేషన్ తొలగించిన అప్పటి ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, ఈడబ్ల్యూఎస్ 5శాతం తొలగించిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కాపులను అణిచివేసేందుకు కుట్రలు పన్నారన్నారు అందువల్ల వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఓడించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాగిశెట్టి మోహనదాస్, చిట్టెం సుదేశ్, కె.చక్రవర్తి, రావూరి బుజ్జి, మురళీ, నాగేశ్వరరావు, శివ, మల్లెల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రైజ్ కాలేజీని సందర్శించిన ఎన్నికల అధికారి

ఒంగోలు(కలెక్టరేట్), మే 10: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీని శుక్రవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఇక్కడే స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటంతో పాటు కొండపి నియోజకవర్గానికి చెందిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. అక్కడ ఆయా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత తదితరులు ఉన్నారు. కాగా అంతకు ముందు ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దినేష్‌కుమార్ కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఘనంగా బసవ జయంతి వేడుకలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 10: జిల్లా జంగమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంజయ్యరోడ్డులోని బీసీ కులాల ఆరామక్షేత్ర సముదాయంలో శుక్రవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముసుమారి కోటేశ్వరరావు, కార్యదర్శి పావళ్ళ రాచయ్య, ప్రతినిధులు వెల్లసిరి మల్లికార్జునరావు, తోట మల్లికార్జున, చేజర్ల శ్రీనివాసరావు, దంపూరి ప్రసాద్, ఉద్దండం అమరనాథ్, దోగిపర్తి సురేష్, మద్దులూరి శ్రీనివాసరావు, సురేష్, పందిటి శ్రీనివాసరావు, గోగు శివుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీతో ఆర్‌జీయూకేటీ ఒప్పందం

ఒంగోలు(విద్య), మే 10: తిరుపతి ఐఐటీతో ఆర్‌జీయూకేటీ, ఏపీ విద్యాశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. శుక్రవారం స్థానిక తిరుపతిలోని ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో డైరెక్టర్ సత్యనారాయణ, ఆర్‌జీయూకేటీఏపీ చాన్స్‌లర్ కేసీ.రెడ్డి, వైస్ చాన్స్‌లర్ ఎం.విజయకుమార్‌ల ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదరింది. ఆర్వీ అసోసియేట్స్, అనుగ్లోబల్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టింగ్ కంపెనీతో ఆర్‌జీయూకేటీ ఏపీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు కూడా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్‌జీయూకేటీ ఏపీ నాలుగు క్యాంపస్‌ల నుంచి 12 మంది సివిల్ విద్యార్థులకు రూ.10వేల వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌కు ఆ సంస్థ అంగీకరించింది. త్వరలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ఇంటర్న్‌షిప్‌కు అవగాహన ఒప్పందం జరుగుతుందని ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్‌పటేల్ ఓ ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులను అందజేస్తున్న అతిథులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 10: కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ 74వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సమతా మహిళా వృద్ధాశ్రమంలో ఉన్న 40 మంది వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు, నీటిడ్రమ్ములు, చీరలు తదితర వస్తువులను అందజేశారు. ముఖ్యఅతిథులుగా కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మారుతిశశిధర్, డివిజనల్ మేనేజర్ వై.శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు వి.రామచంద్రరావు, కె.సురేంద్రకుమార్, హసన్‌సాహెబ్, పి.లక్ష్మీనారాయణ, పీవీఎస్ఆర్‌కే.ప్రసాద్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొర్రగుడిపాడులో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు ● పోలీస్ పికెట్ ఏర్పాటు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలు

చీమకుర్తి, మే 10: చీమకుర్తి మండలం తొర్రగుడిపాడు గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య శుక్రవారం ఉదయం ఘర్షణ నెలకొంది. ఈ సంఘటనలో టీడీపీకి చెందిన ఇద్దరు, వైసీపీకి చెందిన ఒకరు గాయపడి చీమకుర్తి పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్నారు. గురువారం రాత్రి గ్రామంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణ తలెత్తింది. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు పికెట్ కూడా ఏర్పాటు చేశారు. అయినా శుక్రవారం ఉదయం పికెట్‌కు సమీపంలోనే మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈక్రమంలో టీడీపీకి చెందిన యద్దనపూడి ఆంజనేయులు, నాగరాజు, వైసీపీకి చెందిన యద్దనపూడి వెంకటేశ్వర్లు గాయపడ్డారు. దీంతో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు, గ్రామంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

పశు సంపదను పెంపొందించుకోవాలి



మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేసిన జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, మే 10 : పశుసంపదను పెంపొందించుకోవాలని జేడీఏ బేబీరాణి సూచించారు. పశుపోషకులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అమ్మనబ్రోలు గ్రామంలోని పశువైద్యశాలలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పాడి రైతులు, గొర్రెలకాపరులు వేసవిలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. చల్లటి వాతావరణంలో పశువులు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశువులకు ఎక్కువ మోతాదులో తాగునీటిని అందించాలన్నారు. పశువైద్యశాల అవరణంలో పశువులకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జీవీ.సురేఖ, ఎ.కెజియా, సురేష్ పాల్గొన్నారు.

గద్దలగుంటలో రూ.20లక్షల సొత్తు చోరీ





కిటికీ గ్రిల్స్ తొలగించి చోరీకి పాల్పడిన దుండగులు

ఒంగోలు(క్రైం), మే10: ఒంగోలు నగరం గద్దలగుంటలో తాళం వేసిన ఇంటిలో దొంగలు చొరబడి సుమారు రూ.20లక్షల విలువైన సొత్తును అపహరించుకు వెళ్ళారు. వివరాలలోకి వెళితే.. సాంఘికసంక్షేమశాఖలో పనిచేస్తున్న ఎ.వెంకటరావు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 8న ఇంటికితాళం వేసి వేరే ఊరు వెళ్ళారు. శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం అలాగే ఉంది. కానీ ఇంట్లో కప్‌బోర్డులు పెకలించి రూ.5లక్షలు నగదు, 30 సవర్ల బంగారం ఆభరణాలు దుండగులు చోరీ చేశారు. కిటికీ గ్రిల్స్‌ను కోసి దొంగలు లోపలికి చొరబడ్డారు. ఈ మేరకు వెంకటరావు శుక్రవారం ఉదయం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులతో మాగుంట, డోలా, పోతుల తదితరులు

టీడీపీలో చేరిన కాకుటూరివారిపాలెం వైసీపీ నాయకులు

టంగుటూరు, మే 10 : మండలంలోని కాకుటూరివారిపాలెంకు చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరంతా పోతుల గృహం వద్ద జరిగిన తెలుగుదేశం పార్టీ ప్రత్యేక సమావేశంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే స్వామి, పోతుల రామారావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో కాకుటూరివారిపాలెం మాజీ ఎంపీటీసీ పైడి సింగమ్మ, మాజీ ఉపసర్పంచ్ గుడిపూడి రవీంద్ర, మన్నం రామారావు, మేడికొండ రవి బాబు, నరసింహారావు, మేడికొండ కోటేశ్వరరావు ఉన్నారు. వీరితోపాటుగా దావగూడూరు వైసీపీ నాయకులు పలువురు టీడీపీలో చేరారు.

మర్లపాడులో

మండలంలోని మర్లపాడులో శుక్రవారం పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరంతా మర్లపాడు మాజీ ఎంపీటీసీ హరి బాబు, ప్రస్తుత ఎంపీటీసీ చుండూరి వేణు నేతృత్వంలో చేరారు. తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గృహం వద్ద ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అంగలకుర్తి రవీంద్ర, డేవిడ్, దేవునిదయ, జీవన్‌బాబు, తరుణ్‌ల తరపున 10 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామని విజయకుమార్ కూడా పాల్గొన్నారు.



బలరామకృష్ణాపురంలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న గొట్టిపాటి

హామీలపై మడమ తిప్పిన జగన్‌రెడ్డి

- 9 సార్లు కరెంట్ చార్జీలు పెంచి వాతలు
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి : ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, మే 10 : జగన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణాపురం, వెంకటాపురం, విప్పర్లవారిపాలెంలో గొట్టిపాటి శుక్రవారం రాత్రి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, కరెంట్ చార్జీల తగ్గింపు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల అమలు, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు, బీసీలకు రాజకీయపరమైన రిజర్వేషన్, జాబ్‌క్యాలెండర్ విడుదల తదితర హామీలు అమలు చేయకుండా మడమ తిప్పారన్నారు. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. నిత్యావసర ధరలు పెరుగుదల, ఆర్టీసీ చార్జీల పెంపు తో అన్ని వర్గాల ప్రజల తీరని భారం పడిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల సమస్య లను పరిష్కరిస్తామన్నారు. ఎస్సీల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేయడం జరుగుతుందన్నారు.

కలిసికట్టుగా ఎన్నికల ప్రచారం

అద్దంకి పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో టీడీపీ నేతలు అందరు కలిసికట్టుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకానిపాలెంలోని మండపం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నేతలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఒంగోలు(క్రైం), మే 10: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి ఒంగోలులో ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు రోడ్‌షోలో పాల్గొనేందుకువస్తున్న సమయంలో కాన్వాయ్ వెంట ఓ కారుపై నిలుచున్న టీడీపీ వీరాభిమాని, మద్దిపాడు మండలం దొడ్డవరానికి చెందిన కొండ్రగుంట సాయిచంద్ర అదుపుతప్పి జారి రోడ్డు మీద పడిపోయాడు. ప్రమాదంలో సాయి తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతనిని సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు.



ప్రజా కూటమి అభ్యర్థులను గెలిపించాలని నినాదాలు చేస్తున్న మాదిగాని

విషపు రాతలతో చంద్రబాబుపై దుష్ప్రచారం

- సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని

పర్చూరు, మే 10: విజన్ ఉన్న చంద్రబాబుపై విషపు రాతలతో దుష్ప్రచారం చేస్తున్నారని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ అధికార ప్రతినిధి మాదిగాని గురునాథం అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పర్చూరు వచ్చారు. అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాల మాటున జగన్ వేలకోట్లు దోచుకున్నారన్నారు. అందుకు నిదర్శనం పథకాలకు రూ.4లక్షల కోట్లు పంపిణీ చేస్తే మిగిలిన రూ.8లక్షల కోట్లు ఏమయ్యాయన్నారు. కూటమిదే విజయమని, చంద్రబాబును సీఎంగా చూడాలని ప్రజలు ఆకాంక్షతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని గురునాథం విజ్ఞప్తి చేశారు. ఆయన తోపాటు మాదిగాని తరుణ్, అంబేడ్కర్ యువజన నాయకులు నలిగల కిషోర్, ఎస్సీసెల్ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇడ్ల శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసరావు, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం.. అభ్యర్థులను గెలిపించుకుందాం

టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు

టంగుటూరు, మే 10 : కొండపి నియోజవకర్గంలోని తెలుగుదేశం పారీ కేడర్ అంతా సమష్టిగా కలసి పని చేద్దాం, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం అని మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టంగుటూరులోని పోతుల గృహం వద్ద శుక్రవారం తెలుగుదేశం పార్టీ ప్రత్యేక సమావేశం జరిగింది. రామారావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హాజరయ్యారు. మీ ఇద్దరినీ గెలిపించుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని పోతుల అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులుగా ఉండిన తమను వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధించిందని, అయినా సరే గుండె ధైర్యంతో నిలబడ్డాం అని అన్నారు. మీకు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించడం మా కర్తవ్యమని, ఇందుకు తాము శక్తివంచన లేకుండా శ్రమపడతామన్నారు. ఎమ్మెల్యేగా స్వామి నాల్గో సారి పోటీచేస్తున్నాడని, ఇప్పటికే రెండు సార్లు గెలిచి ఒక్కసారి ఓడిపోయాడని, అదీ అవతల పార్టీలో ఉండి మేమే ఓడించామని, అందుకు క్షమించాలని రామారావు స్వామిని కోరారు. పార్టీలోని అందరం కలసి ఉంటే ప్రజలకు నమ్మకంగా ఉంటుందని, అభ్యర్థుల విజయంలో ముందుంటాం అని అన్నారు. రెండు గ్రామాల్లో మంచి మెజార్టీ ఎవరు సాధించినా విజయాలు తారుమారు అవుతాయని, అందుకే టీడీపీ జెండాపట్టిన అందరం ఐక్యంగా పని చేసి మంచి ఫలితాన్ని సాధిద్ధాం అని సూచించారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే

మరో మూడు రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ద్వారా అధికారం చేపట్టేది తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వమేనని ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. అలాంటి వాతావరణం రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తుందని,



ఐక్యతను చాటుతూ అభివాదం చేస్తున్న నేతలు

ప్రజలు ఈనిర్ణయానికి సిద్ధమై పోయారని, సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలన్న నిర్ణయం జనం ఎప్పుడో తీసుకున్నారని చెప్పారు. ఎన్నికలను వన్‌సైడ్ చేసుకోవాలని, ఇందుకు పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. మాగుంట కుటుంబం ప్రజాసేవకే అంతికమై ఉందని, తమ సోదరుడు సుబ్బరామిరెడ్డి, వదిన పార్వతమ్మ, ఇప్పుడు నేను, రేపు నాకుమారుడు రాఘవరెడ్డి ప్రజాసేవకే అంతికతమై జనం కోసం పనిచేస్తామన్నారు. టంగుటూరు మండలంలోని తెలుగుదేశం పార్టీలో ఎలాంటి వర్గాలు, వైషమ్యాలు లేవని, అందరూ సమష్టిగా పని చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలోని అందరితో కలసి త్వరలో టంగుటూరులో ప్రత్యేక మండల పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు మాగుంట వెల్లడించారు.

రాష్ట్రంలో కర్కశ పాలన

రాష్ట్రంలో అత్యంత పాశవికమైన కర్కశ పాలన కొనసాగుతున్నదని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. వైసీపీ పాలన ఐదేళ్ల ద్వేషాలు, విద్వేషాలు, ప్రతీకారాలతో జరిగిందన్నారు. వ్యాపార వేధింపులు పతాక స్థాయిలో జరిగాయని, ఇందులో ప్రధాన బాధితులు మన పోతుల రామారావు, గొట్టి పాటి రవి అని చెప్పారు. వీరిద్దరిపై వ్యాపార పరంగా అనేక కేసులు పెట్టారని, అయినా భయపడకుండా ముందుకు సాగారన్నారు. వైసీపీ లేని రాష్ట్రాన్ని చూడాలని జనం ఆశించారని, అందుకే జనసేన, బీజేపీ ముందుకు రాగా వారితో టీడీపీ జతకట్టిందన్నారు. కౌరవ సభను గౌరవ సభగా మార్చాకే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని చంద్రబాబు చెప్పి బయటకొచ్చాడని ఆయన గుర్తు చేశారు. అందుకే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం వచ్చిందని, కొత్త, పాత నాయకత్వాలు అనే తేడా వదలి అందరం కలసి పోదాం అన్నారు. నాల్గవ సారి పోటీలో దిగిన తనను ఎమ్మెల్యేగా, మాగుంటను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే స్వామి కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కసుకుర్తి శ్రీధర్, చిడిపోతు కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దర్నాసి బ్రహ్మానందం, బీజేపీ మండల అధ్యక్షుడు బెల్లం కోటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు కందుకూరి రాంబాబు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన హెచ్‌ఎంపాడు మండలం కొండారెడ్డిపల్లి గ్రామస్థులు

కనిగిరి ప్రాంత అభివృద్ధే లక్ష్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- 56 కుటుంబాలు పార్టీలో చేరిక

కనిగిరి, మే 10: కనిగిరి ప్రాంతాభివృద్ధే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ టీడీపీ కూటమి గెలు పునకు కృషిచేయాలని కోరారు. కనిగిరి మండలం తక్కెళ్ళ పాడు గ్రామం నుంచి మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 11 దళిత కుటుంబాలు, సీఎస్‌పురం మండలం బోడావులదిన్నె గ్రామానికి చెందిన 14 కుటుంబాలు, వెలిగండ్ల మండలం మో టుపల్లి గ్రామానికి చెందిన 14 కుటుంబాలు, హెచ్ ఎంపాడు మండలం కొండారెడ్డి పల్లి గ్రామానికి చెం దిన 17 కుటుంబాలు వైసీపీని వీడి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉ గ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి జరగాలంటే తెలుగు దేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కనిగిరిలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కియా లాంటి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సెల్‌ఫోన్ కంపెనీల తయారీ పరిశ్రమలు, వస్త్ర పరి శ్రమలు లాంటి వాటిని ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామ న్నారు. మహిళలకు ఉపాధి పనులే కాకుండా ఇంటివద్ద నే పనిచేసి ఆదాయం పొందే మార్గం కల్పిస్తామని చెప్పారు. తద్వారా పరాయి ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు లేకుండా నియంత్రిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నిమ్స్ ఏర్పాటుకు బాటలువేసి పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీటిని తాగునీటి కుళాయిల ద్వారా సరఫరా చేయిస్తామన్నారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉందన్నారు. నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. పార్టీలకతీతంగా పారదర్శక పాలన చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్ కోసం టీడీపీ కూటమిని గెలిపించండి

టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట, డోలా

సింగరాయకొండ దేవిసీఫుడ్స్ నుంచి కందుకూరు రోడ్డు వరకు భారీ ర్యాలీ

పాల్గొన్న దామచర్ల సత్య, పోతుల

మండుటెండలోనూ భారీగా తరలొచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మే 10 : రాష్ట్ర భవితరాల భవిష్యత్‌కోసం టీడీపీ కూటమిని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కోరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధో గతి పాల్జేశారని విమర్శించారు. శుక్రవారం దేవిసీఫుడ్స్ నుంచి కందుకూరు రోడ్డు వరకూ టీడీపీ కూటమి తరుపున భారీ ర్యాలీని నిర్వహించారు. భగభగలాడే మండుటెండను సైతం లెక్కచేయకుండా టీడీపీ, జనసేన శ్రేణులు ర్యాలీలో కదంతొక్కారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోనే సింగరాయకొండ అభివృద్ధి జరిగిందన్నారు. పాకల బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రూ. 4 కోట్లతో టూరిజం రెస్టారెంట్ పనులను ప్రారంభిస్తే వైసీపీ వచ్చాక అర్ధంతరంగా నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యర్రగొండపాలెం నుంచి వలసొచ్చిన వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ ఒక్క చాన్స్ ఇస్తే అభివృద్ధి చేస్తానని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర మంత్రిగా ఉండి సొంతనియోజకవర్గం వైపాలెంను అభివృద్ధి చేయలని వ్యక్తి ఇక్కడ అభివృద్ధి చేస్తారా అని ప్రశ్నించారు.

వైసీపీ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు గండి : మాగుంట

వైసీపీ పాలనలో ఉపాధి, ఉద్యోగ ఆవకాశాలకు పూర్తిగా గండికొట్టారని టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. మారుమూల ప్రాంతమైన సింగరాయకొండలో ఉపాధి, ఉద్యోగ ఆవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్థానికంగా పెరల్ డిస్టలరీని ఏర్పాటు చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో 4000 మందికి ఉపాధి కల్పిస్తే వైసీపీ అస్తవ్యస్త విధానాల వలన ఈ ప్రభుత్వంలో 400 మంది పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ంరాష్ట్ర పునర్నిర్మాణం కోసం సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా స్వామిని గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న దామచర్ల సత్య

వైసీపీ వస్తే రైతుల భూములు తాకట్టే - దామచర్ల సత్య

వైసీపీ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అడ్డుపెట్టుకొని రైతుల భూములను జగన్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని దామచర్ల సత్య అన్నారు. సచివాలయాన్ని తాకట్టుపెట్టిన వ్యక్తికి భూములను తాకట్టు పెట్టడం పెద్దవిషయం కాదన్నారు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న చెవిరెడ్డి వైసీపీ ప్రభుత్వంలో శేషాచలం అడవులలో ఎర్రచందనాన్ని స్మగ్గింగ్ చేసి రూ. కోట్లు దోచుకున్నారన్నారు. స్మగ్లర్ చెవిరెడ్డి, వలసపక్షి సురేష్‌ను ఓడిం చాలని, మాగుంట, స్వామిలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

టీడీపీ కూటమి గెలుపు ఖాయం - పోతుల

రాష్ట్రంలో టీడీపీ గెలుపు ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పోతుల రామారావు జోస్యం చెప్పారు. వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, వేదింపులు తప్ప అభివృద్ధి మచ్చుకైనా లేదన్నారు. విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్‌రెడ్డి వ్యవహరించారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో మాగుంట, స్వామిలను గెలిపించాలని కోరారు

దొడ్డా మహీధర్ పార్టీలో చేరిక

వైసీపీ మూలగుంటపాడుకు చెందిన యువనేత, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట ముఖ్య అనుచరుడు దొడ్డా మహీధర్‌రెడ్డి మాగుంట, స్వామి, సత్య, పోతుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత దేవిసీ ఫుడ్స్ కంపెనీ ఎదురుగా శ్రీనివాస కల్యాణ మండపం వద్ద పెద్ద ఎత్తున యువతతో మహీధర్‌రెడ్డి మాగుంట, స్వామి, పోతులకు, సత్యలకు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం వారిని భారీ గజమాలతో సత్కరించారు. పాకల రోడ్ద వద్ద సుందర్‌నగర్‌కు చెందిన వైసీపీ గిరిజన మహిళా నేత ఇండ్లా సుజాత టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు స్వాములు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు వల్లెపు రాఘవులు, కృష్ణ, సందానీ బాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీచౌదరి, రామారావు, చంటి, బ్రహ్మయ్య , జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అనంతవరం ఉప సర్పంచ్ షేక్ శ్రీనుకు కండువావేసి ఆహ్వానిస్తున్న ఏలూరి

అనంతవరంలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్.. ఇద్దరూ తల్లీకొడుకులు
- మాజీ మంత్రి బాలినేనికి శ్రీను సన్నిహితుడు

యద్దనపూడి, (మార్టూరు) మే 10: వైసీపీ పార్టీ మద్దతుదారులైన అమ్మ సర్పంచ్... కుమారుడు ఉప సర్పంచ్ .. అయితే గ్రామంలో ఉప సర్పంచ్ షేక్ శ్రీను అమ్మతో కలిసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి కోలుకోని షాక్ తగిలింది. అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి బలమైన నాయకునిగా ఉన్న ప్రస్తుత ఉప సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ షేక్ శ్రీను అమ్మ గ్రామ సర్పంచ్‌షేక్ మస్తాన్‌బీతో కలిసి అతని వర్గీయులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు మండలంలోని ఇనుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారికి కండువాలు వేసి ఏలూరి స్వాగతం పలికారు. అతనితో పాటు అతని వర్గీయులు కూడా పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఏలూరి కోరారు. అయితే ఇంకో విశేషం ఏమిటంటే పార్టీలో చేరిన షేక్ శ్రీను వైసీపీ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అతని చేరికతో యద్దనపూడి మండలంలో ముఖ్యంగా అనంతవరం గ్రామంలో టీడీపీకి బలం పెరిగినట్లయిందని శ్రేణులు భావిస్తున్నారు. అయితే శ్రీను టీడీపీలో చేరికపై వైసీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు.

దొనకొండను పారిశ్రామిక నగరంలా తీర్చిదిద్దుతాం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

దొనకొండ, మే 10: ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకున్న గొట్టిపాటి రాజకీయ కుటుంబం వారసురాలిగా మీ ముందుకు వచ్చా.. ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే దొనకొండను పారిశ్రామిక నగరంలా తీర్చిదిద్దుతానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని మల్లంపేట, బాదాపురం, గుట్టమీదపల్లి, ఎర్రబాలెం, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు తమపట్ల చూపుతున్న ఆదరణ మరువలేనిదని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దొనకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెలి గొండ నీటిని రప్పించి తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామ న్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపా రావు, టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమే ష్, పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వర రావు, మోడి వెంకటేశ్వర్లు, పులిమి రమణా యాదవ్, షేక్ మగ్బూల్ అహమ్మద్, డాక్టర్ మల్లికార్జునశర్మ, మండ్లా అంతోనిపీటర్, వల్లపునేని వెంకటస్వామి, వడ్లమూడి చెన్నయ్య, తోటా కోటేశ్వరరావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, వైకే చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



కురిచేడులో మహిళలతో గొట్టిపాటి లక్ష్మి

బోదనంపాడులో బ్రహ్మరథం

కురిచేడు, మే 10: కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికి ఆమె తిరుగుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కురిచేడులోనూ ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మొఘల్ మస్తాన్‌వలి, కమతం నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి, కాట్రాజు నాగరాజు, మలిసెట్టి నాగేశ్వర రావు, కె.కాశీవిశ్వనాధరావు, తదితరులు పాల్గొన్నారు.

రొంపేరు బ్రిడ్జి వద్ద తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

చినగంజాం, మే 10 : చినగంజాం మండలంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో తెలంగాణ మద్యం బాటిళ్లను పట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు వివరాల మేరకు చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలో రాజు పోలిరెడ్డి రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. పోలిరెడ్డి రొయ్యల చెరువుల వద్ద కాపాలదారుని షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన 418 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం బాటిల్స్‌ను ఎవరు అక్రమంగా నిల్వ ఉంచారనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అధికారి బి.కల్పన, స్క్వాడ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల లైవ్ వెబ్‌కాస్టింగ్ వీక్షణకు ఏర్పాట్లు

కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : ఎన్నికల లైవ్ వెబ్ కాస్టింగ్ స్పష్టంగా వీక్షించేలా అవసరమైన ఏర్పాట్లను కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఎన్నికల లైవ్ వెబ్ కాస్టింగ్‌ను వీక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఒక నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఒకేసారి చూసేలా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. వీటిని వీక్షించే సిబ్బందికి ఏయే అంశాలను పరిశీలించాలో తగిన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా నమోదు రిజిస్టర్లను, వారి కోసం ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలి

పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే అధికారులు ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశించిన ప్రకారం లేఅవుట్ వేసి సైన్ బోర్డులు, టేబుల్స్, కుర్చీలు, ఇతర ఏర్పాట్లను చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి ఏమైనా సందేహాలు తలెత్తితే వెంటనే నివృత్తి చేసేలా ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తొలుత ఆయా అంశాలపై అన్ని నియోజక వర్గాల ఆర్వోలు, ఏఆర్వోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ శాతం కోసం ప్రత్యేక బులెటిన్

ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : ఎన్నికల రోజున ఓటింగ్ సరళి, పోలింగ్ శాతం వివరాలను ప్రతి రెండు గంటలకు ఒకసారి మీడియాకు ప్రత్యేక బులెటిన్ రూపంలో తెలిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ నేపథ్యంలో మీడియాకు అనుమతి, పరిమితులపై కలెక్టర్ స్పష్టత ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ సర్వేలను ప్రసారం చేయకూడదన్నారు. ఎన్నికలకు చివరి 48 గంటల సమయంలో అభ్యర్థులు మీడియా ద్వారా ఏమైనా ప్రకటనలు ఇవ్వాలంటే ముందుగానే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కవరేజ్ కోసం వెళ్లే అక్రిడిటేషన్ కార్డులు ఉన్న జర్నలిస్టులను ఆయా పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల క్యూలైన్ల ఫొటోలు, వీడియోలు తీసుకొనేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన భద్రతాపరమైన 100 మీటర్ల దూరం లోపలకు కూడా అనుమతిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు ఉంటే పోలింగ్ గది డోర్ వరకు అనుమతిస్తామన్నారు. రహస్య ఓటింగ్ విధానానికి భంగం కలగకుండా ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చని తెలిపారు. మీడియా అనుమతి, పరిమితులపై రిటర్నింగ్ అధికారులకు, పోలీస్ అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో గ్రేస్‌లైనోరా, డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో డి. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్లలోనూ వైసీపీ వివక్ష..?



మందు, మనీ ప్రలోభాల్లో తేడాలు

పొదిలి, కొనకనమిట్లలో రూ.1500, మార్కాపురంలో 2వేల చొప్పున పంపిణీ

సొంత సామాజికవర్గానికి ప్రీమియం బ్రాండ్ల మద్యం, ఇతరులకు 'జే' బ్రాండ్లు

బహిరంగంగా చర్చించుకుంటున్న ఓటర్లు

మార్కాపురం, మే 10 : 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ' అంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఓవైపు ఊదరకొడుతుంటాడు. కానీ ఆ పార్టీ తరఫున పోటీలో ఉన్న చోట్ల మాత్రం ఓటర్ల పట్ల వివక్ష చూపుతున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. మార్కాపురం నియోజకవర్గంలో ఓటర్లను ఆకర్షించేందుకు రెండు రోజులుగా తాయిలాల పంపిణీ ప్రారంభమైంది. ఓటర్లను ప్రలోభానికి గురిచేసేందుకు డబ్బు, మందులు, చీరలు అందిస్తున్నారు. కొన్నిచోట్ల వాటి పంపిణీ పూర్తి కాగా మరికొన్ని చోట్ల జరుగుతూనే ఉంది. అయితే తాయిలాల పంపిణీలో తేడాలుండటంతో మేమంటే అధికార పక్ష నేతలకు ఇంత వివక్షా..? అని కొన్ని సామాజికవర్గాల వారు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

డబ్బు పంపిణీలో తేడాలు

పోటీలో ఉన్న అభ్యర్థులు ఓట్ల కోసం డబ్బు లిస్తారు, ఓటర్లు తీసుకుంటారన్నది జగమెరిగిన సత్యం. అధికారపార్టీ నేతలు ఓటర్లకు ఇచ్చే డబ్బులో తేడాలున్నాయని ఆ పార్టీ కేడరే వాపోతోంది. మార్కాపురం పట్టణం, మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి పట్టణం, మండలాలలో వైసీపీ నాయకులు ఒక్కో చోట ఒక్కో విధంగా డబ్బు పంపిణీ చేస్తున్నారు. విశ్వాసనీయ వర్గాల సమాచారం మేరకు మార్కాపురం పట్టణంలోని ఓటర్లకు రూ.2000 పంపిణీ చేసిన వైసీపీ అభ్యర్థి, ఇతర మండలాలలో రూ.1500 పంపిణీ చేసినట్లు ఆ పార్టీ నాయకుల మధ్య చర్చ జరుగుతోంది. అభ్యర్థి సొంత సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉన్నందునే రూ.500 ఎక్కువగా ఇచ్చారన్న విమర్శలు విమర్శిస్తున్నాయి.

మందు పంపిణీలోనూ తేడాలు

వార్డు స్థాయి నాయకులకు, కౌన్సిలర్లకు, ఓటర్లకు పంపిణీ చేసే మందు విషయంలోనూ తేడాలున్నట్లు సమాచారం. ఆర్యవైశ్య సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉండే మెయిన్ బజారు, నాయుడు బజారు, గాంధీ బజారు, నెహ్రూబజారులో వారికి ప్రీమియం బ్రాండ్ల మందు పంచారు. మిగిలిన వార్డులలో 'జే' బ్రాండు పంపిణీ చేస్తున్నారు. దీనిపై నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలిసింది.

ఎన్నికల సిబ్బందికి ఆర్టీసీ బస్సులు

12వ తేదీ తెల్లవారుజాము నుంచి అందుబాటులోకి

ఒంగోలు (కార్పొరేషన్), మే 10 : ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు కేటాయించినట్లు జిల్లా రీజినల్ మేనేజర్ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ బస్సులన్నీ కేటాయించిన బస్‌స్టేషన్‌ల నుంచి 12వ తేదీ తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల మధ్య బయలుదేరతాయన్నారు. ఒంగోలు డిపో నుంచి ఎస్ఎన్.పాడుకు 21, మార్కాపురం- 3, కొండపి -5, గిద్దలూరు 3, కనిగిరి 4 బస్సులు నడుపుతుండగా, పొదిలి నుంచి ఒంగోలుకు- 3, దర్శికి-4, కనిగిరి-4, మార్కాపురం- 3, కొండపి 21 బస్సులు, అలాగే కనిగిరి నుంచి ఒంగోలుకు- 3, మార్కాపురం- 2, గిద్దలూరు-2, కంభం- 3 బస్సులు, అలాగే మార్కాపురం నుంచి వై.పాలెం- 19, దర్శి- 13, గిద్దలూరు-4, ఒంగోలు-4, కంభం-4, దోర్నాల- 2 బస్సులు, గిద్దలూరు బస్‌స్టేషన్ నుంచి మార్కాపురానికి 10, ఒంగోలు, పొదిలికి-4, కంభానికి 3 బస్సులు కేటాయించినట్లు ఆర్ఎం తెలిపారు. ఈ సర్వీసులన్నీ ఆదివారం ఆయా నియోజకవర్గాలకు బయలుదేరి, తిరిగి 13వ తేదీ సాయంత్రం ప్రధాన బస్‌స్టేషన్‌లకు చేరుతాయని చెప్పారు. ఈ ప్రత్యేక సర్వీసులలో సాధారణ ఛార్జీలు వసూలు చేస్తామన్నారు.

కుక్ కమ్ హెల్పర్ ద్వారా భోజన వసతి

ఒంగోలు(విద్య), మే 10 : జిల్లాలో జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో పోలింగ్‌విధులకు హాజరవుతున్న సిబ్బందికి భోజన వసతి బాధ్యతను పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించే కుక్ కమ్ హెల్పర్‌కు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధులకు పోలింగ్ సిబ్బందికి 12, 13 తేదీల్లో భోజన వసతి ఏర్పాటు చేసే బాధ్యతను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు వారికి నిధులు కూడా విడుదల చేసినట్లు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీలు రిటర్నింగ్ అధికారి అందించే వివరాల మేరకు ఎన్నికల సిబ్బందికి భోజనానికి ఏర్పాటు చేయాల్సి ఉంది. పోలింగ్ కేంద్రాలున్న అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల కుక్ కమ్ హెల్పర్లకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేశారు. భోజన వసతి ఏర్పాటు చేసేందుకుచర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ విధులకు పాఠశాలలకుచేరుకున్న సిబ్బందికి ఇబ్బంది లేకుండా చూడాలని, పాఠశాలల హెచ్ఎంలు, మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులను డీఈవో ఆదేశించారు.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో షాపులు, హోటల్స్, సినిమా హాల్స్, వాణిజ్య సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసినట్లు గుంటూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం 1988లోని సెక్షన్ 2(31)లోని అధికారులను వినియోగించుకొని ఫ్యాక్టరీలు, కర్మాగారాలలో పనిచేసే కార్మికులకు 278 జీవోను అనుసరించి వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేశామని పేర్కొన్నారు. కార్మికులకు ఎక్కడైనా సమస్యలు ఉంటే 9492555145 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 11 మే 2024
జన చైతన్యం

నాడు కేసులు.. నేడు ఊసులు

మార్కాపురంలో వైసీపీ ఓట్ల రాజకీయం

ఈ ఐదేళ్ల పాలనలో వ్యాపార వర్గాలపై ఎడాపెడా కేసులు

చివరికి వారి ఆస్తులను సైతం గుప్పిట పెట్టుకున్న అధికార పార్టీ నేతలు



మార్కాపురం, మే 10 : నియోజకవర్గంలో వారిది కీలకమైన సామాజిక వర్గం. వ్యాపారాలలో తలమునకలవుతుంటారు. ఆదినుంచి ఒక పార్టీకి ఎక్కువ సంఖ్యలో వాళ్ల మద్దతు ఇస్తారనేది అందరికీ తెలిసిందే. కానీ అదే ఈ ఐదేళ్ల పాలనలో వారికి శాపమైంది. అదీఇదీ అని కాకుండా అన్ని విషయాల్లోనూ వారిని పాలన గణం వేధింపులకు గురిచేసింది. చివరికి వారి ఆస్తులను సైతం వదల్లేదు. వ్యాపారాలు చేసుకునే వాళ్ల పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. అంతేనా కొందరు జైలుపాలు కూడా కావాల్సివచ్చింది. ఇన్ని కష్టాలు అనుభవించిన ఆ సామాజికవర్గమే నేడు అధికార పార్టీకి కీలకమైంది. జరిగినవేవో జరిగిపోయాయి ఈసారి మద్దతిస్తే మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామంటూ బుజ్జగింపుల పర్వం మొదలుపెట్టింది. మరీ ఆ సామాజికవర్గం ఓటర్ల తీర్పు ఏ విధంగా ఉండబోతోందో వేచిచూడాల్సిందే.

బెల్లం అమ్మారని జైళ్లకు పంపారు



మార్కాపురం పట్టణంలో రెండేళ్ల క్రితం చిల్లర దుకాణాలు నిర్వహించుకునే వ్యాపారులు పదుల సంఖ్యలో ఊరు విడిచివెళ్లారు. కొందరు కేసుల పాలై జైలుకు కూడా వెళ్లారు. వాళ్ల చేసిన నేరం ఏంటంటే బెల్లం అమ్మడమే. ఎర్ర బెల్లం అమ్మినవాళ్లను కూడా వదలకుండా కేసులు పెట్టారు.

అప్పట్లో నాటుసారా నియంత్రణ కోసం స్థానిక ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారులు ఒత్తిడి చేశారు. వారి ఒత్తిళ్లను అధికారులు వ్యాపారులపై రుద్దారు. వాస్తవానికి నాటు సారా తయారీకి నల్లబెల్లం మాత్రమే వాడతారు. అది అమ్మిన వాళ్లపై చర్యలు తీసుకోవాలి. అధికారులు ఇంట్లో వాడుకునే ఎర్రబెల్లం అమ్మేవాళ్లపై జులం చూపారు. చిన్న పాటి వ్యాపారాలు చేసుకునే తమపై ఈ వేధింపులు ఏంటని స్థానిక నాయకుల వద్ద మొరపెట్టుకున్నా ఆనాడు పట్టించుకున్న దాఖలాలులేవు.

ఆస్తులనూ వదల్లేదు

మార్కాపురంలో ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన భూకబ్జాలు అన్నీఇన్నీ కావు. వీటిపై జిల్లా ఉన్నతాధికారులు సిట్‌ను కూడా ఏర్పాటు చేశారంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భూములు, ఆస్తులు కబ్జాకు గురైన బాధితుల్లో వ్యాపారాలు చేసుకునే సామాజికవర్గం వారే ఎక్కువమంది ఉన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువైన ఆస్తులను పోగొట్టుకున్నారు. దీంతో పద్ధతిగా వ్యాపారాలు చేసుకొనే వీళ్ల పోలీసు స్టేషన్లు, కోర్టుల మెట్లు ఎక్కాల్సిన దుస్థితి వచ్చింది. ఇంత జరుగుతున్నా ఆ సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు అధికార పార్టీలో ఉన్నా పట్టించుకున్న నాథుడే లేడు.

నేడు ఓట్ల కోసం నేతల మొసలి కన్నీరు

గత ఐదేళ్లుగా వ్యాపార సామాజికవర్గం అన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా.. పట్టించుకోని అధికార పార్టీ నాయకగణం నేడు మాత్రం వారి ఓట్ల కోసం మొసలికన్నీరు కారుస్తోంది. ఆస్తులు పోగొట్టుకుని, కేసులు పెట్టించుకుని జైళ్లపాలైనా ఆనాడు ఏ ఒక్కరి కోసం కన్నెత్తి కూడా నాయకగణం చూసిన పాపానపోలేదు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో వారి ఓట్లు కీలకం కావడంతో ప్రసన్నం చేసుకునేందుకు అధికార పార్టీ నానాపాట్లు పడుతోంది. తమకు మద్దతిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా చూసుకుంటామని హామీలిస్తోంది. కొందరిని ప్రలోభాలకు సైతం గురి చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. కానీ వ్యాపార వర్గాలు మాత్రం ఐదేళ్ల కాలంలో వారికి జరిగిన అవమానాలను మర్చిపోయే పరిస్థితి కనిపించడంలేదు.

జగనన్న మహిళా మార్ట్ మాయ..!

ఎన్నికల వేళా సరుకులు కొనుగోలు చేయాలని సభ్యులపై ఒత్తిడి

అద్దంకి, మే 10 : టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు 5 రూపాయలకే కడుపు నిండా అన్నం పెట్టిన అన్న క్యాంటీన్‌లను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేయించారు. అద్దంకిలోని అన్నక్యాంటీన్ భవనంలో 2022 ఫిబ్రవరి 3న మెప్మా ఆధ్వర్యంలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని సుమారు 8 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రూ.150 చొప్పున పెట్టుబడి నిధిని వసూలు చేసి మహిళా మార్టును నిర్వహిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కన్నా తక్కువ ధరకే సరుకులు అందజేస్తామని, ఏటా జమాఖర్చులు లెక్కలు చూసి వచ్చే ఆదాయాన్ని సభ్యులకు పంపిణీ చేస్తామని మెప్మా అధికారులు గొప్పలు చెప్పారు. ఇప్పటికి రెండేళ్లు దాటినా ఇంతవరకు సభ్యులకు పెట్టుబడి నిధిలో నయా పైసా కూడా తిరిగి ఇవ్వలేదు. జమాఖర్చుల సంగతి దేవుడెరుగు నెలనెలా సరుకులు కొనుగోలు చేయాలని స్వయం సహాయక సంఘాల సభ్యుల మెడపై కత్తి పెడుతున్నారు. ఆర్పీలకు టార్గెట్‌లు విధిస్తుండడంతో అనునిత్యం సభ్యులకు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తున్నారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక సభ్యులు సరుకుల కొనుగోలుకు జగనన్న మహిళా మార్ట్‌కు వెళ్తే అక్కడ సరుకులు కొన్న వారిని నిలువు దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సరుకుల ధరలను పరిశీలిస్తే బహిరంగ మార్కెట్ కంటే 5 నుంచి 10 శాతం ఎక్కువగా ఉన్నాయని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. ధరలు ఎక్కువగా ఉండడంతో మరోసారి సరుకుల కొనుగోలుకు వెళ్లేందుకు నిరాసక్తత చూపుతున్నారు. ఎన్నికల వేళ జగనన్న మహిళా మార్ట్ పేరులో జగనన్న పేరును మూసివేశారు. ఎన్నికల వేళలో కూడా సరుకులు కొనుగోలు చేయాలని స్వయం సహాయక సంఘాల సభ్యులపై ఒత్తిడి చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆర్పీలు, స్వయం సంఘాల గ్రూపు లీడర్ల ఫోన్లు అంటేనే స్వయం సహాయక సంఘాల సభ్యులు బెంబేలెత్తుతున్నారు. ఈ విషయమై మెప్మా సీఎంఎం ఫణికుమారిని వివరణ కోరగా సరుకుల కొనుగోలు విషయమై సభ్యులపై ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని తెలిపారు.

అధికారపార్టీ నేతల్లో అసంతృప్తి

వలస ఓటర్లను రప్పించేందుకు గ్రామ నాయకులు ప్రతిపాదన

వాటిని తాటిపర్తి పట్టించుకోకపోవడంపై అనుమానాలు


మంత్రి సురేష్ అనుయాయులనూ దూరం పెట్టిన చంద్రశేఖర్

ఎవర్నీ నమ్మకపోతే ఎలా అంటూ నాయకుల ఆందోళన

మార్కాపురం, మే 10 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసీపీ నేతల్లో అసంతృప్తులు అగాధాల్లా పెరిగాయి. ద్వితీయ, గ్రామ స్థాయి నాయకుల మధ్య ఈ అసంతృప్తి తీవ్రంగా ఉంది. గ్రామస్థాయి నాయకులు వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ విజయానికి కృషి చేస్తున్నప్పటికీ ఆయన నుంచి సహకారం కరువైందని ఆ పార్టీ కేడర్ వాపోతోంది. ఎన్నికల ప్రచారం విషయంలో కూడా ఓటర్ల ప్రాధాన్యత ఉన్న గ్రామాలలో ఎక్కువ సేపు ఉండడం లేదని, క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యపై ఎటువంటి హామీలు ఇవ్వడం లేదని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఏదైనా అంశాన్ని తాటిపర్తి చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన నుంచి స్పందన ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవర్నీ నమ్మకుండా అనుమానిస్తే ఎలా అని ఆపార్టీ నేతలు వాపోతున్నారు. ఇలా అయితే గ్రామాల్లో తమ పట్టుపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస ఓటర్లను రప్పించే ప్రతిపాదనలు

నియోజకవర్గంలోని ఐదు మండలాలలో వలస ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. హైదారాబాదు, బెంగళూరు, ఇతర ప్రాంతాలలో పనులు చేసుకుంటూ సుమారు 15 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు ఓటర్ల జాబితాలను పరిశీలించి వేరే ఊర్లలో ఉండే వారి జాబితాలను తయారు చేశారు. మూడు రోజుల క్రితం ఆయా గ్రామాల వారీ జాబితాలను వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌కు అప్పగించారు. వారిని స్వగ్రామాలకు పిలిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. అయితే చంద్రశేఖర్ స్పందించడం లేదని వైసీపీ నాయకులు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. అసలు ఓట్లను రాబట్టేందుకు చేసే ప్రయత్నం చేయాలన్న ప్రయత్నాలు కూడా చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని నాయకులు మాట్లాడుకుంటున్నారు. గ్రామస్థాయిలో ఓటర్లకు హామీ ఇచ్చి ఆ పనులు చేయకపోతే గ్రామంలో పట్టుపోతుందని ఆందోళన చెందుతున్నారు.



మంత్రి సురేష్ అనుచరుల దూరం

తాటిపత్రి చంద్రశేఖర్ వైఖరితో మంత్రి సురేష్ అనుచరులు వైసీపీ ప్రచారాలకు దూరంగా ఉంటున్నారు. చంద్రశేఖర్ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచి సురేష్ అనుచరులను పట్టించుకోవడం లేదని, గ్రామాలలో ప్రచారానికి వెళ్లినప్పుడు వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారంతా చిత్తశుద్ధితో కాకుండా నామమాత్రంగానే పనిచేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామాలకు ప్రచారాలకు వెళ్లేటప్పుడు ఆయా గ్రామాలలో ఉన్న అన్నీ వర్గాలను కలుపుకోకుండా వర్గ విభేదాలను రెచ్చగొడుతున్నాడని వైసీపీ నాయకులే ప్రచారం చేస్తున్నారు. గ్రామస్థాయి నేతలలో వర్గ విభేదాలు నెలకొన్న నేపథ్యంలో టీడీపీ బలపడుతున్న వాతావరణం నెలకొంది. వైసీపీ నేతలు కొట్టుకుంటున్న సమయంలో టీడీపీ నాయకులు తమ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు గెలుపే లక్ష్యం ఐక్యంగా పని చేస్తూ మందుకు సాగుతున్నారు.

వైద్య రంగానికి మాగుంట దాతృత్వం

వైద్యశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

కరోనా విపత్కర సమయంలో స్వంత నిధులతో అండ



ఒంగోలు(కలెక్టరేట్), మే 10 : జిల్లాలో వైద్య రంగ పురోభివృద్ధికి ఒంగోలు ఎంపీ, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తన దాతృత్వంతో బాటలువరిచారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కేటాయింపుతో పాటు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నేనున్నానంటూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఒంగోలు నగరంలో 2008లో వంద మంది విద్యార్థులతో మెడికల్ కాలేజీ ఏర్పాటు విషయంలో మాగుంట కీలకపాత్ర పోషించారు. ఒంగోలులో రిమ్స్ హాస్పటల్ అభివృద్ధితో పాటు ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రిమ్స్ హాస్పిటల్‌కు రూ.30 లక్షల వ్యయంతో అంబులెన్స్ సౌకర్యంతో పాటు రూ.29 లక్షలతో రిమ్స్ కాలేజీకి బస్సును అందజేశారు. అలాగే రిమ్స్ హాస్పటల్‌లో రూ.9లక్షల వ్యయంతో రోగులను వార్డుల్లో తరలింపు కోసం రెండు బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేశారు. రిమ్స్‌లో రూ.5లక్షల వ్యయంతో బ్లడ్ బ్యాంక్‌కు ఫ్రీజ్‌తో పాటు మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు రూ.4 లక్షలతో ఫ్రీజ్‌ను అందించారు.

విపత్కర సమయంలోనూ సేవా కార్యక్రమాలు

కరోనా సమయంలో ప్రజానీకం భయాందోళనలు చెందుతున్న సమయంలో మాగుంట నేనున్నానంటూ ముందుకొచ్చి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రూ.2 కోట్ల వ్యయంతో ప్రజలకు మాస్కులు, డాక్టర్లకు ఆధునిక రెస్పిరేటరీ మాస్కులు, నెల్లూరు ఆనందయ్యమందు, బెడ్లతో మంచాలు, ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సెంట్రేటర్లు, రెగ్యులేటర్లు, శానిటైజర్లను యుద్ధప్రాతిపదికన ఒంగోలు, మార్కాపురం, దర్శి, వైపాలెం, గిద్దలూరు, కనిగిరి, సింగరాయకొండ ప్రభుత్వ వైద్యశాలలకు, ప్రభుత్వ అధికారులకు అందజేశారు. జిల్లాలో వైద్యశాలలో అందుబాటులో లేని సమయంలో, అత్యవసర సమయాలలో సరఫరాకు రూ.60 లక్షల వ్యయంతో ఒక ఆక్సిజన్ ట్యాంకర్‌ను రిమ్స్‌లో సిద్ధంగా ఉంచారు. కరోనా విపత్కర సమయంలో ప్రజలకు, రంజాన్‌పండుగ సమయంలో ముస్లింలకు, ఇబ్బందులు పడుతున్న వివిధ వర్గాల ప్రజలకు మాగుంట నిత్యవసర సరుకులను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

వైసీపీ ర్యాలీ.. అంబులెన్స్‌కు ఇక్కట్లు



వైసీపీ నేతల ఎన్నికల ప్రచార ర్యాలీ రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌కు ఇబ్బందులు కలిగించింది. శుక్రవారం సాయంత్రం మార్కాపురంలో పూలసుబ్బయ్య కాలనీ నుంచి అమ్మవారిశాల వరకు వైసీపీ వారు బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. ర్యాలీ కోర్టు సెంటర్‌కు చేరిన సమయంలో అంబులెన్స్ అక్కడకు చేరుకుంది. ర్యాలీలోని మోటార్‌సైకిళ్లు పక్కకు తప్పుకోకపోవడంతో అంబులెన్స్ నిలిచిపోయింది. దీంతో అందులోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

\- మార్కాపురం

స్థానికుడిని.. అందుబాటులో ఉంటా

- టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి
- కొమరోలు మండలంలో విస్తృత ప్రచారం


ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

గిద్దలూరు టౌన్, మే 10 : 'నేను పుట్టింది గిద్దలూరులోనే.., నివాసం ఉండేది ఇక్కడే.., నిరంతరం మీకు అందుబాటులో ఉంటున్నా..' అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కొమరోలు మండలం అల్లినగరం పంచాయతీకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు పుల్లా కేశవరాయుడు, మాజీ సర్పంచ్ పుల్లా విజయలక్ష్మితో సహా గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో శాసనసభ్యునిగా ఉన్నానన్నారు. నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల నిధులు తెప్పించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తాను నిరంతరం ప్రజాసమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు.

బీజేపీ నేతలతో ఆత్మీయ సమావేశం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని శారద టవర్స్ నందు బీజేపీ ముఖ్య నాయకులతో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ నెల 13న జరిగే ఎన్నికలలో అశోక్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని, అత్యధిక మెజారిటీతో స్థానికుడైన అశోక్‌రెడ్డిని గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకట రామాంజనే యులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, పట్టణ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, నాయకులు రెడ్డి మల్లారెడ్డి, ఆకుల నరేష్, ఆలపాటి సాయి చరణ్, రమణ, కాసులు, చంద్ర మోహన్, మట్టె మల్లపుల్లయ్య పాల్గొన్నారు.



కంభం : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చేగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి, ఎన్‌ఆర్‌ఐ సయ్యద్ రఫి తెలిపారు. శుక్రవారం కంభం పట్టణంలోని పకీర్‌బజార్, తెలుగువీధి, లాఖాన్‌వీధి తదితర వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి తాగు, సాగునీటిని అందిస్తారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. మైనారిటీ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఇమామ్, ఖాదర్‌హుస్సేన్, నూరుల్లాఖాద్రి, ఇబ్రహీం, నాయకులు పాల్గొన్నారు.


బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశమైన క్రిష్ణకిశోర్‌రెడ్డి, ప్రచారం చేస్తున్న రామకృష్ణారెడ్డి

అవీ..ఇవీ..

గర్భిణులకు అందని సౌకర్యాలు


వెయిటింగ్ హాల్ వద్ద నిలబడి ఉన్న మహిళలు

కంభం, మే 10 : కంభం 50 పడకల ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరీక్షల కోసం వచ్చే గర్భిణులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెయిటింగ్ రూమ్ దగ్గర గర్భిణులకు కూర్చునేందుకు బెంచీల సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన


స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న మెహత

గిద్దలూరు, మే 10 : గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మయూర్ కే.మెహత సందర్శించారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. సెయింట్‌పాల్స్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను తనిఖీ చేశారు. రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిద్దార్థ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీపుల్స్ మానిఫెస్టో విడుదల


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గిద్దలూరు, మే 10 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందిన పీపుల్స్ మానిఫెస్టోను జేవీవీ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆవిష్కరించారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవహారాలను మతం నుంచి వేరు చేయాలన్నారు. సైన్స్, శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు ఉండాలన్నారు. జాతీయ నీటి విధానాన్ని రూపొందించాలని, ప్రతిఒక్కరికి సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండి తగిన ప్రణాళిక ప్రకటించాలని పేర్కొన్నారు. నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకుని విద్యారంగానికి జీడీపీలో 6శాతం నిధులను బడ్జెట్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదినారాయణ, జేవీవీ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు


ప్రచారంలో పాల్గొన్న సిబ్బంది

పొదిలి, మే 10 :కాటూరివారిపాలెం గ్రామంలో అన్నా రాంబాబు గురు వారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉద్యోగి కాటూరి ప్రసాద్ పాల్గొన్నారు. వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరినట్లు తెలిసింది. పొదిలి ఆరో సచివాలయ వలంటీర్ పెద్దినేని నీలిమా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం పరిపాటిగా మారిందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

కంభం, మే 10 : అర్థవీడు మండలం కాకర్ల-నాగులవరం మధ్య ఓ వ్యక్తి వద్ద 34 బాటిళ్ల అక్రమ మద్యం తరలిస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. పట్టబడ్డ మద్యాన్ని తమకు అప్పగించినట్లు కంభం ఎస్సై పులి రాజేష్ తెలిపారు. మార్కాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆటోలో కాకర్ల ప్రభుత్వ మద్యం దుకాణం నుండి 34 క్వార్టర్ బాటిళ్ల మద్యం అక్రమంగా మార్కాపురం తరలిస్తుండగా పట్టుకుని తమకు అప్పగించినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎర్రగొండపాలెం, మే 10 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు చేపడతామని, క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని ఆర్వో పి శ్రీలేఖ శుక్రవారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. మే 11వ తేది సాయంత్రం 6 గంటల నుంచి నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురు వ్యక్తులకుమించి ఒకచోట గుమి కూడరాదన్నారు. ఇప్పటివరకు రూ.39.10 లక్షల పదివేలు నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామం వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 14 క్వింటాళ్ళ బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఓటర్లను ప్రలోభపెట్టి నగదు పంపిణీ చేసే వారి వివరాలు ఫోన్‌చేసి తెలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 6 తీవ్రసమస్యాత్మక గ్రామాలు, 57 సమస్యాత్మక గ్రామాలు గుర్తించినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాతో ఎక్కడ ఫోటోలు తీయరాదని, అలా ఎవరైనా ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200మీటర్లు వరకు ఎలాంటి టెంట్లు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 160 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల ఓటర్లు ఉదయం 7 గంటలకు క్యూలో ఉండి ఓటు హక్కు ఉపయోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ ఓటు వేయడానికి వచ్చే వృద్ధులు మహిళలు తాగునీరు తీసుకొని రావాలని తెలిపారు. బీపీ షుగర్ ఉన్న వారు వెంట ట్యాబ్‌లెట్లు తెచ్చుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో 265 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 29 రూట్లలో వాహనాలు ఏర్పాటుచేసి, 29మంది రూట్ ఆఫీసర్లుఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు సోమ్లనాయక్, డీటీ రామకిష్ణ, నోడల్ ఆఫీసరు ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజల వజ్రాయుధం

- సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా


మోటారు సైకిల్‌ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం, మే 10: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఆయుధమని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రధాన వీధులలో శుక్రవారం మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రజలు మే 13న నిర్భయంగా ఓటు వేసి తమకు ఇష్టమొచ్చిన నాయకుడిని పాలకునిగా ఎన్నుకోవాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఈ.కిరణ్, ఉద్యోగులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

- సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా


సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌మీనా

మార్కాపురం, మే 10: రాజకీయ పార్టీల తరపున ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవా రం అన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ రోజున ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. వాహనాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో డోన్లను ఉపయోగించరాదన్నారు. రాజకీయపార్టీల నేతలు 200 మీటర్లలోపు ఎటువంటి టెంట్లు వేయరాదని, తర్వాత కూడా ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అనుమతులు లేనివారు ఆ టెంట్లలో ఉండటానికి అనుమతించరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, జనసేన, సీపీఐ, ఆమ్‌ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాడ్జీలను తనిఖీచేసిన ఎస్‌ఐ

పొదిలి, మే 10 : పట్టణంలోని పలు లాడ్జీలను ఎస్‌ఐ కోటయ్య తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగదు, మద్యం అధిక మొత్తంలో పొదిలికి వచ్చాయనే సమాచారంతో పట్టణంలో లాడ్జీలపై దాడులు నిర్వహించారు. ప్రతి రూమును క్షుణ్ణంగా పరిశీలించి అద్దెకు దిగిన వారి చిరునామాలు, వారు ఏ పనిమీద వచ్చారు ఎక్కడ నుండి వచ్చారు అనే కోణంలో ప్రశ్నించారు. కొత్తవారి సమాచారం తప్పకుండా తీసుకోవాలని వాటిని ఎప్పుడు అడిగితే అప్పుడు చెప్పాలని లాడ్జీ యజమానులకు సూచించారు.

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం

- ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 10 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని, చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి అవుతాడని టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి సైకిల్‌గుర్తుకే అధికంగా ఓట్లు వేయాలని కోరారు. తనను, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ ర్యాలీ పుల్లలచెరువు బస్టాండు కూడలి మీదగా టీడీపీ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి పాల్గొని ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు

త్రిపురాంతకం : మండలంలోని రామసము ద్రం గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. గ్రామానికి చెందిన చిలకల వీరారెడ్డితో పాటు మరో ఐదు కుటుంబాలకు ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడనే నమ్మకంతో ప్రతి ఒక్కరూ టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఎం.అల్లూరిరెడ్డి, సీహెచ్.ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు, రాఘవరెడ్డి

50 కుటుంబాలు చేరిక

పుల్లలచెరువు : మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలం సుద్దకురువ తాండ , సింగుపల్లి గ్రామాల్లో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 50 కుటుంబాలకు వై.పాలెం టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు కూడా కల్పించలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయ కులు రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, గజ్వేల్లి భాస్కర్, కె కుమార్, మేడికొండ లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలం నుంచి టీడీపీలో చేరిన నేతలు

మార్కాపురం సమగ్ర అభివృద్ధే లక్ష్యం: కందుల

మార్కాపురం, మే 10: మార్కాపురం సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని ఉమ్మడి కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 1 నుంచి 14వ వార్డు వరకు శుక్రవారం టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గ సర్వతోముఖావృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లా సాధన, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమన్నారు. ఈ రెండు హామీలపై ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నియోజకవర్గానికి వచ్చిన ప్రతిసారి హామీఇచ్చినట్లు గుర్తు చేశారు. తాను 22 సంవత్సరాలుగా ప్రజల సేవ లోనే ఉన్నానన్నారు. ప్రస్తుతం తన సేవకు, ప్రత్యర్థి పార్టీ డబ్బు కు మద్యానికి మధ్య యుద్ధం జరుగు తోందన్నారు. ప్రజలుసేవ పక్షాన నిలబడతారని మీ ఆదరణను చూ స్తే అర్థమవుతోందన్నారు. నియోజక వర్గంలో వేలాదిమంది నిరుద్యోగు లు ఉన్నారని జిల్లా సాధనతో వారి కి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో 154 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రైతన్నల కళ్లలో ఆనందం నింపాలంటే వెలిగొండ ప్రాజెక్టుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, బీసీ నాయకులు కొప్పుల శ్రీనివాసులు, పఠాన్ నాగూర్‌ఖాన్ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న కేడర్


మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

- మండలంలోని మిట్టమీదపల్లి, తిప్పాయపాలెం గ్రామాలలో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ

మార్కాపురం : పట్టణంలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు శుక్రవారం రాత్రి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించాయి. స్థానిక కళాశాల రోడ్డులోని సెవెన్‌హిల్స్ హోటల్ వద్దనుంచి ప్రారంభమైన ర్యాలీ విశ్వేశ్వర థియేటర్, జువ్విచెట్టు, శివాలయం మండపం, రథం బజార్, అమ్మవారిశాల, రీడింగ్ రూమ్ మీదుగా కంభం రోడ్డు వరకు సాగింది. సుమారు వెయ్యి మోటార్ సైకిళ్లతో నిర్వహించిన ర్యాలీ కూటమిలో జోష్ నింపింది.

వైసీపీలో పోస్టల్ బ్యాలెట్ కలవరం

- కూటమికే ఉద్యోగుల మద్దతు
- జగన్ పాలనలో అణచివేత కారణం

గిద్దలూరు టౌన్, మే 10 : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీ నేతల్లో కలవరం మొదలైంది. వైసీపీ పాలనలో ఉద్యోగులు అణచివేతకు గురి కాగా ఓట్ల రూపంలో వారంతా బదులు తీర్చుకున్నారని తెలుస్తోంది. 4న ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం ముగిసింది. కాగా అధిక శాతం మంది ఉద్యోగులు వైసీపీని వ్యతిరేకిస్తూ టీడీపీ అభ్యర్థులకు ఓటు వేశారని ప్రచారం సాగుతోంది. దీంతో తమ గెలుపు కష్టమేనని వైసీపీ అభ్యర్థు ల్లో నిరాశ కనిపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే వారంలోపే సీపీఎస్ రద్దు చేస్తాం, ప్రభుత్వ ఉద్యోగులకు మరింత మేలు చేస్తామని గత ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వైసీపీకి వైపు మొగ్గు చూపారు. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తికావచ్చినా ఇంతవరకు సీపీఎస్ హామీ నెరవేర్చలేదు. మరోవైపు ఎప్పుడూ లేనంతగా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారు. హక్కులపై పోరాడితే ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. డీఏ బకాయిలు విడుదల కాలేదు. దీంతో ఉద్యోగుల ప్రభుత్వంపై వ్యతిరేకతను స్పష్టంగా ఓటు రూపంలో వ్యక్తం చేసినట్లు ప్రచారం సాగుతోంది. గిద్దలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు 3456 ఉండగా సుమారు 94.33 శాతం పోలింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో అధిక భాగం ఉద్యోగులు కూటమి వైపు మొగ్గు చూపినట్లు సమాచారం.

జీజీహెచ్ పనుల్లో లోపిస్తున్న నాణ్యత

- మూన్నాళ్లకే కూలిన గోడలు, తప్పిన పెను ప్రమాదం
- ఎన్ఎంసీ విజిట్ నేపథ్యంలో హడావుడిగా పనులు
- జీజీహెచ్‌లో పనుల్లో 'మెగా' కక్కుర్తి

మార్కాపురం, మే 10 : వైద్యశాలలో అవి కీలకమైన పనులు. రోగుల క్షేమం దృష్ట్యా ఎంతో నాణ్యతతో ఆ పనులు జరగాల్సిన ఉంది. ఏ మాత్రం తేడావచ్చినా రోగుల ప్రాణాలతో చెలగాటమాడినట్లే. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ మాత్రం 'ఎవరేమైతే మాకేంటి మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం' అన్నట్లు వ్యవహరించింది. దీంతో కాంట్రాక్టర్ కక్కుర్తి, నిర్లక్ష్యం వెరసి నాసిరకం పనులతో నిర్మాణం పూర్తయిన నెలలోపే గోడలు, సీలింగ్ మంగళవారం రాత్రి కూలిపోయాయి. ఇదీ మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరుగుతున్న అదనపు గదుల పరిస్థితి. పనులు చేస్తోంది బడా నిర్మాణ సంస్థ కావడంతో పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ విభాగం కళ్లకు గంతలు కట్టుకొని చోద్యం చూస్తోంది.

ఎన్ఎంసీ విజిట్ నేపథ్యంలో హడావుడిగా పనులు

మార్కాపురం మండలంలోని రాయవరం వద్ద మెడికల్ కళాశాలను రెండేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. 2022 మేలో శంకుస్థాపన చేశారు. పనులను ప్రభుత్వం మెగా ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించింది. నిధుల కేటాయింపులు సరిగా లేక తొలినాళ్లలో పనులు చాలా నెమ్మదిగా జరిగాయి. 2023-24 విద్యా సంవత్సరంలోనే కళాశాల ప్రారంభం కావాల్సివుంది. 2023 ప్రారంభంలోనే నేషనల్ మెడికల్ కౌన్సిల్ టీం విజిట్ చేసింది. అన్ని రకాల వసతులు సక్రమంగా లేకపోవడంతో ఆ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ఎన్ఎంసీ అనుమతులు ఇవ్వలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 2023 చివర్లో మళ్లీ ఎన్ఎంసీకి దరఖాస్తు చేసుకుంది. 2024-25 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరింది. ఎన్ఎంసీ టీం ఏప్రిల్, మే నెలల్లో ఎప్పుడైనా పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ సంవత్సరం ఆరంభం నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాయవరం వద్ద విద్యార్థుల కోసం తరగతి గదులు, హాస్టల్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కీలకమైన వైద్యశాల పనులను తాత్కాలికంగా పట్టణంలోని జీజీహెచ్ వద్ద చేపట్టారు. ఈ తాత్కాలిక పనులకు ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. పనుల్లో భాగంగా మొదటి ఫ్లోర్‌లో 70 బెడ్లు, రెండో ఫ్లోర్‌లో 220 బెడ్లు ఏర్పాటు చేసేందుకు వేగంగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే వైద్యశాలకు 150 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 440 బెడ్లు అన్ని సౌఖర్యాలతో రోగులకు అందుబాటులో ఉంటేనే ఎన్ఎంసీ సంతృప్తి చెంది అనుమతులు ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే కాంట్రాక్ట్ సంస్థ నాసిరకంగా హడావుడితో నిర్మాణాలు చేస్తోంది. రోగుల ప్రాణాలతో ముడిపడివున్న ఇలాంటి కీలకమైన పనులను పర్యవేక్షిస్తున్న ఏపీ ఎంఐడీసీ ఇంజనీరింగ్ విభాగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

తప్పిన పెను ప్రమాదం



ప్రస్తుతం మార్కాపురం జీజీహెచ్‌లో అడ్మిట్ అయ్యే రోగుల సంఖ్య పెరిగింది. గతంలో 150 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ సంఖ్యకు మించి ఆపరేషన్‌లు చేయించుకునే రోగులు పెరిగితే తాత్కాలిక జరుగుతున్న పనుల్లో పూర్తైన కొన్ని వార్డుల్లోకి పంపుతున్నారు. వాస్తవానికి పనులు మొత్తం పూర్తికాకుండా ఆ వార్డుల్లోకి రోగులను పంపకూడదు. కానీ విధిలేని పరిస్థితుల్లో కొన్నాళ్లుగా వైద్యులు రోగులను నూతన వార్డుల్లో ఉంచుతున్నారు. అయితే ఇటీవల వర్షానికి ఓ వార్డు గోడ కూలింది. ఆ వార్డు పక్కన ఉన్న మరో వార్డులో సుమారు 50 మంది వరకు రోగులు ఉన్నారు. రోగులు ఉన్న వార్డుల్లో ప్రమాదం జరిగివుంటే పరిస్థితి తీవ్రంగా ఉండేది. అదృష్టవశాత్తు పక్కవార్డులో ప్రమాదం జరగడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.



మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాల, వైద్యశాల వార్డులో కూలిన గోడ

హడావుడిగా మరమ్మతుల పనులు

తాత్కాలిక వార్డుల్లో మంగళవారం రాత్రి గోడ, సీలింగ్ కూలిన విషయం తెలుసుకున్న కాంట్రాక్టు సంస్థ ప్రతి నిధులు హడావుడిగా అక్కడ మరమ్మతుల పనులు చేపట్టారు. ఇంత జరుగుతున్నా అక్కడ పర్యవేక్షించాల్సిన ఏపీఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మాకు సంబందంలేదు

వైద్యశాలలో జరుగుతున్న పనులతో మాకు ఎలాంటి సంబందంలేదు. ఆ పనులను ఏపీఎంఐడీసీ పర్యవేక్షిస్తోంది. రోగుల సంఖ్య ఎక్కువైనప్పుడు తాత్కాలికంగా ఈ కొత్తభవనం వార్డులు కొన్నింటిలో రోగులను అడ్మిట్ చేస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాను.

డాక్టర్ సావిత్రి, జీజీహెచ్ సూపరింటెండెంట్



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు

దర్శి, మే 10: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు కోరారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను ప్రలోభపెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలను అందరూ తుచ తప్పకుండా పాటించాలన్నారు. ఎవరైనా గొడవలకు దిగినా, పోలింగ్ నిర్వాహణకు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, పలువురు స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

దర్శి, మే 10: మండలంలోని తూర్పుచౌటపాలెం హరిజనవాడకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోదరుడు భరత్ వారికి టీడీపీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతుందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వెలుగొండారెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి ఎర్రబాలెం కాలనీవాసులు

దొనకొండ, మే 10: మండలంలోని ఎర్రబాలెం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గుడిమెట్ల ఇస్సాక్, ప్రకాశం, వెంకటయ్య, కోటేశ్వరరావు, మురి కిపూడి ఏబు, ఎం గురుమూర్తి, ఆదాం, కిశోర్ , తదితరులుకు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పోతిపోగు చెన్నయ్య, బత్తుల బాలరాజు, మోడి చిన్నఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను దోచుకున్నవారికి బుద్ధిచెప్పాలి



మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉగ్ర తనయ ఊహశ్రీ

పామూరు, మే 10: రాష్ట్రంలో సహజ వనరులను దోచుకొన్న పాలకులకు ఈ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కుమార్తె ఊహశ్రీ పిలుపునిచ్చారు. అభివృద్ధికి పాటుపడే టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శుక్రవారం సీఎస్ పురం మండలం కోవిలంపాడు గ్రామంలో టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ దౌలత్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పామూరు మండలం కోడిగుంపల గ్రామంలో ఉగ్ర తనయుడు జయసింహారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారం ఉన్నా, లేకపోయినా గత పది సంవత్సరాలుగా ఉగ్రనరసింహారెడ్డి నియోజకవర్గంలో ప్రజాసేవ కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఉగ్రను, ఎంపీగా మాగుంటను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పునుగుబాటి మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

పామూరు, మే 10: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ అన్నారు. మండలంలోని చిలంకూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ కూటమి ప్రకటించిన మహిళాశక్తి, సూపర్‌సిక్స్ పథకాల గురించి విస్తృత ప్రచారం చేపట్టారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో ఎమ్మెల్యేగా ఉగ్రను, ఎంపీగా ఉగ్రకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వాడి జయమ్మ, వెంకటలక్ష్మమ్మ, పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు నమూనా ఈవీఎంతో ముమ్మర ప్రచారం చేశారు.

దొనకొండను పారిశ్రామిక నగరంలా తీర్చిదిద్దుతాం

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

దొనకొండ, మే 10: ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకున్న గొట్టిపాటి రాజకీయ కుటుంబం వారసురాలిగా మీ ముందుకు వచ్చా.. ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే దొనకొండను పారిశ్రామిక నగరంలా తీర్చిదిద్దుతానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని మల్లంపేట, బాదాపురం, గుట్టమీదపల్లి, ఎర్రబాలెం, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు తమపట్ల చూపుతున్న ఆదరణ మరువలేనిదని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దొనకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెలిగొండ నీటిని రప్పించి తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటే శ్వర్లు, పులిమి రమణాయాదవ్, షేక్ మగ్బూల్ అహమ్మద్, డాక్టర్ మల్లిఖార్జునశర్మ, మండ్లా అంతోనిపీటర్, వల్లపునేని వెంకటస్వామి, వడ్లమూడి చెన్నయ్య, తోటా కోటేశ్వరరావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, వైకే చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండ: గుట్టమీదపల్లిలో గొట్టిపాటి లక్ష్మిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఒక్క అవకాశం ఇవ్వండి..
నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా!

ముండ్లమూరు, మే 10: మీ బిడ్డగా ఆదరించి అవకాశం ఇవ్వండి.. నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సేవచేసే అవకాశం కల్పించినట్లయితే ఐదు సంవత్సరాల పాటు నియోజక వర్గంలోనే ఉండి ప్రతి గ్రామాన్ని ప్రజలు ఆశించిన విధంగా అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. శుక్రవారం రాత్రి ముండ్లమూరు, సింగనపాలెంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెకు బ్రహ్మరథం పట్టారు. భారీ గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ముండ్లమూరు మండలానికి, తమ కుటుంబానికి 40 సంవత్సరాలుగా విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తన తాత స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, తన తండ్రి గొట్టిపాటి నర్సయ్య తన బాబాయి గొట్టిపాటి రవికుమార్‌లు ఎంతో అభివృద్ధి చేసి మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. తనను గెలిపించినట్లయితే ఐదు సంవత్సరాల్లో ప్రతి గ్రామాన్ని నెంబరు వన్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు మేదరమెట్ల వెంకటరావు, బేతపూడి బ్రహ్మేశ్వరరావు, సింగనపాలెం సర్పంచ్ మానం నరసింహారావు, కందిమళ్ళ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

బోదనంపాడులో బ్రహ్మరథం

కురిచేడు, మే 10: కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికి ఆమె తిరుగుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కురిచేడులోనూ ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మొఘల్ మస్తాన్‌వలి, కమతం నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి, కాట్రాజు నాగరాజు, మలిసెట్టి నాగేశ్వర రావు, కె.కాశీవిశ్వనాధరావు, తదితరులు పాల్గొన్నారు.



కురిచేడులో మహిళలతో గొట్టిపాటి లక్ష్మి

కనిగిరి ప్రాంత అభివృద్ధే లక్ష్యం



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కనిగిరి మండలం తక్కెళ్ళపాడు గ్రామస్థులు

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

» 56 కుటుంబాలు పార్టీలో చేరిక

కనిగిరి, మే 10: కనిగిరి ప్రాంతాభివృద్ధే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ టీడీపీ కూటమి గెలుపునకు కృషిచేయాలని కోరారు. కనిగిరి మండలం తక్కెళ్ళపాడు గ్రామం నుంచి మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 11 దళిత కుటుంబాలు, సీఎస్‌పురం మండలం బోడావులదిన్నె గ్రామానికి చెందిన 14 కుటుంబాలు, వెలిగండ్ల మండలం మోటుపల్లి గ్రామానికి చెందిన 14 కుటుంబాలు, హెచ్ఎంపాడు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 17 కుటుంబాలు వైసీపీని వీడి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీఎస్‌పురం మండలం బోడావులదిన్నె గ్రామస్థులు



టీడీపీలో చేరిన హెచ్ఎంపాడు మండలం కొండారెడ్డిపల్లి గ్రామస్థులు

ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కనిగిరిలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కియా లాంటి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సెల్‌ఫోన్ కంపెనీల తయారీ పరిశ్రమలు, వస్త్ర పరిశ్రమలు లాంటి వాటిని ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉపాధి పనులే కాకుండా ఇంటివద్దనే పనిచేసి ఆదాయం పొందే మార్గం కల్పిస్తామని చెప్పారు. తద్వారా పరాయి ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు లేకుండా నియంత్రిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నిమ్జ్ ఏర్పాటుకు బాటలువేసి పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీటిని తాగునీటి కుళాయిల ద్వారా సరఫరా చేయిస్తామన్నారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉందన్నారు. నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. పార్టీలకతీతంగా పారదర్శక పాలన చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కవరం వైసీపీలో వర్గపోరు

» రెండు వర్గాలకు సమన్వయ పర్చలేకపోయిన బూచేపల్లి

» వేర్వేరుగా ఎన్నికల ప్రచారం

తాళ్లూరు, మే 10: వైసీపీ మండల కన్వీనర్ తూము వెంకటసుబ్బారెడ్డి స్వగ్రామమైన లక్కవరంలో వైసీపీలో వర్గపోరు నెలకొంది. దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి రెండువర్గాలను సమన్వయ పర్చలేకపోయారు. విడివిడిగా గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడంపై ఆపార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతున్నది. మండంలోని అన్ని గ్రామాల్లోనూ వైసీపీ శ్రేణుల్లో స్వల్ప వివాదాలున్నా సర్దుబాటుచేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే, వైసీపీ మండల కన్వీనర్ తూము వెంకటసుబ్బారెడ్డి స్వగ్రామం లక్కవరంలో విభేదాలు వీడలేదు. వెంకటసుబ్బారెడ్డి, లోకిరెడ్డి చిననరసింహారెడ్డి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు సాగుతున్నది. గతంలో ఏ కార్య క్రమం జరిగినా రెండు వర్గాలు కలిసి ముందుకు సాగలేదు. దర్శి వైసీపీ ఇన్‌చార్జ్‌గా బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మూడు నెలల క్రితం నియమించినా ఇరువర్గాల మధ్య సఖ్యత కుదరలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి గతనెల 30న ఆగ్రామంలో పర్యటించారు. వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారానికి నరసింహారెడ్డి వర్గీయులు దూరంగా ఉన్నారు. ఈక్రమంలో నరసింహారెడ్డి వర్గీయులను బూచేపల్లి పిలిపించి మాట్లాడారు. వారు పార్టీకి దూరంకాకుండా ఉండేందుకు ఈనెల 8న లక్కవరంలో నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వైసీపీమండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఆయన వర్గీయులు పాల్గొనక పోవటం మండలంలోని వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమూంది. ఇరువర్గాలకు కలిపి ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉండగా, ఇరువర్గాలను సర్దుబాటు చేయలేక బూచేపల్లి రెండు సార్లు విడివిడిగా ప్రచారం నిర్వహించటంపై పార్టీ శ్రేణుల్లో విస్తృత చర్చ జరుగుతున్నది. పార్టీ మండల కన్వీనర్ సొంత గ్రామంలో రెండుసార్లు వేర్వేరుగా బూచేపల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారంటే మిగిలిన గ్రామాల్లో ఏపరిస్థితులు ఉన్నాయో ఇట్టే అర్థమవుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.



వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బూచేపల్లి(ఫైల్)



నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బూచేపల్లి(ఫైల్)

టీడీపీతోనే పల్లెలు అభివృద్ధి

పీసీపల్లి, మే 10: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభి వృద్ధి తప్ప ఈ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పల్లెల్లో ఎటువంటి పనులు జరగలేదని ఇరిగినేని రవీంద్రబాబు అన్నారు. టీడీపీ కూటమి తరపున ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిల గెలుపుకోసం శుక్రవారం మండలంలోని తలకొండపాడు, ముద్దపాడు, భట్టుపల్లి, మారెళ్ల పంచాయతీల్లో పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఓటర్లతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా తక్షణమే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో కొప్పల్లి సురేష్, గుర్రం వెంకటేశ్వర్లు, గడ్డం బాలసుబ్బయ్య, నల్లపనేని రత్తయ్య, నెలకుర్తి మాల్యాద్రి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, ఇజ్రాయెల్, అంకయ్య, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తాళ్లూరు, మే 10: ట్రాక్టర్ ట్రక్కులో కూలీలను తీసుకుని మిరపకాయల కోత కోసేందుకు తీసుకెళుతుండగా డోర్ విరిగిపడటంతో కిందపడి మహిళా కూ లీ మృతి చెందింది. శుక్రవారం బొద్దికూరపాడు గ్రామంలో ఈప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుజ్జుల కోటిరెడ్డి తన పొలంలోని మిరపకాయలను కోత కోసేందుకు కూలీలను తీసుకెళుతున్నాడు. ఈక్రమంలో ట్రక్కుడోర్ ఊడిపడటంతో, దానిపై కూర్చున్న కొందరు కింద పడిపోయారు. ఈప్రమంలో గడ్డం రాజ్యలక్ష్మి అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మరి కొందరికి స్వల్పగాయాలయ్యాయి. మృతురాలు రాజ్యలక్ష్మిని గుంటూరుజిల్లా వెల్దుర్తి మండలం మండాది గ్రామానికి చెందిన థామస్‌తో వివాహమైంది. ఆమె ఇటీవలే పుట్టింటికి వచ్చింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. మృతురాలి భర్త థామస్ ఫిర్యాదు మేరకు ఎస్సై రమణయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

» ఐదేళ్లుగా పట్టించుకోని పాలకులు

» అడుగుకో గొయ్యి..

» అభివృద్ధికి నోచుకోని పల్లెలు

పామూరు, మే 10: వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. వీటిపై ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణానికి, ప్యాకేజి రోడ్ల కింద మండలంలో 16 రోడ్లకు గాను రూ.75 కోట్లు మంజూరయ్యాయి. ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్ల కాలంలో పనులు ప్రారంభించకపోవడంతో రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపో యాయి. దాంతో గ్రామీణ రోడ్ల నిర్వహణ లేకపోవడంతో అడుగుకో గొయ్యి, గజానికో గతుకుగా రోడ్లు మారి అధ్వానంగా తయారయ్యాయి. పలు మార్గా ల్లో నడవటానికి కూడా ఇబ్బందకరంగా మారాయి. గుంతల్లో పడి వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రాత్రుళ్ళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో స్పందించకపోవడం వైసీపీ పాలనకు నిదర్శనంగా రోడ్లు నిలుస్తున్నాయి.



తవ్వి వదిలేసిన రజసాహెబ్‌పేట రోడ్డు

గోతుల్లో పడితే అంతేసంగతులు..

మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రజాసాహెబ్‌పేట గ్రామానికి వెళ్లే రహదారికి రూ.271.50 లక్షలు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మించేందుకు ఇరువైపులా యంత్రాలతో మట్టిని తొలగించి గోతులు తవ్వి వదిలివేశారు. దాంతో దిచక్ర, ఆటోలు ప్రమాణించే సమయంలో గోతులతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఫెన్సింగ్ రాళ్లలోడుతో గ్రామానికి వస్తున్న ట్రాక్టరు గోతుల్లో పడి ఒరగడంతో ఫెన్సింగ్ రాళ్లపై కూర్చొని ఉన్న ఇద్దరు కూలీలపై ఆరాళ్లు పడి మృతి చెందిన సంఘటన ఈమార్గంలో చోటుచేసుకుంది.

నిత్యం నరకం.. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి పంచాయతి కరోళ్లపాడు గ్రామ రోడ్డు నిర్మాణానికి రూ.112.89 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకొన్న కాంట్రాక్టరు రెండు చప్టాలు కట్టి స్లాబ్‌లు వేయకుండ వదిలేశారు. దాంతో గ్రామానికి రావాలన్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లయినా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో గ్రామస్థులు నిత్యం నరకయాతన పడుతున్నారు. అలాగే, మండలంలోని దూబగుంట పంచాయతి కాటంవారిపల్లి, తూర్పుకోడిగుడ్లపాడు, నర్రమారెళ్ల భూమిరెడ్డిపల్లి, రోడ్లు సైతం మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారాయి. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవడంలో వైసీపీ పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని ఆయ గ్రామాలకు చెందిన ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా కరోళ్లపాడు రోడ్డు

తారస్థాయికి చేరిన ప్రచారం

» మహిళలను ఆకట్టుకుంటున్న లక్ష్మి

» కూటమికి కలిసివస్తున్న మాగుంట పరిచయాలు

దర్శి, మే 10 : టీడీపీ కూటమి ప్రచారం తారస్థాయికి చేరింది. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి నియోజకవర్గంలో అడుగుపెట్టిన తర్వాత 35 రోజుల్లో అన్ని గ్రామాల్లో పర్యటించి విజయవంతంగా ప్రచారం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించి నీరాజనాలు పలికారు. గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో స్పష్టమైన హామీలతో ముక్కుసూటిగా మాట్లాడుతూ ప్రజలను బాగా ఆకట్టుకున్నారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనమరాలిగా, దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తెగా వారు నడిచిన బాటలో పయనిస్తూ ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తామని వివరించారు. వారి కుటుంబ సుదీర్ఘ రాజకీయ చరిత్ర దర్శి నియోజకవర్గ ప్రజలకు అంతకముందే తెలిసి ఉండటంతో ఆమెపై ప్రజలకు విశ్వాసం కల్గింది.

అలాగే, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అపార అనుభవం నియోజకవర్గంలో ఆయనకు ఉన్న విస్తృత పరిచయాలు టీడీపీ కూటమికి బాగా కలిసి వస్తున్నాయి. టీడీపీ యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి చొరవతో అనేకమంది వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలో చేరి కూటమి విజయానికి కృషి చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి విజయంపై పూర్తి ధీమాతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రచారం బాగా కలిసివచ్చింది. దర్శిలో ఏర్పాటు చేసిన సభకు ఊహించని రీతిలో వేలాదిమంది హాజరై జేజేలు పలికారు. అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో టీడీపీకి సానుకూలంగా వ్యవహరిస్తుండటంతో విజయంపై ఆ పార్టీ వర్గాలు సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. దర్శిలో శనివారం నిర్వహించే భారీ ర్యాలీతో ప్రచార పర్వం ముగియనుంది.





- ఓట్ల కొనుగోళ్లు ప్రారంభం
- నగదు పంపకాల్లో పార్టీల నాయకులు
- ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలతో పంపిణీ
- ప్రాంతాలను బట్టి రూ.1,500 నుంచి రూ.3 వేలు

ఓటుకు.. నోటు

ఓటు.. నోటు.. వల.. ఇదీ ఎన్నికల పంథాగా మారింది. ప్రచారాల్లో నిమగ్నమైన నేతలు పోలింగ్ సమీపిస్తోన్న దశలో నోట్ల పంపకానికి సిద్ధమయ్యారు. ప్రచారాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటి వరకు ప్రయత్నిం చిన ప్రధాన రాజకీయ పార్టీలు నగదు పంపకానికి తెరలేపాయి. ప్రచారానికి తెర పడక ముందే ప్రలోభాల పర్వానికి రాజకీయ పార్టీలు తెర లేపాయి. ప్రతీ ఓటరు కు డబ్బు చేరేలా పకడ్బందీగా ప్రణాళిక రూపొందిం చుకుని అమలు చేస్తున్నారు. వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు గస్తీ తిరుగుతు న్నా వాటి కళ్లు గప్పి నగదు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం అభ్యర్థులు ప్రత్యేక బృందాలను నియమించుకుని పర్యవేక్షిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో గురువారం నుంచే నగదు పంపిణీ చేపట్టగా శుక్రవారానికి తారస్థాయికి చేరింది. ఓట్ల కొనుగోలుకు సాంకేతికతను కూడా కొందరు అభ్యర్థులు వినియోగిస్తున్నారు.

నియోజక వర్గానికి రూ.40 కోట్లు

బాపట్ల జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి కనీసం రూ.40 కోట్లు పంచేలా ప్రణాళికలు రచించారు. ఈ మొత్తం రూ.60 కోట్ల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాపట్లలో అధికారపార్టీ అభ్యర్థి తరపున ఓటుకు రూ.1,500 పంచుతున్నట్లు సమాచారం. అద్దంకి, పర్చూరు లాంటి నియోజకవర్గాల్లో ఈ మొత్తం రూ.2,000గా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీ ఎంత డబ్బు పంచుతుందనే అంశంపై దృష్టి పెట్టి వారిచ్చిన దాని కంటే ఎక్కువ మొత్తం ప్రత్యర్థి ఇస్తున్నారని తెలిస్తే అప్పటికప్పుడే డబ్బు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. అద్దంకి, పర్చూరు, రేపల్లె లాంటి చోట్ల డబ్బు పంపిణీపై తాడేపల్లి పెద్దలు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

పల్నాడులో రూ.450 కోట్లు ఖర్చు?

పల్నాడు జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఓట్ల కొనుగోళ్లు ప్రారం భమయ్యాయి. గురువారం రాత్రి నుంచి ఈ ప్రక్రియ ఊపందుకుంది. ఓట్ల కొనుగోలుకు జిల్లాలో రూ.450 కోట్ల వరకు ఖర్చు అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటు రేటు రూ.3 వేలు పలికింది. రెండు నియోజకవర్గాల్లో ఇరు పార్టీలు ఓటుకు రూ.1,500గా రేటు నిర్ణయించి పంపిణీ చేస్తున్నారు. అయితే పట్టణంలో రూ.1500 చెల్లిస్తుండగా మరో నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరో నియోజకవర్గంలో పట్టణ ఓటర్లకు ఇరుపార్టీలు రూ.2,500, గ్రామాల్లో రూ.2 వేలు అందజేస్తున్నట్లు సమాచారం. అరాచకాల అడ్డాగా ఉన్న నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి గ్రామాల్లో రూ.3 వేలుకు, పట్టణంలో ఇంకా ఎక్కువ రేటుకే ఓట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రత్యర్థి మాత్రం గ్రామం, పట్టణం అన్న తేడా లేకుండా రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఓ ప్రధాన నియోజకవర్గంలో ఇరు పార్టీలు రూ.2 వేలు చెల్లిస్తుం డగా, ఓ అభ్యర్థి ఓటు కార్డు స్కాన్‌తో నగదు అందిస్తున్నట్లు తెలిసింది. ఒకే సామా జికవర్గానికి చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్న ఓనియోజకవర్గంలో ఓటుకు రూ.3వేలు చెల్లిస్తున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. మరో నియోజకవర్గంలో ఓటుకు ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు రెండేసి వేలు చెల్లిస్తున్నారు.

తక్కువగా గుంటూరు తూర్పులో రూ.వెయ్యి

పోలింగ్ తేదీ సమీపించడంతో గుంటూరు జిల్లాలోని ఓటర్లను ఆకట్టుకునేందుకు నగదు పంపిణీ గురువారం నుంచే ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గంలో ఓటుకు రూ.2,500 చొప్పున పంచుతున్నారు. వైసీపీ నేతలు పట్టణంలో రూ.2,500, గ్రామాల్లో రూ.1,500ల నుంచి రూ.2వేల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో రూ.1,500 చొప్పున ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. గుంటూరు తూర్పులో ఓటరుకు రూ.వెయ్యి చొప్పున ఇరుపార్టీల తరుపున పంపకాలు మొదలయ్యాయి. పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం వైసీపీ రూ.2 వేలు పం పిణీ చేసినట్లు సమాచారం. తెనాలిలో రూ.1500 వరకు ఓటుకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

(గుంటూరు, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికల్లో ప్రచారం ముగిశాక డబ్బు పంపిణీ చేపట్టేవారు. అయితే ఈ సారి దీనిని మార్చి వేశారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగుస్తుంది. అప్పటికల్లా డబ్బు పంపిణీ పూర్తి చేసేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రచారం ముగిశాక తనిఖీలు జరగవచ్చన్న అంచనాతో ధనం పంపిణీలో నాయకులు జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో గురువారం నుంచే డబ్బు పంపిణీని ప్రారంభించారు. పలు నియోజకవర్గాల్లో శుక్రవారం నగదు పంపిణీ విస్తృతంగా జరిగింది. ఎన్నికల యంత్రాంగం తనిఖీలు నిర్వహించే లోపే డబ్బు పంపి ణీ పూర్తి చేయాలనే ఆలోచనలో నేతలు ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కొక్క విధానంలో ఓటర్ల కొనుగోళ్లు జరుగుతున్నట్లు సమాచారం. నియోజక వర్గంలో 1.50 లక్షల నుంచి 2 లక్షల చొప్పున ఓటర్ల ను కొనుగోలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బును సిద్ధం చేసుకుని పంపిణీ చేస్తున్నారు. ఒక పార్టీ సానుభూతి పరుల ఓట్లను మరో పార్టీ కొనుగోలు చేయడంలేదు. ఈ మేరకు ఓటర్ల జాబితా ల్లో సదరు పేర్లను గుర్తించి కొనుగోళ్లు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులు కూడా ప్రత్యేకంగా పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం కల్లా ఓట్ల కొనుగోలును పూర్తి చేసుకునేలా ప్రణాళికను రూపొం దించుకున్నారు. డబ్బు పంపిణీ పూర్తి చేసుకుంటేనే మరో వైపు పోలింగ్ వ్యూహాన్ని అభ్యర్థులు రూపొం దించుకుంటున్నారు. ఎంత డబ్బు పంపిణీ చేసినా పోలింగ్ రోజున పై చేయి సాధించకపోతే ప్రతికూల ఫలితాన్ని చూడాల్సి వస్తుందన్న అభిప్రాయంతో అభ్యర్థులు డబ్బు పంపిణీని వీలైనంత త్వరగా ముగించేందుకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి డబ్బులు పంపిణీ ప్రారంభమైనా పోలీసుల నుంచి మొక్కుబడి తనిఖీలు తప్పితే పంపిణీని కట్టడి చేయాలనే చిత్తశుద్ధి లేకుండా పోయింది. దీనికితోడు కొంతమంది పోలీసులు, అధికారులు పాలకపార్టీకి అండగా ఉండటంతో పంపిణీలో వైసీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారని సమాచారం.

మీ డబ్బు మాకొద్దు

ఈ దఫా మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టి కొనసాగించారు. సొంత నిధులు ఖర్చు చేసి పలువురికి ఆర్థికసాయం అందించారు. ఉపాధి అవకాశాలు కల్పించారు. దీంతో అక్కడ టీడీపీకి భారీ మెజార్టీ ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. అయితే తొలుత లోకేశ్‌ను ఓడించాలని వైసీపీ శతవిధాలా ప్రయత్నాలు చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించి లోకేశ్‌కు వచ్చే మెజార్టీని అయినా తగ్గించాలని ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో భారీగా డబ్బు పంపిణీ ద్వారా ఓటర్లకు గాలం వేస్తున్నది. ఒక్కో ఓటరుకు రూ.3 వేలు చొప్పున గడపగడపకు ఆ పార్టీ కార్యకర్తలు వెళ్లి గురువారం నుంచి పంచడం ప్రారంభించారు. అయితే చాలామంది ఓటర్లు మీ డబ్బు మాకు అవసరం లేదు.. మాకు లోకేశ్ ద్వారా ఎంతో మే లు జరిగిందని ముఖానే చెప్పి తలుపులు మూసేస్తున్నారు.

పదివేలు ఇస్తారట.. తీసుకుని సైకిల్‌కి ఓటేయండి

మంగళగిరిలో జగన్ డబ్బును ఏరులై పారిస్తున్నాడు. ఓట్ల కొనుగోలుకు రూ.300 కోట్లను కేటాయించారు. అదంతా పాపపు సొమ్మే! ఇసుక, మద్యం, గంజాయిలో అడ్డగోలుగా దోచుకున్న డబ్బది. ఓటుకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఏం ఫర్వాలేదు.. ఓటర్లు నిరభ్యంతరంగా ఆ డబ్బును తీసుకోవచ్చు. అదంతా జనం నుంచి దోచుకున్న డబ్బే. ఐదేళ్లుగా ఒక్కో ఓటరు నుంచి జగన్ లక్ష రూపాయల వంతున దోచుకుని ఇపుడు ఆ సొమ్ములో పదో వంతును మళ్లీ మీకే ఇస్తున్నాడు. ఆ డబ్బును ఓటర్లు తీసుకుని ఓటుమాత్రం రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించే తమకే అంటే సైకిల్ గుర్తుపైనే వేయాలి.

- ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు



మాచర్ల సభకు హాజరైన జనసందోహం

- జనసంద్రంలా ప్రజాగళం
- వర్షంతో సభకు రాలేకపోయిన చంద్రబాబు
- ఒంగోలు నుంచి ఆన్‌లైన్‌లో ప్రసంగించిన అధినేత

మాచర్ల.. మార్మోగింది

మాచర్ల టౌన్/నరసరావుపేట మే 10 (ఆంధ్రజ్యోతి): జనం.. జనం.. మాచర్ల జన సంద్రమైంది. ఎటుచూసినా జనమే.. ఇసుకేస్తే రాలనంత జనం. జయజయధ్వానాలతో మాచర్ల మారుమోగింది. చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా వివిధ ప్రాంతాల నుంచి గొడుగులు చేతబూని మధ్యాహ్నం మూడున్నర గంటలకే మాచర్లకి తరలివచ్చారు. మాచర్లలోని శ్రీశైలంరోడ్డులో శుక్రవారం ప్రజాగళం సభకు నేతలు ఊహించని స్థాయిలో జనం తరలి వచ్చారు. అయితే వర్షం కారణంగా సభకు హెలికాప్టర్‌లో చంద్రబాబు రాలేకపోయారు. దీంతో అభిమానులు కొంత నిరుత్సాహానికి లోనయ్యారు. ఇది గ్రహించిన చంద్రబాబు ఒంగోలు నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించి వారిలో జోష్ నింపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ప్రత్యక్షంగా హాజరై ప్రసంగించిన దాని కన్నా గంభీరమైన ఉపన్యాసాన్ని వీడియోగ్రఫీ ద్వారా వినిపించారు. పౌరుషాల గడ్డ పల్నాడు ప్రజలందరికీ వందనం అంటూ ప్రసంగం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలను ఎండగట్టారు. పిన్నెల్లిని విమర్శించిన సందర్భంలో సభికులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ అరాచకంపై ఆవేదన, కసి ఉంది.. జగన్‌రెడ్డిని ఓడించాలనే ఆవేశం మీలో ఉంది.. ఆ ఆవేశం తిరుగుబాటుగా కనిపిస్తోందని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కుప్పంతో సమానంగా మాచర్లను చూసుకుంటానని హామీ ఇచ్చారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడుకు నీరిస్తానని తెలిపారు. ఆ తర్వాత మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా.. బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలగడానికి ఎంతో సమయం లేదని తెలిపారు. నా ప్రాణం పోయే వరకు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటా. మాట ఇచ్చానంటే ఆరు నూరైనా సమస్య పరిష్కరించడానికే కృషి చేస్తానన్నారు.



ప్రసంగిస్తున్న బ్రహ్మారెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మధుబాబు తదితరులు

మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు : చంద్రబాబు

విధ్వంసకారుడు, దోపిడీదారుడు, సైకో ఏకమైతే జగన్‌రెడ్డి. పల్నాడులో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. పంటలతో పల్నాడు పచ్చగా ఉండాలని నేను తపిస్తే.. జగన్‌రెడ్డి రక్తంతో తడిపేశాడు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలో చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. పోలీసుల్ని అడ్డం పెట్టుకుని హత్యా రాజకీయాలకు, హింసకు తెరలేపాడు. టీడీపీ కార్యాలయాలు తగలబెట్టాడు. ఇళ్లపై దాడులు చేశాడు. రౌడీ రాజకీయాల్ని తుదముట్టిస్తా. మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు. మాచర్లలో తిరుగుబాటు మొదలైంది. విప్లవంగా మారుతోంది. ప్రతి ఘటనకూ రిటర్న్ గిఫ్ట్ ఇస్తా. పల్నాడులో పసుపు జెండా నిలబెట్టడం కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను మరచిపోను. ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య, జల్లయ్య లాంటి కార్యకర్తలకు ఈ వేదికగా నివాళులర్పిస్తున్నా. పీకపై కత్తి పెట్టి జై జగన్ అంటే వదిలేస్తామన్నా ప్రాణాలొదిలిన చంద్రయ్య లాంటి వ్యక్తిని మరచిపోను. ఒక కార్యకర్త పార్టీని ఎంతగా ప్రేమిస్తాడో చంద్రయ్య ఓ ఉదాహరణ. పల్నాడులో 30 మంది కార్యకర్తల్ని వైసీపీ రౌడీలు పొట్టన పెట్టుకున్నా ఏ కార్యకర్తా వెనక్కి తగ్గలేదు.

మిమ్మల్ని నమ్ముకున్నా : బ్రహ్మారెడ్డి

మిమ్మల్ని నమ్ముకొని బరిలోకి వచ్చా.. రెండున్నరేళ్లుగా అధికారపార్టీకి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేశా.. పేదలు కడగండ్లను తీరుస్తానని కంటతడితో చెప్పారు. మాచర్లలో పరిస్థితి ఛంబల్‌లోయలో కన్నా దారుణంగా ఉంది. పెద్దదొర, చిన్న దొరలకు ముగింపు పలకకపోతే మన జీవితాలు వృథా అవుతాయి. పిన్నెల్లి సోదరులు వేలకు వేలు డబ్బులు చెల్లించి ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. జనం నోళ్లుగొట్టి వక్రమార్గంలో సంపాదించిన డబ్బులు ఎంతైనా ఖర్చు పెడతారు. ఓటే ఆయుధంగా భావించి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి. తప్పుడు కేసులు పెట్టారు. కార్లు కాల్చేశారు. బాధితులపైనే కేసులు పెట్టి కుటుంబాలకు దూరం చేసిన గుడుంబా సోదరులకు సోమవారం జరిగే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పి ఇంటికి పంపించాలి.

సూపర్ 6తో సక్సెస్ : శ్రీకృష్ణదేవరాయలు

సూపర్ 6 పథకాలతో మా విజయం పూర్తిస్థాయిలో సక్సెస్ అవుతుంది. మాచర్ల నియోజకవర్గంలో తాగు, సాగునీరు లేదు. మేము గెలిచిన ఏడాదిలోపు వరికపూడిశెల పూర్తి చేసి నీరందిస్తాం. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తాం. సాగర్ కుడి కాల్వను స్థిరీకరించి గోదావరి జలాల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తాం. బ్రహ్మారెడ్డి మాచర్లకి ఒంటరిగా వచ్చారు.. మీ బలంతో గెలిపించాలి

ఓట్ల పండక్కి.. వస్తున్నారు

- రైళ్లు, బస్సు సర్వీసులన్నీ ఇప్పటికే ఫుల్
- ఓటు వేయాలనే పట్టుదలతో ప్రయాణం
- దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు రాక
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి అధిక సంఖ్యలో
- ఓటర్ల కోసం కొందరు అభ్యర్థులు ప్రత్యేకంగా రవాణా ఏర్పాట్లు
- చార్జీలను పెంచిన ట్రావెల్స్.. హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

జాతరలా తరలివస్తోన్న ఓటర్లు



గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కాదు.. దసరా సెలవులు లేవు.. అయినా దూర ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు తరలివస్తోన్నారు. ఓటు వేయాలనే పట్టుదలతో పండుగలకు వస్తోన్నట్లు తరలివస్తోన్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఓట్ల పండుగకు సొంతూళ్లకు తరలివస్తోన్నారు. సొంతూరుకి వచ్చి ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు ఉత్సాహం చూపుతున్నారు. స్వచ్ఛందంగా కొందరు ఓటర్లు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముందస్తు ఏర్పాట్లు చేసుకోని వారు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు. ఈ నెల 11 (రెండో శనివారం), 12 (ఆదివారం), 13 (పోలింగ్ రోజు) వరుస సెలవు దినాలు కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వస్థలాలకు ప్రయాణమయ్యారు. శుక్రవారం వివిధ కారణాలతో రాలేకపోయిన వారు శని, ఆదివారాల్లో స్వస్థలాలకు వచ్చేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉద్యోగులే కాకుండా చికిత్స రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న వారు కూడా ఓటు వేయాలని పట్టుదలతో వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ప్రతి ఓటును గెలుపుకు కీలకంగా భావిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లుగా నమోదై ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని స్వస్థలాలకు రప్పించడానికి వారం రోజుల నుంచి కసరత్తు చేస్తున్నారు. ఫోన్ చేయడం, వారి రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై వివరాలు అడిగి వారు రావడానికి కావాల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చారు. దీంతో ఓటు వేసేందుకు పలువురు ఆసక్తితో స్వస్థలాలకు బయల్దేరారు. సైబరాబాద్‌లో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారిలో వేల మంది ఆ రుణాన్ని తీర్చుకోవాలని భావించి తరలివస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర నగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో జిల్లాకు చెందిన వేల మంది ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే చాలామంది రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ నిత్యం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నా వాటిలో టిక్కెట్లు రిజర్వు అయిపోయాయి. ప్రైవేటు ఆపరేటర్లు టిక్కెట్ చార్జీలను పెంచేశారు. ట్రావెల్స్‌లో హైదరాబాద్ నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేలు, బెంగళూరు నుంచి అయితే టిక్కెట్ ధర రూ 4 వేలు పలుకుతోంది. ఈ రేట్లకు టిక్కెట్ కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి లేదు. హైదరాబాద్ నుంచి ఏసీ స్లీపర్‌లో రూ.2,601 చార్జీగా నిర్ణయించారు. బెంగళూరు ఇతర ప్రాం తాల నుంచి కూడా బస్సుల్లో టిక్కెట్లు బుక్ అయిపోయాయి. ఈ క్రమంలో సొంత ఖర్చులతో వచ్చిన వారికి ఆ మొత్తం తిరిగి చెల్లిస్తామనే హామీని ఇస్తూ ఓటర్లను అభ్యర్థులు స్వగ్రామాల బాట పట్టిస్తున్నారు. టిక్కెట్లు లభించక ఇబ్బందులు పడుతున్న వారి కోసం హైదరాబాద్ నుంచి ఆయా పార్టీల అభ్యర్థులకు చెందిన అనుచరులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కు కనీసం 50 వేల మందికిపైగా ఇతర ప్రాంతాల్లో నివ సిస్తున్న ఓటర్లు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో దాదాపు 35 నుంచి 40 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో ఎక్కువ మంది స్వస్థలాలకు రానున్నట్లు సమాచారం. దీంతో జిల్లా పరిధిలో ఆర్టీసీ శుక్రవారం రాత్రి నుంచి దాదాపు 50 ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నది.

కలసి పనిచేద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

కారంచేడు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు(పర్చూరు), మే 10 : కలసి కట్టుగా పనిచేసి అరాచక విధ్వంస వైసీపీని ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కారంచేడు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి పార్టీ శ్రేణులు, ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు, ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతల్లో ఉత్సాహం నింపేవిధంగా ఎడ్లబండిపై ఏలూరి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ కృషిచేస్తుందన్నారు. 2014, 2019 జరిగిన ఎన్నికల్లో వరుసగా నన్ను ఆదరించారని కారంచేడు వాసులు తనపై చూపిన ఆదరణను ఎన్నటికీ మరువనన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు దిశనిర్దేశం అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే నవ్యాంధ్రగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకోసం ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏలూరి గుర్రంపై ప్రచారం అందరినీ ఆకట్టుకుంది.



కారంచేడులో ఎడ్ల బండిపై ప్రచారం చేస్తున్న ఏలూరి



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఆదరించండి అభివృద్ధి చేస్తా

టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా తనను ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని ఏలూరి కోరారు. కలసి కట్టుగా పనిచేసి కారంచేడు అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. వైసీపీ పాలనలో రైతులు నష్టపోయారన్నారు. కనీసం తాగు నీటిని అందించలేని దుస్థితిలో పాలన సాగిందన్నారు. సాగుకు సక్రమంగా నీరందక వేల ఎకరాల్లో సాగుచేసుకున్న పంటలను రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కొమ్మమూరు కాలువను అభివృద్ధి చేసి సాగుతోపాటు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

సాంబన్న కోసం కదిలొచ్చిన మహిళలు

నాగులపాలెం దత్తపుత్రుడు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి హాట్రిక్ విజయం చేకూరాలంటూ నాగులపాలెం మహిళలు కదిలొచ్చారు. గ్రామం నుంచి భారీ ర్యాలీగా బయలు దేరి బొమ్మల సెంటర్ కూడలి మీదుగా కూటమి పాలన రావాలి.. చీకటి పాలన పోవాలంటూ నినాదాలు చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చారు.

జగన్ పాలనకు మహిళలు చరమగీతం పాడాలి

నారీభేరి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి



నారీభేరి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, మాట్లాడుతున్న ఏలూరి

మార్టూరు : వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళలు అందరూ మహాశక్తులై జగన్ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని, రాష్ట్రం నుంచి జగన్‌ను తరిమి కొట్టాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో నారీ భేరీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో మహిళలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మహిళలనుద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరి మాట్లాడారు. జగన్ పరిపాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వాటిని ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో మైనింగ్, ఇసుక, మద్యం వ్యాపారాలతో రాష్ట్ర ప్రజానీకాన్ని నిలువునా దోచుకున్న జగన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని, ప్రజాభివృద్ధిని విస్మరించారన్నారు. సొంత మద్యం బ్రాండ్లతో వ్యాపారం చేసి సంపాదించిన 13వేల కోట్లతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయ వచ్చని, రాష్ట్రంలో వేలాది గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్ట వచ్చునని అన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని, రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నాలన్నదే అన్న ఎన్టీఆర్ ఆశయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఆశయాలను కొనసాగిస్తూ మహిళలను ఆర్థికంగా బలవంతులను చేసి రాజకీయాల్లో చోటు కల్పించారన్నారు. ఇది అభివృద్ధికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. ప్రజలంతా విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. ఓటు ద్వారా మహిళా శక్తిని నిరూపించాలని ఏలూరి కోరారు. సమావేశంలో టీడీపీ మద్దతుదారుగా ఉన్న తమ కుటుంబాన్ని వైసీపీ వారు ఇబ్బందులకు గురి చేశారని ఇంకొల్లుకు చెందిన అంజలి ఆవేదనను వ్యక్తం చేశారు. అంతేగాకుండా ఇంకొల్లు వార్డు మెంబరు మల్లీశ్వరి, పావులూరుకు చెందిన మరో మహిళ వైసీపీ నాయకులు కక్షగట్టి, ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఇప్పుడు మీకు టైం వచ్చిందని, ఓటుతో వారికి బుద్ధి చెప్పండని ఏలూరి సూచించారు. మహిళలం దరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడారు. నారీ భేరి కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా మహిళలు తరలి వచ్చారు. పలువురు మహిళలు వైసీపీ నాయకుల అవినీతిని, అరాచకాలను సమావేశంలో ఎండగట్టారు.

అడుసుమల్లిలో తెలుగు తమ్ముళ్ల ప్రచారం

అడుసుమల్లి (పర్చూరు), మే 10 : పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో శుక్రవారం తెలుగు తమ్ముళ్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీలతో గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కా ర్యక్రమంలో నాయకులు నాయుడు శ్రీను, వెంకటేశ్వర్లు, సాంబయ్య నాగేశ్వరరావు, రాంబాబు, హరిబాబు, గురుప్రసాద్, కాకుమాను, శ్రీకాంత్, వాసు పాల్గొన్నారు.

హామీలపై మడమ తిప్పిన జగన్‌రెడ్డి

- 9 సార్లు కరెంట్ చార్జీలు పెంచి వాతలు
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి : ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, మే 10 : జగన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణాపురం, వెంకటాపురం, విప్పర్లవారిపాలెంలో గొట్టిపాటి శుక్రవారం రాత్రి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, కరెంట్‌చార్జీల తగ్గింపు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల అమలు, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు, బీసీలకు రాజకీయపరమైన రిజర్వేషన్, జాబ్‌క్యాలెండర్ విడుదల తదితర హామీలు అమలు చేయకుండా మడమ తిప్పారన్నారు. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. నిత్యావసర ధరలు పెరుగుదల, ఆర్టీసీ చార్జీల పెంపుతో అన్ని వర్గాల ప్రజల తీరని భారం పడిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల సమస్య లను పరిష్కరిస్తామన్నారు. ఎస్సీల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేయడం జరుగుతుందన్నారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, జొన్నలగడ్డ గోపి, విజయ్, అంజయ్య, వెంకటేశ్వర్లు, తారకరామిరెడ్డి, అగస్టీన్, మహీంద్ర పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఎన్నికల ప్రచారం

అద్దంకి పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో టీడీపీ నేతలు అందరు కలిసికట్టుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకానిపాలెంలోని మండపం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నేతలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, బోడ్డపాటి రవిబాబు, సందిరెడ్డి రమేష్, మన్నం త్రిమూర్తులు, నాదెండ్ల సుబ్బారావు, ఖగరాజం, సురేష్ పాల్గొన్నారు.

గ్రామాలలో వసతులు కల్పిస్తాం

వైదనలో ఎమ్మెల్యే గొట్టిపాటి ప్రచారం

బల్లికురవ, మే 10 : గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా టీడీపీ అధికారంలోకి రాగానే మౌలిక వసతులు కల్పిస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని వైదన గ్రామంలోని చవిటి మాదిగ పల్లె, వెంకటేశ్వర కాలనీ, జెండా చెట్టు వద్ద ఎమ్మెల్యే గొట్టిపాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నారన్నారు. అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు. నవరత్నాలంటూ పేదలకు పది ఇచ్చి వారి నుంచి రూ.100 లాక్కున్నారన్నారు. కరెంట్, బస్సు చార్జీలు, పన్నులు, నిత్యావసరాల ధరలు, పెట్రోల్, గ్యాస్ ధరలు ఇలా ప్రతీదాన్నీ పెంచి పేద బకుతులతో ఆటలాడుకున్నారన్నారు. కనీసం కూలి పనులు కూడా లేక పొట్టచేతపట్టుకొని



వైదన ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్



బలరామకృష్ణాపురంలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న గొట్టిపాటి

ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్లిన దౌర్భాగ్యస్థితిలోకి ఆంధ్రాను నెట్టేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో గ్రామాలలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, కాలువలు, చెత్త సంపద తయారీ కేంద్రాలు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేశామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తున్నారని గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తారని తెలిపారు. తొలి సంతకం డీఎస్సీపైనే పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఇక రైతులు భయపడకుండా పంటలు సాగు చేసుకునేలా ప్రణాళిక రూపొందించారన్నారు. ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయాన్ని అందజేస్తామన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంపుద్వారా వృద్ధులకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. పథకాల్లో మహిళలు, బాలికలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, పోగుల చంద్రశేఖర్, మేడా ప్రసాద్, మూరగొండి కోటేశ్వరరావు, షేక్ గోపీ, గాలం నిమ్మయ్య, పావులూరి రామాంజి, ముత్యాల వీరాంజి, ఏలూరి శ్రీనివాసరావు, శేషారావు, బొమ్మిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పంచాయతీ వార్డు మెంబర్లు

మండలంలోని వైదన గ్రామంలో పంచాయతీ వార్డు మెంబర్లు శెట్టి వెంకట నారాయణ, పసుపులేటి రామారావు శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలానే దేవాలయ మాజీ చైర్మన్ గంప అంజయ్య, రాళ్ల రామారావు, నాగిపోగు ఇర్మియ సైకిలెక్కారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూటమితోనే ఎస్సీ, ఎస్టీలకు మేలు : గొట్టిపాటి

పంగులూరు, మే 10 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీలకు మేలు కలుగుతుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 13వ తేదీ సోమవారం జరిగే ఎన్నికలో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ గొట్టిపాటి ముప్పవరం ఎస్టీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి ఐదేళ్లుగా వారి సంక్షేమాన్ని విస్మరించారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగ్జీవన్‌జ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితమని చెప్పిన జగన్‌రెడ్డి దానిని అమలు చేయకుండా 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి వర్గాలకు షాక్ కొట్టించారన్నారు. చంద్రబాబు పాలనలో దళితులకు ఉన్న 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం పేరును జగన్ పేరుగా మార్చి, ఆ పథకాన్ని అమలు చేయలేదన్నారు. దీంతో దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. జగన్‌రెడ్డి అరాచక, విధ్వంస, చేతగాని పాలనను చూసిన ప్రజలు టీడీపీ కూటమికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, బ్ర హ్మానందస్వామి, వరపర్ల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శ్రేణులు పాల్గొన్నారు.



అనంతవరం ఉప సర్పంచ్ షేక్ శ్రీనుకు కండువావేసి ఆహ్వానిస్తున్న ఏలూరి

అనంతవరంలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్.. ఇద్దరూ తల్లీకొడుకులు
- మాజీ మంత్రి బాలినేనికి శ్రీను సన్నిహితుడు

యద్దనపూడి, (మార్టూరు) మే 10: వైసీపీ పార్టీ మద్దతుదారులైన అ మ్మ సర్పంచ్... కుమారుడు ఉప సర్పంచ్ .. అయితే గ్రామంలో ఉప సర్పంచ్ షేక్ శ్రీను అ మ్మ తో కలిసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి కోలుకోని షాక్ తగిలింది. అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి బలమైన నాయకునిగా ఉన్న ప్రస్తుత ఉప సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ షేక్ శ్రీను అమ్మ గ్రామ సర్పంచ్ షేక్ మస్తాన్‌బీతో కలిసి అతని వర్గీయులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారికి కండువాలు వేసి ఏలూరి స్వాగతం పలికారు. అతనితో పాటు అతని వర్గీయులు కూడా పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఏలూరి కోరారు. అయితే ఇంకో విశేషం ఏమిటంటే పార్టీలో చేరిన షేక్ శ్రీను వైసీపీ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అతని చేరికతో యద్దనపూడి మండలంలో ముఖ్యంగా అనంతవరం గ్రామంలో టీడీపీకి బలం పెరిగినట్లయిందని శ్రేణులు భావిస్తున్నారు. అయితే శ్రీను టీడీపీలో చేరికపై వైసీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధి టీడీపీతోనే

చినగంజాం, మే 10 : ఆర్యవైశ్యులకు అండగా ఉండి, అభివృద్ధికి పాటు పడిందని టీడీపీ అని టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు టీడీపీ కూటమి అభ్యర్థులు ఏలూరిని, కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ వాణిజ్య విభాగం నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబాల వారిని కలిసి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ, బ్యాలెట్ నమూనా చూపిస్తూ నాయకులు ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహనరావు, టీడీపీ వాణిజ్య విభాగం చినగంజాం, ఇడుపులపాడు కమిటీ సభ్యులు కోట శివరామకృష్ణ, శ్రీకాంత్, వినోద్, బయ్యా సతీష్, శనగపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తీర గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ

- ప్రత్యేక చర్యలతో అడుగులు వేస్తాం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య



పొట్టిసుబ్బయ్యపాలెంలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 10 : మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్య పాలెం, తానాకాలనీ, జబ్బార్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం కొండయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుడిగాలి పర్యటన చేశారు. ఆయా సందర్భాల్లో గ్రామస్థులతో మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్న తీరప్రాంత గ్రామాలను అభివృద్ధిలో అగ్రపధాన నిలుపుతామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో ఎల్లొన్న ఆయా గ్రామాల్లో సమస్యలను క్షుణ్ణంగా విన్నారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, కాలనీ వాసుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగాఆయా గ్రామాల ప్రజలు కలహాలు వీడి అందరూ ఏక తాటిపైకి వచ్చి గ్రామాల అభివృద్ధికి కలసి ప్రయాణం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రాజకీయాల పేరుతో గ్రామస్థులను చీల్చి తమ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నవారి కపట నాటకాలను నమ్మవద్దన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సైకిల్‌కు ఓటేసేందుకు సైన్యంలా కదలండి

కొండయ్య కుమార్తె పిలుపు



ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య కుమార్తె శివనారాయణదేవి

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేయండి. అందుకు సైన్యంలా కదలండని టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య కుమార్తె శివనారాయణ దేవి పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో శుక్రవాం రాత్రి ఆమె కూటమి శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా తన తండ్రి ఎం.ఎం కొండయ్యకు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కూటమి మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ప్రత్యేక రక్షణ కల్పనకు మార్గం సుగమం అవుతుందన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గెలిచేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు అందరి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని ఆమె చెప్పారు. ఇంటింటికి తిరుగుతూ మ్యానిఫెస్టో, బీసీ డిక్లరేషన్, సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మార్టూరు, మే 10: మార్టూరు గ్రామ పంచాయతీలోని 27 మంది పారిశుధ్య కార్మికులకు రోటరీ క్లబ్ వారు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులకు దుస్తులను అందచేశారు. ఏటా పారిశుధ్య కార్మిలకు రోటరీ సాయమందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫర్ట్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, జా ష్టి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, షేక్ ఖాజా హుస్సేన్, మా దాల సాంబశివరావు, కొర్రపాటి వేణు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

17న బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

అద్దంకిటౌన్, మే 10 : అద్దంకి రేణంగివరం రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 17వ తేదీన జరుగుతుందని కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరాధన మహోత్సవ ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి ఏలూరి వీరబ్రహ్మాచారి, చెన్నుపల్లి శ్రీనివాసచారి, కందెపి సుబ్బారావు, జె.శ్రీనివాసరావు, ఆంజనేయరాజు, రవికుమార్, శ్రీశైలం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో ఓటర్లకు చీరల పంపిణీ

బల్లికురవ, మే 10 : మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలో గురువారం రాత్రి అధికార వైసీపీ గ్రామ నేతలు ఇంటింటికీ తిరిగి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ఓటర్లను ఎలాగైనా తమ వైపునకు తిప్పుకునేందుకు వైసీపీ నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించి గ్రామంలో చీరలు అందించడం పెద్ద చర్చనీయంశంగా మారింది. కొందరు ఓ టర్లు మాత్రం తమకు చీరలు వద్దని అంటున్నా వైసీపీ నేతలు మాత్రం గృహాల వద్దే పడవేసి వెళ్లారు. వైసీపీలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధి ఈ చీరల పంపిణీ చేసిన్నట్లు సమాచారం. గ్రామాలలో ఎన్నికల నిఘా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లే వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా ప్రలోభాలకు పాల్ప డుతున్నారని ప్రజలు అంటున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నప్పటికీ, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసుల నిఘా ఉందని చెప్పినప్పటికీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో వైసీపీ శ్రేణులు తగ్గడం లేదు. ఇదిలావుండగా కొందరు ఓటర్లు చీరలు తీసుకున్నా ఓటు మాత్రం టీడీపీకి వేస్తామని చెప్పుకుంటున్నారు. వైసీపీ నేతలు తాయిళాల జోరుపై చర్చ సాగుతోంది. చీరల పంపిణీపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు.



డేగరమూడి గ్రామం

సచివాలయం కోసం పరుగు..!

- ఉన్న ఊర్లో లేని కార్యాలయాలు
- ఏ అవసరానికైనా సుదూరంలో ఉన్న వేరే ఊళ్లే వెళ్లాల్సిందే
- మూడు గ్రామాల ప్రజల అవస్థలు

మార్టూరు, మే 10 : చిన్న పని కోసం సచివాలయానికి వెళ్లాలంటే పక్క ఊరికి పరుగు పెట్టాల్సిందే. దూరమైనా..భారమైనా పక్క ఊరులో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సిందే. మార్టూరు మండలంలో మూడు గ్రామాలైన డేగరమూడి, లక్కవరం, తాటి వారిపాలెం గ్రామస్థుల అవస్థలు ఇవి. వారి గ్రామాలలో నేటికీ సచివాలయాలను ఏర్పాటు చేయలేదు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో రెండు వేలు జనాభా ఉన్న గ్రామాలకు సచివాలయం ఏర్పాటు చేశారు. మేజరు పంచాయతీ గ్రామాలలో రెండు వేలు జనాభా పరిధిలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు తర్వాత గ్రామ పంచాయతీలకు, రెవెన్యూ కార్యాలయాల వద్ద పనుల కోసం వచ్చే ప్రజలు బాగా తగ్గిపోయారు. ఏ అవసరమైనా సచివాలయాలకు వెళ్లాల్సిందే. అంతటి ప్రాధాన్యత ఏర్పాటు చేసిన సచివాలయం గ్రామంలో లేకపోవడం దానికోసం పక్క ఊరిలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సి రావడంతో మూడు గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డేగరమూడివాసులు రాజుపాలెంకు..

డేగరమూడి గ్రామస్థులు రాజుపాలెంలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సిందే. డేగరమూడి గ్రామంలో వెయ్యి మందికి పైగా ప్రజలు ఉన్నారు. సచివాలయం ఏర్పాటు చేయలేదు. దాంతో వారందరూ రాజుపాలెం సచి వాలయాని వెళతారు. డేగరమూడి వాసులు సచివాలయం కోసం సుమారు ఐదు కిమీ దూరంలో ఉన్న రాజుపాలెం గ్రామానికి వెళ్లాల్సిందే. అయితే వారికి దూరభారం కావడమే కాకుండా ఈ రెండు గ్రామాల మధ్య 16వ నంబరు జాతీయ రహదారి అడ్డుగా ఉంది. ఈ రహదారిని దాటడానికి రహదారి నిర్మాణం జరిగే సమయంలో అండర్ పాస్ కూడా ఏర్పాటు చేయలేదు. దాంతో డేగరమూడి వాసులు రెండు కిమీ దూరంలో ఉన్న మార్టూరు గ్రామానికి వచ్చి అక్కడ పెద్ద అండరు పాస్‌ను దాటి మరలా రెండు కిమీ ప్రయాణించి రాజుపాలెం రోడ్డు వద్దకు వస్తే మరలా అక్కడ నుంచి కిలో మీటర్లకు పైగా ప్రయాణం చేస్తేనే చేరతారు. ఐదు కిలో మీటర్లు, అర్ధగంట ప్రయాణించాల్సిందే. మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణం. వారితో ఎవరో ఒకరు తోడు ఉండాల్సిందే.



రాజుపాలెం గ్రామాల మధ్య అండర్ పాస్ లేని జాతీయ రహదారి

లక్కవరం గ్రామస్థులు కోలలపూడి వెళ్లాల్సిందే

లక్కవరం పంచాయతీలోని గ్రామస్థులు సుమారు 7కిమీ పైగా ప్రయాణించి, జాతీయ రహదారిని దాటి కోలలపూడి గ్రామ సచివాలయానికి వెళ్లాలి. ఇక్కడి జనాభా వెయ్యి లోపు ఉంటారు. దీంతో ఇక్కడ సచివాలయం లేదు. వారు కోలలపూడి సచివాలయానికి రావాలంటే తప్పని సరిగా ద్విచక్రవాహనం మీదే రావాలి. ముప్పావుగంట ప్రయాణించాలి. మహిళలు, వృద్ధుల బాధలు చెప్పనలవి కాదు. తమ గ్రామానికి రవాణా పరంగా సౌకర్యంగా ఉండే 3 కి.మీ. దూరంలో ఉన్న వలపర్ల సచివాలయంలో తమకు అవకాశం కల్పించాలని గ్రామస్థులు ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా తమ గోడును పట్టించుకోలేదని గ్రామస్థులు చెప్తున్నారు.

తాటివారిపాలెం ప్రజలు బొల్లాపల్లికి వెళ్లాల్సిందే

తాటివారిపాలెం పంచాయతీ ప్రజలు బొల్లాపల్లి సచివాలయానికి పరుగు పెట్టాల్సిందే. దాదాపు 1500 మంది జనాభా ఉన్న ఈ గ్రామస్థులు అక్కడకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని, ముఖ్యంగా మహిళలు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామంలోనే సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఐదు కిలోమీటర్లు ఎలా వెళ్లాలి



ఈ వయస్సులో అంతదూరం ఎలా వెళ్లగలను. నేను ఒక్కదాన్ని వెళ్లలేను. నాతో ఒకరు వెంట రావాలి. వేలి ముద్ర వేసేందుకైనా నన్ను తీసుకెళ్లాల్సిందే. నాకు బదులు ఎవరు వెళ్లినా కుదరదని చెప్తున్నారు. దీంతో వ్యయప్రయాసలు పడి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్తున్నాను. మా ఊరిలో సచివాలయం ఏర్పాటు చేస్తే మంచిది.

- ముంద్రు కోటమ్మ, వృద్ధురాలు, డేగరమూడి

ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు



ప్రతి చిన్న పనికీ పక్క గ్రామ సచివాలయానికి వెళ్లడం చాలా మందికి ఇబ్బందిగా మారింది. వృద్ధుల విషయానికొస్తే వారితోపాటు ఒకరు తోడుగా వెళ్లాల్సిందే. మా ఊరిలో ఉంటే ఎవరి సాయం లేకపోయినా వెళ్లగలం. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి.



ప్రజా కూటమి అభ్యర్థులను గెలిపించాలని నినాదాలు చేస్తున్న మాదిగాని

విషపు రాతలతో చంద్రబాబుపై దుష్ప్రచారం

● సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని

పర్చూరు, మే 10: విజన్ ఉన్న చంద్రబాబుపై విషపు రాతలతో దుష్ప్రచారం చేస్తున్నారని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ అధికార ప్రతినిధి మాదిగాని గురునాథం అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పర్చూరు వచ్చారు. అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాల మాటున జగన్ వేలకోట్లు దోచుకున్నారన్నారు. అందుకు నిదర్శనం పథకాలకు రూ.4లక్షల కోట్లు పంపిణీ చేస్తే మిగిలిన రూ.8లక్షల కోట్లు ఏమయ్యాయన్నారు. కూటమిదే విజయమని, చంద్రబాబును సీఎంగా చూడాలని ప్రజలు ఆకాంక్షతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని గురునాథం విజ్ఞప్తి చేశారు. ఆయనతోపాటు మాదిగాని తరుణ్, అంబేద్కర్ యువజన నాయకులు నలిగిల కిషోర్, ఎస్సీసెల్ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇడ్ల శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసరావు, రాచూరి కుమార్ పాల్గొన్నారు.



బల్లికురవ మండలంలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

● పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

బల్లికురవ, మే 10 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పీ విఠలేశ్వర్ తెలిపారు. శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం బల్లికురవ పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రానున్న రెండు రోజులు గ్రామాలలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అరాచకాలు వర్సెస్ సమర్థ నాయకత్వం

సొంతపార్టీ వారితో సహా అన్ని వర్గాలపై దాడులు

చివరికి ఓట్ల తొలగింపు

ఎత్తుగడతో అభాసుపాలు

ఫలించని ఎత్తుగడలు

టీడీపీలోకి భారీ వలసలు

5వేల మంది కార్యకర్తలు , 250 మంది ముఖ్య నాయకులు టీడీపీలో చేరిక

వైసీపీకి బలమైన చినగంజాం మండలంలో ఆపార్టీ ఖాళీ

కూటమి అభ్యర్థి ఏలూరి విజయం నల్లేరుపై నడకే

పూర్తిగా గ్రామీణ ప్రాంతంతో నిండిఉండే పశ్చిమ నియోజకవర్గంలో గత నాలుగున్నరేళ్లుగా అధికార వైసీపీ సాగించిన అకృత్యాలు, అరాచకాలు ఆపార్టీకి శాపంగా మారాయి. అదే అభివృద్ధి, సమర్థవంతమైన నాయకత్వంతో ముందడుగు వేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకి వరమైంది. అందుకు నియోజకవర్గంలో వేలాది మంది వైసీపీ కార్యకర్తలు, వందలాది మంది ముఖ్య నాయకులు, వారికి తోడు అయా వర్గాల ప్రముఖులు, తటస్థవాదులు పోలోమని టీడీపీలో చేరడం దర్పణంపడుతోంది. దీంతో పోలింగ్ తేదీ దగ్గరపడే లోపే టీడీపీ కూటమి అభ్యర్థిన ఎమ్మెల్యే ఏలూరి విజయానికి పూర్తి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం జరుగుతున్నా మరోవైపు గ్రామసీమల నుంచి వందలాది మంది తరలొచ్చి టీడీపీ కండువాలు వేసుకోవడం నిత్యకృత్యమైంది. పోలింగ్ సమయం ఆసన్నమయ్యే కొద్దీ మారిపోతున్న ఎన్నికల వాతావరణంతో పర్చూరు నియోజకవర్గ రాజకీయం ఆసక్తిదాయకంగా మారుతోంది.

ఒంగోలు మే, 10 (ఆంధ్రజ్యోతి) :ఆరంభం నుంచి పర్చూరు నియోజకవర్గం రాజకీయంగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. పూర్వంనుంచి పార్టీ బలబలాలకు తోడు నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకత్వానికి ప్రజలు అండదండలు ఇస్తున్నారు. కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణం బలంగా ఉన్న సమర్థ వంతమైన నాయకత్వానికి అనుగుణంగా ప్రజల మద్దతు లభించిన దాఖలాలు ఉన్నాయి. గెలుపోటములకు అతీతంగా కాంగ్రెస్ పక్షాన గాదె వెంకటరెడ్డి నాయకత్వ పోరాట పటిమతో నియోజకవర్గంలో ముందుకు సాగారు. తెలుగుదేశం అవిర్భావం తరువాత ఆపార్టీ అనుకూల వాతావరణంతో పాటు దగ్గుపాటి వెంకటేశ్వరరావు అందించిన నాయకత్వంతో పార్టీకి విజయావాకాశాలు లభించాయి. 1994లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ గాలివీచినా స్థానిక నాయకత్వ బలంతో గాదె వెంకటరెడ్డి గెలుపొంది సంచలనం సృష్టించారు. 1999లో తటస్థవాదులను ప్రోత్సహించిన చంద్రబాబు వ్యూహం ఫలించింది. అయితే 2004 ఎన్నికల నాటికి దగ్గుబాటి దంపతులు కాంగ్రెస్‌లో చేరడం టీడీపీలో నాయకత్వలేమి ఎదురుకావడంతో వరసగా రెండు పర్యాయాలు కాంగ్రెస్ పక్షాన దగ్గుపాటి గెలుపొందారు.

ఏలూరి రాక

ఈదశలో తెలుగుదేశం ప్రముఖుడైన ఏలూరి సాంబశివరావుని రంగంలోకి తీసుకొచ్చింది. ఆరంభం నుంచి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగిన ఏలూరి నాయకత్వంలో టీడీపీ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. 2014 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఆసమయంలో ఏలూరి సాధించిన అభివృద్ధి, అమలుజేసిన సంక్షేమ కార్యక్రమాలు, పెంచుకున్న ప్రజాసంబంధాలు నియోజకవర్గంలో ఆయన పట్టును పెంచాయి. దీంతో గత ఎన్నికల్లో వైసీపీ నియోజకవర్గంలో పట్టున్న డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుని రంగంలోకి దింపింది. అయినా బలమైన ప్రజాసంబంధాలతో సమర్థవంతమైన నాయకత్వంతో ముందడుగు వేసిన ఏలూరి జగన్ ప్రభంజనంలో కూడా డాక్టర్ దగ్గుబాటిపై విజయం సాధించి సరికొత్త సంచలనాన్ని సృష్టించారు.

వైసీపీ ప్రభుత్వ బరితెగింపు

ఈదశలో ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకించి జగన్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. పాలనలో జగన్ విధానాలు నచ్చక ఆపార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దగ్గుబాటి వైసీపీని వీడారు. దీంతో కొత్త నాయకుడును నియమించి పట్టుపెంచుకునేందుకు విఫలప్రయత్నం చేసింది. గత ఎన్నికలలో బహిర్గంగా వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిన రామనాథం బాబును తిరిగి పార్టీలోకి చేర్చుకొని పార్టీపగ్గాలు అప్పజెప్పారు. అప్పుడే వైసీపీలో గ్రూపు విభేదాలు పొడచూపాయి. తరువాత చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియోజకవర్గంలోకి దిగుమతి చేశారు. అప్పటికే నియోజకవర్గంలో అధికారపార్టీ సాగిస్తున్న అరాచకాలు ఆమంచి వచ్చాక మరింత పెరిగాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆమంచి నాయకత్వంపై ఉన్న నమ్మకంతో జగన్ అతనిని బాగా ప్రోత్సహించారు. పార్టీ శ్రేణులలో బలమైన వర్గం వారికి అండగా ఉండే ఆపార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బాలినేని సూచనలను జగన్ పక్కనబెట్టారు. సీఎం జగన్ ప్రోత్సహంతో ఆమంచి సారథ్యంలోని వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. అన్ని రకాల అవినీతి వ్యవహారాలతో పాటు అరాచకాలకు తెరలేపారు. తెలుగుదేశం పార్టీలో ఉండే గ్రానైట్ వ్యాపారులను, ఎరువుల వ్యాపారులను రైతులకు అండగా ఉండే సమ్మర్ స్టోరేజీ నిర్వాహకులను నానా ఇబ్బందులకు గురిచేశారు. ఈరంగాల వారిపై అక్రమ కేసుల తోడు సాధారణ ప్రజలను వేధింపులకు గురిచేశారు. వైసీపీ నేతల దాడులు, అక్రమ కేసులు నియోజకవర్గంలోని 80 శాతం గ్రామాలలో జరిగాయంటే ఆశయోక్తి లేదు. చివరికి దొంగ ఓట్ల పేరుతో టీడీపీ ఓట్లను, వైసీపీ నాయకుల చర్యలను వ్యతిరేకిస్తున్న ఆపార్టీలోని అసంతృప్తి వాదల ఓట్లు తొలగించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. ఈ చర్యలన్నింటిని ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహించడంతో వైసీపీ అకృత్యాలు మితిమీరాయి. వైసీపీలో ఉండి ఈ అకృత్యాల వ్యవహారాలను వ్యతిరేకించిన సొంతపార్టీ వారిపై దాడులు, వారిని నాయకత్వాన్ని అణగదొక్కే చర్యలకు చివరికి వారిని పార్టీ నుంచి బహిష్కరించే చర్యలను కొనసాగించారు.

ఎదురొడ్డి నిలిచిన ఏలూరి

ఈదశలో ప్రజలకు అండగా నిలవడంలో టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి పోరాట పటిమను ప్రదర్శించారు. ఆయనను లొంగదీసుకునేందుకు ఆయన వ్యాపారసంస్థలలో దాడులు చేశారు. వాటిని మూయించే ప్రయత్నం చేశారు. ఆర్థికంగా దెబ్బతిన్న సంస్థలను కాపాడుకునే విషమంలో చట్టబద్ధంగా ఏలూరి సఫలీకృతులయ్యారు. అయా సందర్భాలలో వైసీపీ అకృత్యాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిన ఏలూరిపై 7 కేసులు నమోదు చేశారు. కోర్టులు, కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి ఏలూరి ధర్మపోరాటం చేసి నిలబడ్డారు. ఎన్నికల సమయానికి ఏలూరిని కటకటాల వెనక్కి పంపాలనుకున్న వైసీపీ పెద్దల ప్రయత్నం విఫలమైంది. ఇన్ని సమస్యల మధ్య కూడా ఏలూరి ప్రజాసంబంధాలను కొనసాగించడంలో వెనకడుగు వేయలేదు. అంతేకాక తండ్రి పేరుతో నెలకొల్పిన ట్రస్ట్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగించడం కలిసొచ్చింది. ఇటువైపు ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏలూరి ప్రారంభించి పూర్తిగాని అభివృద్ధి పనులను మూలనపడేశారు. తదనుగుణంగా ఏలూరి నాయకత్వం పట్ల ఆయన సేవా కార్యక్రమాల పట్ల ప్రజలలో సానుకూల వాతావరణం నెలకొంది.

కొత్త అభ్యర్థి ఎంపికలోనూ వైసీపీ వైఫల్యం

నియోజకవర్గంలో నెలకొన్న వాతావరణాన్ని పసిగట్టి ఎన్నికలలో పోటీకి మరో బలమైన అభ్యర్థిని రంగంలోకి తెచ్చేందుకు వైసీపీ విఫలప్రయత్నం చేసింది, పరిస్థితిలను గమనించిన ఆమంచి కృష్ణమోహన్ పర్చూరుకి గుడ్‌బై చెప్పి తన సొంత నియోజకవర్గమైన చీరాలపై దృష్టిసారించారు. దీంతో వైసీపీ అధిష్ఠానం ఆర్థికంగా సంపన్నుడైన బలమైన నాయకుడిని రంగంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రమంతా జల్లెడపట్టి గాలించింది. నియోజకవర్గంలో పరిస్థితిని గమనించి కాబోలు అనేక మంది ఇలా ముందుకొచ్చి అలా వెనక్కి వెళ్లిపోయారు. చివరికి గత ఎన్నికలలో వైసీపీకి గుడ్ బై చెప్పి అమెరికాలో ఉన్న స్థానికేతరుడైన యాడం బాలాజీని వైసీపీ రంగంలోకి తెచ్చింది.

భారీగా వలసలు

ఈపరిస్థితులలో ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో వైసీపీ శ్రేణులతోపాటు అన్ని వర్గాల ప్రజలలో స్థానిక రాజకీయ పరిస్థితులపై విస్తృతమైన సమీక్ష జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు, అవినీతి వ్యవహారాలు నాయకత్వ లేమిని ప్రజలు గుర్తించారు. ఇటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటం స్థానికంగా ప్రజా మన్ననలు పొంది సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి వైపు ప్రజల దృష్టి మళ్లింది. అందుకు గత రెండు నెలల నుంచి ఏలూరి సమక్షంలో టీడీపీ కూటమిలోకి భారీగా వలసలు జరగడం నిదర్శనంగా చెబుతున్నారు. ఇప్పటికి నికరంగా 5వేలమంది వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు, తటస్థవాదులు, టీడీపీలో చేరారు. అలాగే వైసీపీకి చెందిన మండల, గ్రామ స్థాయిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు 250 మందికి పైగా టీడీపీ కండువాలు వేసుకున్నారు. ఇంకా గ్రామ స్థాయి గ్రూపులను దృష్టిలో ఉంచుకొని అనేకమంది పరోక్షంగా ఏలూరికి మద్దతు పలుకుతున్నారు. వైసీపీకి నియోజకవర్గంలో అధిక్యతను ఇచ్చే మండలమైన చినగంజాం మండలంలో మండల, గ్రామ, వార్డు స్థాయిలోని వైసీపీ నాయకులలో 80 శాతం టీడీపీలో చేరిపోయారు. మరి కొంతమంది రాజకీయంగా సైలెంట్ అయ్యారు. ఇంకో వైపు రాజకీయాలను అతీతంగా అయా వర్గాల ప్రముఖులు, తటస్థవాదులు ఏలూరికి మద్దతు ఇస్తున్నారు. ఉద్యోగులు ముఖ్యంగా టీచర్లయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా టచ్‌లోకి వచ్చి మద్దతును ప్రకటించారు. దేశవిదేశాలలో ఉన్న విద్యావేత్తలు వివిధ రంగాలలో స్థిరపడిన వారు నియోజకవర్గానికి చేరి ఏలూరి తరుపున ప్రచారం చేస్తున్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సక్షమంలో టీడీపీలో చేరిన కొత్తపాలెం ఎంపీటీసీ, వైసీపీ నాయకులు

పూర్తిగా సానుకూల వాతావరణం

ఈ నేపథ్యంలో తాజా రాజకీయ పరిస్థితిలను అంచనా వేస్తే టీడీపీకి అనుకూల వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. జనసేన కలయిక కూడా కలిసొచ్చింది. నియోజకవర్గంలో 2.5 లక్షల ఓటర్లు ఉన్నారు. అందులో ప్రధానమైన కమ్మ సామాజికవర్గ ఓటర్లు 55 వేలమంది ఉన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వారు 53 వేల మంది ఉండగా అందులో మాదిగ సామాజిక వర్గం 20 వేలకి పైగా ఉన్నారు. కాపు సామాజికవర్గం 21 వేలు ఉండగా, రెడ్డి సామాజిక వర్గం ఓటర్లు 18 వేలు ఉన్నారు. బీసీలలో యాదవ సామాజిక వర్గం ఓటర్లు 10 వేలు ఉండగా రజకులు, పల్లెకార్లు ఇతరు బీసీలు 12 వేలు మంది ఉన్నారు. ఆరంభం నుంచి దళిత, బడుగు వర్గాల ప్రజల సంక్షేమ, సేవా కార్యక్రమాలకు వారి వాడల్లో మౌలిక వసతులకు ఏలూరి ప్రాధాన్యతను ఇచ్చారు. ముస్లిం మైనారిటీలలో వ్యక్తిగతంగా బలమైన సంబంధాలను ఏర్పాటు చేస్తుకున్నారు. వీటికి తోడు మారిన పరిస్థితులలో చినగంజాం మండలంలో వైసీపీ అధిక్యత తగ్గి టీడీపీకి మెజారిటీ వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. యద్దనపూడి, కారంచేడు మండలాలలో టీడీపీ అధిక్యత రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మార్టూరు మండలంలో వైసీపీకి 500 ఓట్ల అధిక్యత రాగా ఈసారి స్పష్టమైన అధిక్యత దిశగా టీడీపీ పయనిస్తోంది. ఇంకొల్లు మండలంలో పలువురు వైసీపీ నాయకులు కాడి కింద పడేయ్యగా, తటస్థవాదులు, వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. దీంతో నియోజకవర్గంలో ఏలూరి గెలుపు నల్లేరుపై నడకలాగే కాబోతుందన్న వాతావరణం నెలకొనడం విశేషం.

చినగంజాంలో వైసీపీ ఖాళీ

ఊళ్లకు ఊళ్లు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిక

చినగంజాం, మే 10 : మండలంలోని తీర ప్రాంతంలో వైసీపీ ఖాళీ అయింది. తీరప్రాంతంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. మార్టూరు మండలం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం, మున్నంవారిపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. అధికారంలో ఉన్న వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో తీరప్రాంతంలో పసుపు జెండా మయమైంది. తీరప్రాంతంలో ఒకరిద్దరు మినహా ప్రజాప్రతినిధులంతా సైకిలెక్కారు. దీంతో వైసీపీకి ఏజెంట్లుగా ఉండే పరిస్థితి కూడా కనిపించడం లేదు ప్రధానంగా ఎమ్మెల్యే ఏలూరి రాజకీయ చాణిక్యం మండలంలో సక్సెస్ అయిందనే చెప్పాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించి మండల ప్రజల మదిలో ఏలూరి చెరగని ముద్ర వేసుకున్నారు. మండలంలో బలమైన రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలంతా ఏలూరి వెంట నడిచేందుకు కదలి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి వెంట నడిచేందుకు కదిలి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇప్పటికే ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ మాజీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. తీరప్రాంతంలో వైసీపీ నేతలంతా ఏలూరి వెంట నడిచేందుకు టీడీపీలో చేరడంతో వైసీపీ కింది స్థాయి కేడర్ అంతా ఏలూరికి జై కొట్టారు. దీంతో ఆ పార్టీలో నేతలు ఎవరూ లేకపోవడం, ఏలూరి చేసిన అభివృద్ధికి ఫిదా కావడం గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు నిలిపివేయడం ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో ఆదుకునే నాయకుడు లేకపోవడం ప్రభుత్వం నుంచి ఆసరా అందకపోవడం వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మండలంలో ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు అంతా సైకిల్ ఎక్కడంతో వైసీపీ పార్టీ ఖాళీ అయింది. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు వైసీపీకి పోలింగ్ బూత్ ఏజంట్లు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

బూత్‌లో ఏజంట్లుగా కూర్చునేందుకు నాయకులు ఎవరూ లేకపోవడం వారిలో కలవరం మొదలైంది. మండలం మొత్తం వన్ సైడ్ కావడం ఇప్పటి వరకు అధిపత్యం చలాయించిన నేతలంతా ఏలూరి వెంట రావడం బూతుల్లో పోలింగ్ రోజు ఎవరిని ఉంచాలనే కలవరంలో నేతలు ఉన్నారు. పర్చూరు నియోజకవర్గ చరిత్రలో స్వాతంత్ర 70ఏళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకొని మండల ప్రజల దశాబ్దాల కల ఎన్టీఆర్ వారిధిని నిర్మించి ప్రజల ముదిలో చెరగని ముద్ర వేశారు. తీర ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆగం ట్యాంకును ఏర్పాటు చేసి సురక్షిత మంచినీటిని ఇంటింటికీ అందించేలా చర్యలు చేపట్టారు. మండలంలోని కొత్తపాలెం ఎంపీటీసీ సభ్యుడు మరపాల రాంబాబురెడ్డి, వార్డు మెంబర్లు మరపాల ఆదిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కర్రి ధనరాజ్, కోట మురళి, మారుబోయిన అనిల్, ఏడుకొండలురెడ్డితో పాటు 15 కుటుంబాల వారు, పల్లెపాలెం గ్రామ పంచాయతీలో కర్రి పాలసుందరావు, రేవు బాబుతో పాటు 6 కుటుంబాల వారు దండుప్రోలు నాగరాజు, శివయ్య, రాములు, బాపయ్యనగర్‌లో సంఖ్యా నాగార్జునతో పాటు 10 కుటు ంబాలు, రాజుబంగారుపాలెం గ్రామంలో ఆట్ల అంకిరెడ్డి, అట్లచిన్న లక్ష్మారెడ్డిలతో పాటు 16 కుటుంబాల వారు, మున్నం వారిపాలెంలో ఎంపీటీసీ సభ్యులు మున్నం భూలక్ష్మీ భర్త నాగాంజనేయులు రెడ్డితో పాటు 19 కు టుంబాల వారు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరగా, వారికి కండువాలు వేసి ఏలూరి ఆహ్వానించారు.



కవాతు నిర్వహిస్తున్న ట్రైనీ ఎస్పీలు , సీఐ శేషగిరిరావు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చీరాలటౌన్, మే 10 : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహరించాలని ముగ్గురు ట్రైనీ ఎస్పీలు పిలుపునిచ్చారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. అంబేద్కర్ భవన్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల్లో జరిగింది. అధికారులు మాట్లాడుతూ ఎన్నికలు దేశ అభివృద్ధికి సంబంధించినదని చెప్పారు. ఈ క్రమంలో ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కును వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వారు స్మగ్లర్లు.. మా వారు సౌమ్యులు

చెవిరెడ్డి, బాలినేనిని నుద్దేశించి చంద్రబాబు

ఒంగోలు ప్రజాగళం సభలో నిప్పులు చెరిగిన టీడీపీ అధినేత

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒకరు ఎర్రమట్టి స్మగ్లరైతే మరొకరు ఎర్రచందనం స్మగ్లర్. జగ్గుభాయ్ జగన్‌కు కావాల్సింది వీళ్లేనంటూ అసెంబ్లీ, లోక్‌సభ నుంచి వైసీపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిప్పులు చెరిగారు. ఒంగోలులో రాజకీయ రౌడీలను మట్టి కరిపిస్తానంటూ శపథం చేశారు. అదేసమయంలో మంచితనానికి మాగుంట కుటుంబం ఒక బ్రాండ్ అయితే దామచర్ల జనార్దన్ అభివృద్ధికాముకుడు, నమ్మిన వారికి ప్రాణమిచ్చే సుగుణశాలి అని కొనియాడారు. ఒంగోలులో శుక్రవారం రాత్రి జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో ఆయన భావోద్వేగ, ఆవేశపూరిత ప్రసంగం చేసి ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి ఒంగోలు వచ్చిన ఆయన నగరంలోని మిర్యాలపాలెం సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. స్థానిక సమస్యలు, రాజకీయ పరిస్థితుల గురించి ఆయన ప్రస్తావిస్తూ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయనకు అభివృద్ధి, ప్రజాసమస్యలు పట్టవు, నిత్యం జూదాలు, జల్సాలతో గడుపుతారని వ్యాఖ్యానించారు. అంతెందుకు ఎర్రజర్ల వద్ద ఎర్రమట్టిని కొల్లగొట్టిన స్మగ్లర్ అని ఆరోపించారు. పేదలకు ఇళ్లస్థలాల పేరుతో అభివృద్ధి పనుల మాటున డబ్బు కొల్లగొట్టారని, ఆపై నలభై కోట్ల రూపాయల విలువైన ఎర్రమట్టిని స్మగ్లింగ్ చేసి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అందుకే బాలినేని ఎర్రమట్టి స్మగ్లర్ అని వ్యాఖ్యానిస్తున్నానన్నారు. ఇక భూకబ్జాలు, నకిలీ స్టాంపులు, ఫోర్జరీ సంతకాల బాగోతాలతో ఈయనగారి పాలన సాగిందన్నారు. 'నాకు బాగా గుర్తుంది.. సుబ్బారావు అనే వ్యాపారిపై దాడిచేసి హతమార్చే ప్రయత్నం చేశారు. వ్యాపారులను బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నమూ చేశారు. మామూళ్లరాజ్యం ఈ ఐదేళ్లు బాహాటంగా కొనసాగింది. అల్లరిమూకలు, రాజకీయ రౌడీలు పెట్రేగిపోయారు. అందుకు నాయకత్వం వహించిన బాలినేని లాంటి వాళ్లు మీకు కావాలా' అని ఆయన సూటిగా ప్రశ్నించారు. మరోవైపు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి గురించి ప్రస్తావిస్తూ ఎర్రచందనం స్మగ్లర్ పుష్ప మీకు అవసరమా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండే ఆయన శేషాచలం మొత్తాన్ని కొల్లగొట్టారు, వారికి ఎంపీగానో ముఖ్యమంత్రిగానో అవకాశం ఇస్తే సమస్తం దోచేసుకుంటారు జాగ్రత్త అని హెచ్చరించారు.

మంచితనానికి మాగుంట బ్రాండ్

మరోవైపు 'ఒక్కసారి మా వైపు చూడండి. మా ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబం మంచితనానికి ఒక బ్రాండ్. ఎంత ఉన్నా ఒదిగి ఉండటం, వినయంగా మెలగటం ఆ కుటుంబానికే చెల్లింది. ఎప్పుడైనా ఒక్కపైసా అవినీతి సొమ్మును ఆశించారా.. అలాంటి మాట మీరెప్పుడైనా విన్నారా' అంటూ సీఎం ప్రశ్నించారు. అందుకే ఎర్రచందనం స్మగ్లర్‌ను తరిమికొట్టి మీలో ఒకడిగా మీతో ఉన్న మంచివాడు మాగుంటను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి కాముకుడు దామచర్ల

ఒంగోలు అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గురించి ప్రస్తావిస్తూ సౌమ్యుడు, అజాతశత్రువు, నమ్మిన వారికి ప్రాణమిచ్చే వ్యక్తి అని చంద్రబాబు కొనియాడారు. ఆయన ఎమ్మెల్యేగా ఉండగా రూ.2600 కోట్లకుపైగా అభివృద్ధి పనులకు నిధులు సాధించారు. నేనూ ప్రోత్సహించాను, తద్వారా అందరి దృష్టిలో అభివృద్ధి కాముకుడిగా పేరొందారు. నమ్మిన వారికి ప్రాణమిచ్చేతత్వంతో అందరి హృదయాలను చూరగొన్నారు' అని అన్నారు. అందుకే జనార్దన్‌ను గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు.

ప్రజల నుంచి విశేషస్పందన

ప్రజాగళం కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎన్నికల సమయం కావటంతో కేవలం పట్టణ పార్టీ శ్రేణులే రావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. అయినా ప్రజలు పెద్దసంఖ్యలో ప్రజాగళం సభకు తరలివచ్చారు.



ఒంగోలులో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనం (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

ఓటు వేయడానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

యద్దనపూడి, (మార్టూరు) మే 10 : యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన వివాహిత దేవరకొండ మేరీ (28) శుక్రవారం వేకువ జామున నిజామాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందిన సమాచారం మేరకు.. మేరీ భర్త పోతురాజు తో కలిసి హైదరాబాదులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు అబ్బాయిలు, కుమార్తె ఉన్నారు. ఎన్నికలు సందర్భంగా పూనూరు గ్రామంలో ఓటు వేసేందుకు పోతురాజు భార్య మేరీతో కలిసి ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. నిజామాబాద్ వద్ద జాతీయ రహదారిపై వారి బైకు డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో మేరీ అక్కడికక్కడే మృతి చెందింది. పోతురాజు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు పూనూరు నుంచి అక్కడకు వెళ్లారు.

దారికాచి వ్యక్తిపై దాడి

● రూ.2.లక్షలు దోపిడీ

చీరాలటౌన్, మే 10 : దారికాచి వ్యక్తిపై దాడిచేసి నగదు దోచుకుని పారిపోయిన సంఘటన శుక్రవారం పట్టణ పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. బాధితుడు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అతను పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈక్రమంలో రూ.2లక్షల నగదుతో ద్విచక్ర వాహనంపై ఆర్వోబీ వంతెనపై నుంచి ఇంటికి వెళుతుండగా హరిప్రసాద్‌నగర్ సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కారును అడ్డంగా ఉంచి, కళ్లల్లో ఇసుకపోసి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. అంతేకాకుండా అతని వద్ద ఉన్న రూ.2లక్షలు తీసుకుని పరారయ్యారు. స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అయితే ఘటన పాతకక్షల నేపథ్యంలో జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

చినగంజాం, మే 10 : మండలంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో తెలంగాణ మద్యం బాటిళ్లను పట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు వివరాల మేరకు చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలో రాజు పోలిరెడ్డి రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. పోలిరెడ్డి రొయ్యల చెరువుల వద్ద కాపాలదారుని షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన 418 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం బాటిల్స్‌ను ఎవరు అక్రమంగా నిల్వ ఉంచారనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అధికారి బి.కల్పన, స్క్వాడ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

10 బీరు బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, మే 10 : ఎస్‌ఈబీ జిల్లా స్క్వాడ్ అధికారుల తనిఖీలలో 10 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మణికేశ్వరానికి చెందిన తిమోతి 10 మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో ఎస్‌ఈబీ జిల్లా స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకొని అద్దంకి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



రేపటికల్లా వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), మే 10 : పోలింగ్ కేంద్రాల్లో 12వ తేదీ ఉదయానికల్లా వెబ్ కెమెరాల ఏర్పాటు పూర్తి చేయించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నోడల్ అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క నియోజకవర్గానికి నలుగురు అధికారులతో బృందాన్ని నియమించామని, ఈ ఎన్నికల నిర్వహణను పరిశీలించడానికి జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ శనివారం నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పూర్తయ్యే వరకు పనిచేస్తుందన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నియోజకవర్గాలకు

నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్

ఎన్నికల సామగ్రి బయలు దేరే సమయం నుంచి ఓటింగ్ పూర్తయ్యేవరకు పూర్తి స్థాయిలో అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా? అనే విషయాలు పరిశీలించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను మార్చాల్సి వస్తే వెంటనే సంబంధిత నోడల్ ఆఫీసులకు తెలియచేయాలన్నారు. ఈ సమవేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, నోడల్ అధికారులు ఎస్ రాజు, టీ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మైపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన వేమిరెడ్డి దంపతుల సభలో పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు

నేటితో ప్రచారాలు

పరిసమాప్తం

నెల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామం తుదిదశకు చేరుకుంది. ప్రధాన ఘట్టమైన ఎన్నికల ప్రచారాలు శనివారంతో ముగియనున్నాయి. గడిచిన 50 రోజులకుపైగా చెవులు తూట్లు పొడిచేలా వివిధ శబ్దాలకు నేటి సాయంత్రం 6 గంటలతో తెరపడనుంది. ఇక తుదిపోరు పోలింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారాలను ముగించాల్సి ఉంది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రక టించింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇక అభ్యర్థులను ఖరారు చేసిన తరువాత ఆ ప్రచారాలు ఊపందుకున్నాయి. 2019తో పోలిస్తే ఈదఫా ప్రచారం సుదీర్ఘంగా సాగింది. నాడు మొదటి విడతలోనే ఎన్నికలు జరగడంతో పట్టుమని నెలరోజులు కూడా సమయం దొరకలేదు. ఈసారి నాల్గవ విడ తలో ఎన్నికల జరగడం, ఎక్కువ సమయం దొరకడంతో ప్రధాన పార్టీ లన్నీ ఓటర్ల గడపలు తొక్కాయి. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచా రాలు ముమ్మరంగా చేసుకున్నాయి.

● అధినేతల రాక

ప్రధాన పార్టీల అధినేతలు జిల్లాలో ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగు దఫాలుగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. తొలుత కావలి, ఉదయగిరి, అనంతరం సర్వేపల్లి, ఆత్మకూరు, కోవూరు, చివరివిడతలో నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒకేఒక్కసారి జిల్లాకు వచ్చారు. చంద్రబాబు నాయుడుతో కలిసి జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించి, బహిరంగ సభలో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కందుకూరు, కావలి, నెల్లూరు నగరంలో మూడు దఫాలుగా ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల కోవూరులో పర్యటించారు. వీరేగాక పలు రాజకీయపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా వారివారి స్థాయిలో జోరుగా ప్రచారాలు చేపట్టారు. నేటి సాయంత్రంతో ఎన్నికల ప్రచారాలు తెరపడనుండటంతో అభ్యర్థులంతా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు పడిన కష్టాన్ని ఓటు రూపంలో మలచుకునుందుకు ఎవరి ప్రయత్నాలు వారు జోరుగా సాగిస్తున్నారు.

మద్యం దుకాణాలు, బార్లు మూత

● నేటి రాత్రి 7 నుంచి, 13వ తేది రాత్రి 7వరకు

నెల్లూరు (క్రైం) : ఎన్నికల నిర్వహణ దృష్ట్యా శనివారం రాత్రి 7 గంటల నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత 13వ తేదీ రాత్రి వరకు జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు మూసివేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కె నాగమల్లేశ్వరరెడి ఒక ప్రకటనలో తెలి పారు. ఈ 48 గంటల వ్యవధిలో మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యం, ఇతరులు మద్యం అమ్మకాలు జరిపినా, అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 0861-2331159 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

ప్రకాశం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్ధి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఒంగోలు				
2. కొండపి				
3. కనిగిరి				
4. దర్శి				
5. మార్కాపురం				
6. గిద్దలూరు				
7. ఎర్రగొండపాలెం				
8. సంతనూతలపాడు				
9. అద్దంకి				
10. పర్చూరు				
11. చీరాల				
12. కందుకూరు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

బ్రాంచి మేనేజర్, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెంబరు 206/2,3
చీరాల రోడ్డు, త్రోవగుంట, ఒంగోలు రూరల్(మండలం), ప్రకాశం జిల్లా -523262.

*షరతులు వర్తిస్తాయి





జగన్మోహన్‌రెడ్డి గ్రాఫ్ పడిపోయింది : మేకపాటి

కలిగిరి, మే 10: నా గ్రాఫ్ పడిపోయిందని, అందుకే టికెట్ ఇవ్వనన్న.. ముఖ్యమంత్రి నీ గ్రాఫ్ పడిపోయింది చూసుకో..దానికి తగిన శాస్తి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. మార్పు అవసరమని ప్రజలు నిర్ణయించుకున్నారు అని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. కలిగిరిలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జగన్ ప్రజలతో వ్యాపారం మాత్రమే చేశాడన్నారు. ఆయన, ఆయన బృందం రాష్ట్రాన్ని కొల్లగొట్టారన్నారు. పాలన చేతకాని వాడి చేతుల్లో రాష్ట్రం ఐదేళ్లలో అధోగతి పాలైందన్నారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

లింగసముద్రం, మే 10 : లింగసముద్రం, తాతాహోటల్ ప్రాంతాలలో బీజేపీ నాయకులు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని బీజేపీ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె రాఘవయ్య, ఎం వరప్రసాదరావు, బుర్ర కోటేశ్వరరావు, మట్లె ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతత, పరిశ్రమల స్థాపనే నా లక్ష్యం

- వేధింపులు లేని కావలి నా అభిమతం
- కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నెల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లపాటు అట్టుడికిన కావలిలో ప్రశాంత వాతావరణం సృష్టించడం, పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? తొలిసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు, ఎలా ఉంది ఈ అనుభవం.

! పోటీ తొలిసారే కానీ ఎన్నికలు మాత్రం నాకు కొత్తకాదు. మండల పరిషత్ అధ్యక్షుడిగా నా ఎన్నికలను ఫేస్ చేశాను. మూడు దశాబ్దాలుగా ప్రతి ఎమ్మెల్యే ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాను. ఆ అనుభవం ఉంది. అయితే ఈసారి ఎన్నికలు చాలా డిఫరెంట్. చాలా హైప్ వచ్చేసింది. గతంలో గ్రామ స్థాయి నాయకులు చెబితే వినేవారు. ఇప్పుడు అలా కాదు. అభ్యర్థులే నేరుగా తమను కలవాలని, తమతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోవాలని ప్రజలు కోరుకొంటున్నారు. అభ్యర్థులతో అటాచ్‌మెంట్ కోరుకొంటున్నారు. ఇది కొత్త పరిణామం. అలాగే కారణాలు ఫలానా అని చెప్పడం సరికాదు కానీ ప్రజల కోరికల్లో కూడా చాలా హైప్ వచ్చింది. ఇది కొత్త అనుభం.

? గెలుపు పట్ల మీ ధీమా ఎలా ఉంది.

! ఏమాత్రం అనుమానం లేదు. భారీ మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపిస్తున్నారు. మీకో విషయం తెలుసో లేదో, ఐదేళ్ల క్రితమే కావలి ప్రజలు మానసికంగా ఎన్నికలకు సిద్ధమైపోయారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, ఎప్పుడు ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని ఓడిద్దామా అని కసిగా ఎదురుచూస్తూ ఉన్నారు. కాబట్టి ప్రజలు తెలుగు దేశం పార్టీని మానసికంగా ఎప్పుడో గెలిపించేశారు. ఇప్పుడు ఈవీఎం మిషన్ నొక్కడం ఒక్కటే మిగిలింది. కావలి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేసిన అరాచకాలు, అన్యాయాలు అలాంటివి. వీటిని ప్రజలు మరిచిపోలేరు. ఓటుతో వైసీపీ నాయకులను తప్పకుం డా శిక్షిస్తారు.

? మీ గెలుపునకు దోహదపడే అంశాలు.

! చంద్రబాబు నాయుడు పరిపాలన పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం. పవన్ కళ్యాణ్ పట్ల యువతకు ఉన్న అభిమానం. మోదీ దక్షతపైన విశ్వాసం. ఇవన్నీ నా గెలుపునకు దోహదపడే అం శాలు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యక ర్తల సమష్టి బలం, వ్యక్తిగతంగా నాకున్న పరిచ యాలు, నా శక్తిమేరకు నేను చేసిన సేవా కార్యక్రమాలు. ఇవన్నీ నా గెలుపునకు దోహదప డే అంశాలు.

? కావలి అభివృద్ధి విషయంలో మీ ప్రాధాన్యతలు.

! కావలి వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. ఇక్కడ మత్స్యపరిశ్రమ, వస్త్ర వ్యాపారాలకు కావలి పెట్టింది పేరు. కూటమి నాయకుల అందరి సహకారంతో ఈ రంగాలన్నింటినీ అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తా. మత్స్య పరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తా. ఈ వైసీపీ పాలనలో మత్స్యవాడలు కనీస సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తా. వస్త్ర వ్యాపారులకు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వాతావరణం కల్పిస్తా. పోలీసు దాడులు, మామూళ్ల వేధింపులు లేకుండా చూస్తా. కావలి సముద్ర తీర ప్రాంతం. ఇక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉంది. నాలుగు పరిశ్రమలు తీసుకొస్తే వ్యాపారపరంగా కావలి ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంత యువకులకు ఉపాధి లభిస్తుంది. కావలిలో పరిశ్రమల స్థాపనకు మొదటి ప్రాధాన్యత ఇస్తా. కావలి మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమైన రహదారులన్నీ బాగుచేయిస్తా. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల లోటు లేకుండా చర్యలు తీసుకుంటా.

? కావలి ప్రజలకు మీరు చేసుకునే విన్నపం.

! కావలి నియోజకవర్గ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. గడచిన ఐదేళ్ళ కాలంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి చేసిన అరాచకాలు గుర్తుకు తెచ్చుకోండి. పిడికెడు మట్టి తోలుకోలేకపోయారు. మామూళ్లు ఇవ్వకుండా భూమి అమ్మలేకపోయారు. కొనలేకపోయారు. కప్పం కట్టకుండా ఏ వ్యాపారం చేయలేకపోయారు. పోలీసుల వేధింపులు చూశారు. దౌర్జన్యాలు చూశారు. ఐదేళ్లపాటు నరకం అనుభవించారు. మీ అందరికి నేను ఒక్కటే ప్రమాణం చేస్తున్నా. నన్ను గెలిపించండి. అరాచకం, అన్యాయం, బెదిరింపులు, వేధింపులు లేని కావలి నియోజకవర్గాన్ని మీకు కానుకగా ఇస్తా. స్వేచ్ఛగా జీవించే వాతావరణం సృష్టిస్తా. మీ సేవకుడిగా నిరంతరం అందుబాటులో ఉంటా.

ఎవరికి ఏ కష్టం వచ్చినా తోడబుట్టిన వాడిలా తోడుగా ఉంటా. ప్రజలకు భద్రత కల్పిస్తా. యువతకు ఉపాధి అవకాశాల బరోసా కల్పిస్తా. ఈ ఎన్నికలు రాష్ట్రానికి ఎంత ముఖ్యమో కావలికి అంతకన్నా ముఖ్యం. రాష్ట్రంలో రానున్నది చంద్రన్న పాలన. నన్ను అందులో భాగస్వామిని చేస్తూ ఆశీర్వదించండి. ఐదేళ్ల పాటు మీ కుటుంబ సభ్యుడిగా మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటా. కావలిని అభివృద్ధి బాటలో నడిస్తా.

టీడీపీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు!

- ఓటరు స్లిప్పుల పంపిణీలో బయటపడుతున్న వైనం

కావలి, మే 10: రాజ్యాంగం అర్హులైన ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును కాలరాసే అధికారం వైసీపీ నేతలకు, అధికారులకు ఎవరిచ్చారని ఓటు హక్కును కోల్పోయిన బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమాలతో ఎలాగైనా గెలవాలన్న ఆకాంక్షతో అధికారపార్టీ చేసిన అక్రమాలు కావలిలో వెలుగు చూస్తున్నాయి. పట్టణంలోని 28వ వార్డులో ఐదుగురు ఓటర్లు తమకు ఓటరు స్లిప్పులు రాలేదని శుక్రవారం బీఎల్వోకు ఫోన్ చేయగా ఆయన వచ్చి ఓటర్ జాబితాను పరిశీలించగా జాబితాలోనే వారి పేర్లు కనిపించలేదు. అలాగే 37వ వార్డులో ముగ్గురు ఓటర్ హెల్పింగ్ సెంటర్‌కు వెళ్లి వారి పాత ఓటర్ ఐడీ కార్డుతో పరిశీలించగా డిలెట్ చేసినట్లు చెప్పారు. అలాగే పాతూరుకు చెందిన ఒక ముఖ్య టీడీపీ నాయకుడి సతీమణి ఓటు కూడా కనిపించలేదని తెలిసింది. ఇవి కావలిలో మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇలాంటివి పట్టణంలో ఎన్ని ఉన్నాయో తెలియాల్సి ఉంది. ఎంతో కాలంగా నివాసం ఉంటున్న వారి ఓట్లు లేవంటే దీంతో అధికారపార్టీ ఓటర్ల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. వైసీపీ సానుభూతిపరులకు షిఫ్టింగ్ పేరుతో దొంగ ఓట్లు నమోదు చేయడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించిన సంఘటనలు ఓటర్ల జాబితా నిలువెత్తు సాక్ష్యాలుగా ఉన్నాయి. పోలింగ్‌రోజు ఓటర్లకు స్లిప్పులు ఇవ్వటానికి అసలు ఓటర్ లిస్ట్ బయట పెట్టగా ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు పబ్లిష్‌చేసిన ఓటర్‌లిస్ట్‌లు ప్రజలకు అందుబాటులో లేవని తెలుస్తోంది. ఇటీవల కావలి పట్టణంలో వెంగళరావునగర్, పాతూరులలో ఓటరులిస్ట్ చూస్తే వైసీపీ నేతలు షిఫ్టింగ్ పేరుతో ఒకే ప్రాంతంలో అదే ప్రాంతానికి దొంగ ఓట్లు చేర్చుకున్న విషయం తెలిందే. తాజాగా బీఎల్వోలు ఓటరుస్లిప్పులు ఇవ్వటానికి ఇంటింటికి వెళ్లగా ఎంతో కాలంగా అక్కడే నివాసం ఉంటున్న అనేకమంది పేర్లు ఓటర్‌జాబితాలో లేక పోవటంతో బీఎల్వోలు వారికి ఓటరు స్లిప్పులు ఇవ్వలేదు. దీంతో అలాంటి వారు తమకు స్లిప్పులు ఎందుకు ఇవ్వటంలేదని నిలదీయగా ఓటర్ల జాబితాలో మీ ఓట్లు లేవని జాబితా తెచ్చి చూపిస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఓటు లేనివారంతా టీడీపీ సానుభూతిపరులు కావటంతో అధికారపార్టీ వారు అధికారులను మేనేజ్ చేసి ఎన్నికలలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో తొలగించారని తెలుస్తోంది.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్

అల్లూరు, మే 10 : ఆర్యవైశ్యులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, కావలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్యలతో కలసి ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఆర్యవైశ్యులు ప్రశాంతంగా వారి వ్యాపారాల్లో రాణించారన్నారు. వైసీపీ పాలనలో వేధింపులకు గురవుతున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కలసి రాష్ట్రంలో పోటీ చేస్తుందని, కావలి అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడా రామకృష్ణారెడ్డి, శ్రీరామ్ మాల్యాద్రి, దమ్మాల బ్రహ్మానందం, రవ్వా హరికుమార్, జలదంకి శ్రీనివాసగుప్తా, అమరా సుధాకర్, ఎద్దల కృష్ణమూర్తి, వాసవీ క్లబ్ వనితా మండలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరెడ్డి

కందుకూరు, మే 10: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈనెల 11వ తేది రాత్రి 7 గంటల నుంచి 13వ తేది రాత్రి 7 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు సీజ్ చేస్తామని, ఆ సమయంలో, అంతకు ముందు మద్యం విక్రయాల్లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి కె.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు, ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో డ్రైడే రోజుల్లో పాటించాల్సిన నియమనిబంధనల గురించి శుక్రవారం స్థానిక సెబ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా పరిమితికి మించి మద్యం అమ్మకాలు జరిపినా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా అలాంటివారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ పీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే మాదిగల అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు

జలదంకి, మే 10: ఉదయగిరి అసెంబ్లీ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపుతోనే ఈ ప్రాంతంలో మాదిగ జాతి అభివృద్ధి చెందుతుందని ఎంఆర్‌పీఎస్ నేత పందిటి అంబేద్కర్‌మాదిగ పేర్కొన్నారు. మండలంలోని క్రిష్ణాపాడు, చామదల ఎస్సీ కాలనీల్లో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లకు ఓట్లేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా!?



కావలి, మే 10 : కావలి-కలిగిరి రోడ్డులో జమ్మలపాలెం దగ్గర నిర్మిస్తున్న వంతెన వద్ద బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డులో పెద్ద గుంటలు పడి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడ రోడ్డు నిర్మాణంలో భాగంగా నిత్యం టిప్పర్లు తిరుగుతున్నా ఆ గుంటను పూడ్చకపోవడం చూస్తే ఉదయగిరి రోడ్డు హైవే నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్లకు దానిని పర్యవేక్షించే అధికారులకు ప్రజల ప్రాణాలంటే ఎంత నిర్లక్ష్యమో ఆ గుంటను చూస్తే అర్థమవుతోంది. రాత్రి సమయంలో అక్కడ గుంట కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆ గుంటను పూడ్పించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

టీడీపీలోకి జోరుగా వలసలు



కందుకూరు : టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు



ఉలవపాడు : టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో ఇంటూరి

కందుకూరు, మే 10: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో జోష్ కొనసాగుతోంది. ప్రతిరోజు వందలాదిమంది వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం లింగసముద్రం మండలం జంపాలవారిపాలెంకు చెందిన జంపాల శివ, శ్రీను ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, కందుకూరు మండలం జిల్లెలమూడికి చెందిన రావెళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, వలేటివారిపాలెం మండలం సింగమనేని పల్లికి చెందిన పలువురు, గుడ్లూరు మండలం అమ్మవారిపాలెం, స్వర్ణజిపురం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు బోయపాటి రమేష్, లక్ష్మీనారాయణ, చెంచురామయ్య వంశీ, కాకు వేణు, మేకల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం, ఎల్ రాజుపాలెం, కృష్ణాపురంలో...

ఉలవపాడు : మండలంలోని భీమవరం, ఎల్ రాజుపాలెం, కృష్ణాపురం గ్రామాలలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన చలపతిరాము, మధుబాబు, కొండలరావు, తులసీరామ్, మాలకొండయ్య, మధుబాబు, బాలాజీ, 'సురేష్‌బాబు, ప్రతాప్ తదితర 25 వైసీపీ కుటుంబాలు, వడ్డెరపాలెంకు చెందిన మరో 10 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఇంటూరి పార్టీ కండువా కప్పారు.

టీడీపీకి మద్దతుగా ప్రచారం : దళితులను ఆర్థికంగా అణగదొక్కి, ఐదేళ్లలో ఎలాంటి ఎదుగుబొదుగు లేకుండా దళితుల జీవితాలను నిర్వీర్యం చేసిన దళిత ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వర్ల దేవాదాసు మాదిగ అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆయన మండలంలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. జగన్ మోహన్‌రెడ్డి దళితులకు చేసిన అన్యాయాన్ని గుర్తుకు తెచ్చుకొని మందకృష్ణ ఆదేశాల మేరకు కందుకూరు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కందుకూరు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ రావినూతల ముత్తు మాదిగ, కిట్టు మాదిగ, రావినూతల ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు బీసీ కాలనీ వాసులు...

గుడ్లూరు : గుడ్లూరు బీసీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు ఇంటూరి సందీప్, వేమిరెడ్డి సోదరుడు శ్రీనివాసులరెడ్డిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గుడ్లూరు బీసీ కాలనీ, ఇతర ప్రాంతాలకు చెందిన ఎస్కే బుడేసాహెబ్, ఎస్కే జిలానీ, ఎస్కే కాలేషా, ఓరుగంటి రమణయ్య, డాక్టర్ సుధీర్, జవంగుల వీరాస్వామి, శానం రాము తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనిగర్ల నాగరాజు, చెరుకూరి సూర్యనారాయణ, పారా జనార్దన్‌రావు, కావలి ఏసుదాస్, సేవకుడు కాకు మనోజ్‌రాజా, జనసేనా నాయకులు అన్నంగి చలపతి, సనిశెట్టి గిరిబాబు, అనిమిశెట్టి మాధవరావు, కుంచాల అంకమరావు, మూలగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య రోడ్‌షో

లింగసముద్రం : ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, ఇంటూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా గెలిపించాలని కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య కోరారు. శుక్రవారం ఆమె టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెం, బలిజపాలెం, అంబేద్కర్‌నగర్, లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, తాతాహోటల్, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో రోడ్‌షో నిర్వహించారు. కనిగిరిలో చెల్లని బుర్రా మధుసూదన్‌యాదవ్ కందుకూరులో ఎలా చెల్లుతాడో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్టే నారాయణ, చెబేటి రమేష్, బింకం శేషయ్య, పీ బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, యు నాగేశ్వరరావు, ఎ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే వర్గీకరణ సాధ్యం : ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ చెప్పారు. శుక్రవారం మండలంలోని మొగిలిచెర్ల, ఆర్‌ఆర్ పాలెం, గంగపాలెం, గ్రామాలలోని ఆదిఆంధ్ర కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఎంపీ అభ్యర్థి మేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు గౌడపేరు కాంతారావు మాదిగ, జడ భాస్కర్ మాదిగ, ఏ కిషోర్ మాదిగ, విజిల్ మాదిగ, ప్రసన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి కుమారుడు సందీప్



లింగసముద్రం : కరపత్రాలు అందజేస్తున్న ఇంటూరి సౌజన్య

హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- విడతల వారీగా రూ.23,27,974 వసూలు
- బాధితుల ఫిర్యాదుతో అరెస్టు చేసిన పోలీసులు

కావలి రూరల్, మే 10: హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన గుడిపూడి వెంకట నిఖిలేష్ కుమార్‌ను శుక్రవారం కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన వెంకట నిఖిలేష్ కుమార్ తాను హైకోర్టు ఉద్యోగినని, హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని పట్టణంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన బుడం శెట్టి సాయి మనోజ్‌ను నమ్మించాడు. అతని నుంచి 2024 జనవరి 30వ తేదీ నుంచి విడతల వారీగా రూ.23,27,974 వసూలు చేశాడు. అయినా ఉద్యోగం రాకపోవడం, ఆ విషయం అడిగే దాటవేయడంతో బాధితుడి జ ఈ నెల 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గోపీచంద్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

వేములపాడులో వైసీపీకి బిగ్ షాక్

- 140 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో వంటేరు, చేవూరి

జలదంకి, మే 10: మండలంలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. శుక్రవారం వేములపాడు పంచాయతీలో 140 బీసీ, ఎస్సీ కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పోలింగ్‌కు ఇంకా మూడు రోజులు సమయం ఉండడంతో వైసీపీకి ఇంకెన్ని షాక్‌లు తగులుతాయోనని ఆ పార్టీ నాయకులు భీతిల్లుతున్నారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పసుపుకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు సైకిల్‌గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంటేరు జయచంద్రారెడ్డి, తొక్కేలు నారాయణరెడ్డి, మద్దూరి శ్రీనివాసలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయం కోసం పనిచేస్తాం

ఉలవపాడు, మే 10 : టీడీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీ పటిష్టతకు పని చేసిన అనుభవంతో శక్తివంచన లేకుండా కూటమి అభ్యర్థులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఉలవపాడులోని వారి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు దామచర్ల సుబ్బారావు మాట్లాడుతూ టీడీపీని గెలిపించుకోవడం చారిత్రాత్మక అవసరమని, ముందుచూపు కలిగిన చంద్రబాబు నాయుడే రాష్ట్రాభివృద్ధి చేయడానికి సమర్థుడని కొనయాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కారుమంచి పెనుగొండయ్య, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరి బండారు సోమురాజు, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆవుల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కావలిని డెల్టా ప్రాంతంగా మారుస్తా !

- గౌరవరం, రుద్రకోట గ్రామాలను దత్తత తీసుకుంటా
- ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కావ్య హామీ



కావలిరూరల్ : క్రిష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు

కావలి రూరల్, మే 10: కావలి నియోజకవర్గాన్ని డెల్టా ప్రాంతంగా మారుస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గౌరవరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చెరువుకు నీరు రావడానికి ఉన్న ఇబ్బందులు తొలగించి రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తానన్నారు. సోమశిల ప్రాజెక్టు ఏర్పాటు చేసినపుడు నెల్లూరు ఆయకట్టు ఎక్కువగా ఉండేదని, నెల్లూరు పట్టణం పెరిగినందున వ్యవసాయ భూములు నివాసప్రాంతంగా మారడం, క్రిష్ణపట్నం పోర్టు ఏర్పాటుతో సుమారు 75,000 ఎకరాల ఆయకట్టు తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో కావలి కాలువ ఆయకట్టు పెంచాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యంతో ఎడారుగా మారుతుందన్నారు. మాగుంట పార్వతమ్మ ఎమ్మెల్యేగా, తాను జలదంకి ఎంపీపీగా ఉన్నప్పుడు గుడిపాడు వరకు ఉన్న ఉత్తర కాలువను జలదంకి వరకు తీసుకువచ్చేందుకు రైతులతో కలసి ధర్నాలు చేసి పోరాడి సాధించామన్నారు. కేటీఎస్ పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. కావలి నియోజకవర్గంతో పాటు జలదంకి మండలాన్ని డెల్టాగా అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే గౌరవరం, రుద్రకోట గ్రామాలను దత్తత తీసుకుని రోడ్లు, కాలువలు ఏర్పాటు చెయ్యడంతో పాటు ఇళ్లస్థలాలు కేటాయించి అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి మోడల్ విలేజ్‌లుగా తీర్చి దిద్దుతానన్నారు. గెలిచిన నెల రోజుల్లో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. ఈ ఎన్నికల్లో నాకు ఉపయోగపడని వ్యక్తులు బంధువులైనా, శత్రువులైనా నాకు అవసరం లేదన్నారు. నేను చాలా పేద కుటుంబం నుంచి వచ్చినందున కష్టాలు, నష్టాలకు ఎదురోడ్డి ఈ స్థాయికి చేరానన్నారు. నా కోసం నడిచి నా వెంట కష్టపడ్డవారిని నెత్తిన పెట్టుకుని మోస్తానని, వారే నా బంధువులన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల రామక్రిష్ణ, చింతం బాబుల్‌రెడ్డి, మేదరమెట్ల ఈశ్వర్‌రెడ్డి, ఆళ్లపాక రవి గౌడ్, దేవిక గౌడ్, చింతం రమణమ్మ, సూరె శ్రీలత, నాయుడు రాంప్రసాద్, జనసేన నాయకుడు సిద్దు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో కావ్య క్రిష్ణారెడ్డి ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు.



కావలిరూరల్ : గౌరవరంలో మాట్లాడుతున్న కావ్య




బిట్రగుంట : టీడీపీ కండువా వేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

కడనూతలో పలువురి టీడీపీలో చేరిక

బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు, స్థానిక నేతల ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం టీడీపీలో చేరారు. కావలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో కావలి కలగయ్య, చెంచు మురళి, సుధీర్, మారుబోయిన ప్రసాద్, నాటకరాణి మల్లయ్య, శ్రీకాంత్, భాస్కర్ తదితర 20 కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. కొండబిట్రగుంటలో టీడీపీ నేత రావి.విజయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యువత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దగదర్తి అరుంధతివాడలో మాలేపాటి రవీంద్రనాయుడు, భానుచందర్‌నాయుడు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలన్నారు.

అప్పుడే.. కాయ్ రాజా కాయ్ !



పోలింగ్ ఇంకా పూర్తి కానే లేదు.. అప్పుడే కందుకూరు నియోజకవర్గంలో అభ్యర్థుల విజయంపై గ్రామాల్లో జోరుగా పందేలు కాస్తున్నారు. ఎన్డీఏ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ తరఫున బుర్రా మధుసూదన్‌యాదవ్ పోటీ చేస్తుండగా, విజయం మాదంటే మాదంటూ ఇరు పార్టీల గ్రామస్థాయి నాయకులు రూ. లక్షల్లో పందేలు కాస్తున్నారు. అంతేకాకుండా ఒంగోలు, నెల్లూరు, నరసారావుపేట ఎంపీ అభ్యర్థుల విజయంపై కూడా జోరుగా పందేలు కాస్తు న్నారు. అధికారపార్టీ నేతలు పందేలకు వెనుకడుగు వేస్తుండగా, కూటమి నాయకులు సైసై.. అంటున్నారు. కూటమి అభ్యర్థి తరఫున రూ.లక్షకు లక్షన్నర ఇస్తామంటూ సవాల్ విసురుతున్నారు.

● **కొత్త చుట్టాలొస్తున్నారు... !**


బాగున్నావా అక్కా...? ఎలా ఉన్నావు చెల్లీ.. ఏంటీ అవ్వా.. కులాసానా.. తాతా ఏం చేస్తున్నావ్.. తల్లీ.. అబ్బాయెక్కడ.. ? ఇలా గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన నేతలు ప్రేమలు ఒలకపోస్తూ ఓటర్లను పలకరిస్తున్నారు. పరిచయం ఉన్నా లేకున్నా అందరినీ వరుసలతో పలకరిస్తున్నారు. ఇవి రాజకీయ పలకరింపులని వాళ్లకీ తెలుసు.. వీళ్లకీ తెలుసు. గతంలో అభ్యర్థులే స్వయంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు నమస్కారం పెట్టి తమ గుర్తు చెప్పి ఓటు అడిగేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. కొత్త చుట్టాల్లా వచ్చి ఓటు అడుగుతున్నారు.

● **ఎంత ఇద్దాం... ?**

ఈ సారి ఓటుకు ఎంత ఇద్దాం.. అని రాజకీయ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎదుట పార్టీ వారు ఇచ్చిన తరువాత మనమూ ఇద్దాంలే... అని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఎదురు చూస్తున్నారు అయితే ఎవరు ముందు డబ్బులు పంపిణీ చేస్తారా ...?అంటూ నిరీక్షిస్తున్నారు. డబ్బులతో పాటు మద్యం కూడ ఇస్తే బాగుంటుందనుకుంటున్నారు. అయితే అందరి దగ్గర డబ్బులు తీసుకుని తమకు నచ్చినవారికి ఓటు వేద్దామని ప్రజలు భావిస్తున్నారు.

- వలేటివారిపాలెం

ఓటుకు భలే రేటు!



పెద్ద నోట్లు రద్దు చేశారనే మాటే కానీ, ఈసారి ఎన్నికల్లో ప్రజలకు ఓటుకు రేటు మాత్రం బాగానే గిట్టుబాటు అయ్యింది. వారు, వీరు అనే తేడా లేకుండా అభ్యర్థులు పోటీ పడి ప్రజలకు డబ్బులు పంచిపెడుతున్నారు. ఏ పార్టీ సానుభూతిపరులు, ఓటు వేస్తారా!? లేదా!? అనే పరిశీలన లేకుండా పంపకాల్లో వారు వీరు అనే వివక్ష లేకుండా ప్రధాన పార్టీలన్నీ సమానంగా ప్రజలను ప్రలోభపెట్టే పనిలో విజయవంతం అవుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 70 శాతం పంపకాలు పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం కూడా ఈ రాత్రికే కంప్లీట్ కానుంది. నెల్లూరులో రూ.3వేలు, ఉదయగిరిలో రూ.5వేల వరకు ఒక్కో ఓటుకు పంచుతున్నారు. ఇక కోవూరు నియోజకవర్గంలో గ్రామాలనే కొనుగోలు చేసుకున్నంతస్థాయిలో ఉంటోంది. ఈసారి ఎన్నికల్లో విశేషం ఏమంటే ఎలాంటి ప్రతిఘటనలు లేకుండా ప్రశాంతంగా హాయిగా పంపకాలు జరగడం. చాలా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇద్దరూ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ లేకుండా కలిసి ఒప్పందం చేసుకున్నట్లు ఒకే రేటు ఫిక్స్ చేసి పంచిపెట్టారు. పంచిపెడుతూనే ఉన్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

మండల కేంద్రాల్లో రూ.2వేలు, గ్రామాల్లో రూ.1,500

అడ్డగింతలు లేవు.. అడ్డుకునేవారూ లేరు!

సిటీ, రూరల్‌లో పోటాపోటీగా..

నెల్లూరురూరల్ : ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు పోటాపోటీగా నగదు పంపిణీ చేస్తున్నాయి. నెల్లూరురూరల్లో ఓటరుకు రూ.2 వేలు చొప్పున, సిటీలో ఓ పార్టీ అభ్యర్థి ఓటుకు రూ. 3 వేలు ఇవ్వగా, మరో పార్టీ అభ్యర్థి రూ. 2 వేలు చొప్పున అందచేశారు. శుక్రవారం ఉదయం నుంచి అటు గ్రామాలలో, ఇటు మున్సిపల్ డివిజన్లలో పోటాపోటీగా పంపిణీ జరుగుతోంది. కొన్ని ప్రాంతాలలో ఈ పంపిణీ విషయమై కొందరు నాయకుల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో నేతలు రంగంలోకి దిగి సర్దుబాట్లు చేస్తున్నారు.

కావలిలో నగదు, మద్యంతో ఎర

కావలి : కావలి నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలతోపాటు ఓ స్వతంత్ర అభ్యర్థి కూడా ఓటర్లకు ఎర వేస్తున్నారు. ఇప్పటివరకు అసంతృప్త నాయకులను బుజ్జగిస్తూ వారికి ప్యాకేజీలు ఇస్తూ కాపాడుకుంటూ వచ్చిన నేతలు ఇప్పుడు పోలింగ్ కోసం ఓటర్లపై దృష్టి పెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ.2వేలు వంతున ఇస్తూ ఇప్పటికే రెండుభాగాలపైన పంపిణీ పూర్తి చేశారు. ఓ స్వతంత్ర అభ్యర్థి మాత్రం కొన్ని ప్రాంతాలను మాత్రమే ఎంపిక చేసుకుని ఓటుకు వెయ్యి రూపాయల వంతున పంపిణీ చేస్తున్నారు. అయితే మద్యం సరఫరాలో మాత్రం అధికార పార్టీ ముందంజలో ఉంది. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు అధికార పార్టీ నేతల కనుసన్నలలో ఉండటంతో వాటి నుంచి నేరుగా మద్యం కేసులను నాయకులకు పంపేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీలలో అసంతృప్తి నాయకులను బుజ్జగించి సర్దుబాటు చేస్తున్నారు. కొందరైతే బుజ్జగింపులకు సర్దుకు పోతుండగా మరికొందరు ప్రత్యర్థి పార్టీల నుంచి ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు.

కానరాని దురాయి

తీరప్రాంతంలో ఒకప్పుడు మత్స్యకారులు దురాయి వేసుకుని ఒకరికే ఓట్లన్నీ గుంపగుత్తుగా వేస్తుండేవారు. అయితే, ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. అధికార పార్టీ నాయకులు మాత్రం ఆ విధానానికి తెరలేపుతున్నా సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు సమాచారం.

'గిరి'లో ఓటుకు రూ.5వేలు

ఉదయగిరి : ఓటర్లను ఆకట్టుకునేందుకు రెండు రోజుల నుంచి తాయిలాల పంపిణీ సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా డబ్బులను పంపిణీ చేశారు. గ్రామస్థాయిని బట్టి రూ.1,500 నుంచి రూ.5వేల దాకా పంచుతున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాను ముందేసుకుని లెక్కలు తీసి మరి పంపకాలు సాగిస్తున్నారు. బూత్ కమిటీ సభ్యులు తమ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నాయకులకు అందజేస్తున్నారు. ఆ తర్వాతే డబ్బుల పంపకాలు ఉంటున్నాయి. మరోవైపు డబ్బులతోపాటు మద్యాన్ని కూడా పంపిణీ జోరుగా సాగుతోంది.

ఆత్మకూరులో బెట్టింగ్‌ల జోరు

ఆత్మకూరు : సర్వేలు, అంచనాలతో వాతావరణం వేడెక్కడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరందుకున్నాయి. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో బెట్టింగుల జోరు కొనసాగుతోంది. అభ్యర్థుల విజయ అవకాశాలతోపాటు ఏ మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో అనే అంశంపైనా బెట్టింగులు కాస్తున్నారు. ఇక ఓటర్ల జాబితా ఆధారంగా ఓటుకు రూ.2000 ఇవ్వడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో గల్లీ లీడర్లు ఓటుకు కొంత మొత్తాన్ని ముట్టజెపుతూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, నూరు శాతం ఓటర్లకు రూ.2000 వంతున పంపిణీ చేయానికి కొందరు ద్వితీయశ్రేణి నాయకులు డిమాండ్ చేస్తున్నా 60 శాతం నుంచి 75 శాతం ఓటర్లకు మాత్రమే నగదు ఇస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఓటర్లకు డబ్బు పంపకం గుట్టుచప్పుడు కాకుండా మొదలు పెట్టారు. మరోవైపు పోలీసుల తనిఖీలు ముమ్మరంగా జరుగుతుండటంతో నగదు తరలించడం, సర్దుబాటు చేయడం అభ్యర్థులకు తలభారంగా మారింది. సొమ్ము, మద్యం, తాయిలాలు పోలీసుల కంట పడకుండా క్షేత్రస్థాయికి చేర్చడానికి ఆపసోపాలు పడుతున్నారు.

కందుకూరులో రెండ్రోజుల నుంచే!

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ఇరు పార్టీలు రెండు రోజుల క్రితం నుంచే తాయిలాలు పంపిణీలో తనమునకలయ్యాయి. కందుకూరు పట్టణం, మండల కేంద్రాలలో ఓటుకు రూ.3వేలు, గ్రామాల్లో 2వేలు వంతున పంపిణీ చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఎక్కువ ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ప్రభావితం చేయగల నాయకు లకు స్పెషల్ ప్యాకేజీలూ ఇస్తున్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టకుండా వారికి కూడా పెద్ద మొత్తంలో ముట్టజెప్పినట్లు సమాచారం.

'సర్వేపల్లి'లో ఇప్పటికి మందు!

వెంకటాచలం : సర్వేపల్లిలో ఓటుకు నోటు పర్వం మొదలు పెట్టక ముందే గ్రామాల్లో మందు పర్వం కొనసాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఈ కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. అయితే ఈ పంపిణీ తలనొప్పిగా పరిణమిస్తున్నదని అభ్యర్థులు, స్థానిక నేతలు వాపోతున్నారు. నగదు పంపిణీ ఒక్కసారితో ముగిసిపోతుంది. అయితే మందు పంపిణీ మాత్రం పోలింగ్ రోజు వరకు కొనసాగించాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఇటీవల ముత్తుకూరు, పొదలకూరు మండలాల్లో వైసీపీ నేతలు భారీ ఎత్తున నిల్వ ఉంచిన మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేసి వైసీపీ కీలక నేతలు, వారి అనుచరులను అదుపులోకి తీసుకొని జైలుకు పంపించారు. దీంతో మద్యం నిల్వ ఉంచడం, పంపిణీ చేయ డం వంటివి చేస్తు న్న నేతల్లో గుబులు పట్టుకుంది.

కోవూరులో గ్రామాలకు గ్రామాలే!

కోవూరు : నియోజకవర్గంలోని ఓటర్ల ముంగిటకే ప్రలోభాలు చేరడం ప్రారంభిచాయి. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి తరఫున ఒక్కో ఓటుకు రూ.2500 ఇస్తుండగా, మరో ప్రధాన పార్టీ నాయకులు రూ.2వేలు చొప్పున అందిస్తున్నారు. ఓ పార్టీ నాయకులు వలంటీర్ల ద్వారా తమకు ఓటేస్తారని భావించే ఓటర్లకు మాత్రమే నగదు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వార్డులో 60 శాతం మందికి మాత్రమే పంపిణీ చేయాలని నాయకులు భావిస్తు న్నారు. విడవలూరు మండలంలోని కొన్ని గ్రామాలలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో ఓటు కు రూ.10వేల నుంచి 12వేలు చొప్పున అంద జేసిన తెలిసింది. ఇందుకూరుపేట మండలం లోని ఓ గ్రామాన్ని రెండు వారాల కిందటే ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓ ప్రధాన పార్టీ నాయకులు ఓటర్లకు భారీగా మద్యం పంపిణీ చేశారు..

నేనూ ఓటేస్తా...!

అబ్బాయ్ : ఓటు వేయడం మన బాధ్యత బాబాయ్..

బాబాయ్ : ఏందిరా బాధ్యత..? డబ్బులిస్తే ఓటు వేస్తా.. లేకుంటే లేదు.

అబ్బాయ్ : బాబాయ్... నేను డబ్బులు తీసుకోను. అయితే ఓటు మాత్రం నచ్చినవారికి వేస్తా..

బాబాయ్ : ఏందిరా అబ్బాయ్.. మొన్న పండక్కి రాలేదు. ఇప్పుడు పండగల్లేవు.. సెలవులేమైనా ఇచ్చారా? ఏంటీ..?

అబ్బాయ్ : లేదు.. లేదు.. బాబాయ్.. ఈనెల 13వ తేదీ ఓటు వేయాలని సెలవు పెట్టి మరీ వచ్చా.

బాబాయ్: ఓరి పిచ్చోడా... ఇక్కడ డబ్బులు ఇవ్వరంట. ఓటు వేయడానికి అనవసరంగా ఖర్చు పెట్టుకుని వచ్చావ్.

అబ్బాయ్ : నేను డబ్బుల కోసమో.. ఇంక దేనికోసమో రాలేదు బాబాయ్... రాజ్యాంగం నాకు ఇచ్చిన హక్కును వినియోగించుకోవడానికి ఎంతో కష్టపడి వచ్చా..

బాబాయ్ : ఏందిరా కష్టపడడం... నాయకులే డబ్బులు ఇచ్చి ఓటు వేయమని మన చుట్టూ తిరుగుతుంటే...

అబ్బాయ్ : ఆ హక్కు మనకు అంత తేలికగా రాలేదు. దాన్ని పోరాడి తెచ్చుకున్నాం.

బాబాయ్: అది స్వాతంత్ర్యం కదరా...? ఓటు ఏంటీ ?

అబ్బాయ్ : బాబాయ్... అప్పట్లో మనకు ఓటు ఉండేది కాదు.. రాజ్యాంగం లేదు... అప్పటి పాలకులు మనల్ని బానిసలు చేసి అండించేవాళ్లు. దాంతో మన వాళ్లు పోరాటాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చి, రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించారు.

బాబాయ్ : అవునురా...? అబ్బాయ్ ? నేనూ ఓటేస్తా.. డబ్బులు గిబ్బులు వద్దు... బాధ్యతతో ఓటేస్తా...!

- ఏఎస్‌పేట





బాటిల్ కోసం బారులు

- నేటి సాయంత్రం నుంచి మందు బంద్!
- తిరిగి 14న తెరుచుకోనున్న దుకాణాల తలుపులు
- ముందురోజు క్యూ కట్టిన మందుబాబులు



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు

ఉదయగిరి రూరల్, మే 10 : శనివారం సాయంత్రం తర్వాత మద్యం దుకాణాలు మూతపడతాయి. రెండ్రోజుల తర్వాత దుకాణాల తలుపుతు తెరుచుకుంటాయి. మధ్యలో ఆదివారం. ఇంకేముంది... మద్యం దుకాణాల ముందు మందుబాబులు క్యూకట్టారు. ఉదయగిరి నియోజకవర్గంలో శుక్రవారం మద్యం దుకాణాలు మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో దుకాణాల్లో అమ్మాల్సిన కోటా మధ్యాహ్నం 12 గంటలకే పూర్తవుతోంది. ఆ తరువాత మద్యం కావాలంటే బ్లాక్‌లో అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మరోవైపు పోలింగ్‌కు సమయం దగ్గరపడడం, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మద్యం బదులు డబ్బులు అందజేస్తున్నారు. దీంతో నగదు చేత పట్టుకుని మందుబాబులు దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులుతీరుతున్నారు. శుక్రవారం ఉదయగిరిలోని మూడు మద్యం షాపుల వద్ద మందుబాబులు బారులుతీరారు. షాపుల్లో లక్ష్యం పూర్తి కావడంతో సిబ్బంది మధ్యాహ్నానికే దుకా ణాలను మూసివేయడం, గంటల కొద్దీ క్యూలో నిలబడినా మద్యం దొరక్క పోవడంతో మందుబాబులు నిరాశతో వెనుతిరిగారు.

● **అధిక ధరలకు విక్రయాలు**

మద్యం అమ్మాల్సిన లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూతపడుతున్నాయి. కొంత మంది మద్యం బెల్టు నిర్వాహకులు ఇదేతం తుగా భావించి తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని ఒక్కో బాటిల్‌కు రూ.10 చొప్పున అందజేసి దుకాణాల నుంచి మద్యం తెప్పించుకుంటున్నారు. అనంతరం బ్లాక్‌లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అవసరాన్ని బట్టి క్వార్టర్‌పై రూ.100 నుంచి 150 అదనపు ధరకు విక్రయిస్తున్నారు.



మందు దొరుకుతుందో లేదో!



ఎర్రటి ఎండలో అవస్థలు పడుతూ..

● **వరికుంటపాడులో ఉద్రిక్తత**

వరికుంటపాడు : మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు అధికార పార్టీ నాయకులు, దుకాణ సిబ్బంది కి వరంగా మారుతోంది. నాయకుల అవస రాన్ని ఆసరా చేసుకొని జేబులు నింపుకుం టున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డి పల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో షాపుల నుంచి మద్యం పక్కదారి పడుతోంది. ముఖ్యంగా పెద్దిరెడ్డిపల్లిలో అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా అనుకూల వ్యక్తులకు మద్యం ఇస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రభు త్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిస్థాయి మద్యాన్ని తమకే కేటాయించాలని అధికార పార్టీ నాయకులు తమదైన శైలిలో సిబ్బందికి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులతోపాటు మద్యంప్రియులు శుక్రవారం ఉదయాన్నే మద్యం దుకాణం వద్దకు భారీస్థాయిలో చేరుకొని క్యూ కట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి బారులు తీయడంతో తొక్కిసలాట నడుమ ఉద్రిక్తత నెలకొంది. దీంతో ముక్కుబడిగా ఏర్పాటు చేసిన బారికేడ్లు సైతం విరిగిపోయాయి. అందిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ తిరుపతయ్య తన సిబ్బందితో హుటాహుటిన దుకాణం వద్దకు చేరుకుని అమ్మకాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోటేశ్వరరావు సైతం అక్కడికి చేరుకొని మద్యం అమ్మకాలను పర్యవేక్షించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

● **సీతారామపురంలో తోపులాట**

సీతారామపురం : సీతారామపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం రెండు మద్యం దుకాణాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. మద్యం కొనుగోలు చేసే వారి మధ్య తోపులాట జరిగింది. మద్యం విక్రయాలు లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూసేస్తున్నారు. ఈ క్రమంలో తమకు మద్యం దొరుకుతుందో లేదోనన్న ఆత్రుతతో మద్యం ప్రియులు బారులుదీరారు. దీనికితోడు సిబ్బంది ఓ వర్గానికే మద్యం విక్రయిస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు.



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులుతీరిన మందుబాబులు

ఎన్నికలకు పటిష్ట భద్రత

- 450 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి
- ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి
- జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం). మే 10: ప్రజలంతా నిర్భయంగా, శాంతి యుత వాతావరణంలో ఓటు వేసేలా సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 2,470 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిల్లో 450 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించామని, కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగా రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల సమయంలో కేసుల్లో ఉన్న సుమారు 10,485 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, 26 ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లు, 26 ఏఎస్‌టీలు, 46 ఎంసీసీ, 105 క్యూఆర్టీటీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రూ.2,72,31,845 నగదు, రూ.2,72,054 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 663 కేసుల్లో రూ.30,56,981 విలువ చేసే 3990.04 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 10కేసుల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన 205.8 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారాపై దాడులు చేసి 37.5 లీటర్లను స్వాధీనం చేసుకున్నామని, 28,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఇప్పటివరకు 67 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల ప్రలోభాలపై సీవిజిల్ యాప్, 1950 హెల్ప్‌లైన్, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



● **బందోబస్తుకు 4వేలకుపైగా సిబ్బంది**

ఎన్నికల బందోబస్తుకు 4వేల మందికిపైగా సిబ్బంది ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసులతోపాటు విశ్రాంత పోలీసులు, ఆర్మీ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతో పాటు 4ప్లటూన్ల బీఎస్ఎఫ్ బలగాలు, 4కంపెనీల తమిళనాడు రాష్ట్ర ఆర్మెడ్‌ఫోర్స్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

● **ఒక్కో సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి**

ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి అధికారిని ప్ర త్యేక అధికారిగా నియమించామన్నారు. నెల్లూరు అసెంబ్లీ స్థానానికి నెల్లూరు డీఎస్పీ, రూరల్‌కి ట్రాఫిక్ డీఎస్పీ, కోవూరుకి దిశ డీఎస్పీ, సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, కావలికి కావలి డీఎస్పీ, ఆత్మకూరుకి ఆత్మకూరు డీఎస్పీ, ఉదయగిరి, కందుకూరులకు కందుకూరు డీఎస్పీ, వెంకటగిరి పరిధిలోని మండలాలకు ఏఆర్ డీఎస్పీని ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు.

ఏజెంట్లు కోవర్టులైతే.. అంతే సంగతులు !

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పడిన కష్టానికి ఆ ఒక్కరోజే ఫలితం దక్కనుంది. పోలింగ్ రోజున బూత్‌లో కూర్చొని దొంగఓట్లను నిరోధించే పోలింగ్ ఏజెంట్ల చేతిలోనే అభ్యర్థుల భవిత ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడటం.. పోలింగ్ సక్రమంగా జరుగుతుందా... లేదా ? అని గమనించడం పోలింగ్ ఏజెంట్ల బాధ్యత. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని అతను నిశితంగా పరిశీలించాలి. అనుమానం వస్తే ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. కావున నమ్మకస్తులైనవారినే ఏజెంట్‌గా అభ్యర్థులు ఉంచుతారు. ఒకవేళ ఏజెంట్ అవతల పార్టీకి కోవర్టుగా మారినా, బెదిరింపులు, డబ్బుకు లొంగినా అభ్యర్థికి ఇక అంతే సంగతులు.

- ఉదయగిరి